www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు



సీఎస్ రామకృష్ణారావు పదవీ కాలం
మరో మూడు నెలల పొడిగింపు?
డీఓపీటీకి రాష్ట్ర ప్రభుత్వం లేఖ
13

శుక్రవారం | 15-8-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 | సంచిక (Issue) : 121 | హైదరాబాద్ సిటీ*
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం, తిథి: సప్తమి రా.11.50 తదుపరి అష్టమి, నక్షత్రం: అశ్విని ఉ.7.36 తదుపరి భరణి, వర్జ్యం: సా.4.36-6.06, దుర్ముహూర్తం: ఉ.8.32-9.23, మ.12.44-1.35, అమృతఘడియలు: రా.1.36-3.06, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 6.01, సూర్యాస్తమయం: 6.37

కశ్మీరులో వరద కల్లోలం

భారీ మేఘ విస్ఫోటం.. మెరుపు వరదల్లో 46 మంది దుర్మరణం




ఆస్పత్రిలో ఓ బాధితురాలు; జమ్మూ కశ్మీర్‌లోని చోసితి గ్రామం వద్ద వెలికితీసిన మృతదేహాలు

200 మందికి పైగా గల్లంతు!

- మృతుల్లో ఇద్దరు సీఐఎస్ఎఫ్ జవాన్లు..
- కిష్త్వార్ జిల్లాలోని చోసితి గ్రామంలో ఘటన
- మాచైల్ మాత యాత్రికులకిది బేస్‌పాయింట్
- మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం
- వరదల్లో కొట్టుకుపోయిన భక్తుల టెంట్లు, షాపులు
- 167 మందిని కాపాడిన సహాయక సిబ్బంది
- గాయపడ్డవారిలో 38 మంది పరిస్థితి విషమం
- జమ్మూకశ్మీరు ఎల్జీ, సీఎంకు అమిత్ షా ఫోన్
- కేంద్రం పూర్తిగా అండగా ఉంటుందని భరోసా
- ఘటన అత్యంత బాధాకరం: రాష్ట్రపతి, ప్రధాని

జమ్ము, ఆగస్టు 14: జమ్మూకశ్మీరులో మేఘవిస్ఫోటం (క్లౌడ్ బరస్ట్)తో భారీగా ప్రాణ నష్టం సంభవించింది. కిష్త్వార్ జిల్లాలోని మారుమూల గ్రామం చోసితిలో గురువారం హఠాత్తుగా మేఘవిస్ఫోటం జరగడంతో మెరుపు వరదలు వచ్చాయి. మాచైల్ మాత ఆలయానికి వెళ్లే యాత్రికుల కోసం ఇక్కడ లంగర్ (సామూహిక వంటశాలలు) ఏర్పాటు చేస్తారు. ఇదే బేస్‌పాయింట్. యాత్రికులు ఇక్కడే వాహనాలు వదిలి, కాలినడకన మాచైల్ మాత గుడికి వెళ్తారు. గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా మెరుపు వరదలు రావడంతో భక్తుల టెంట్లు, దుకాణాలు, వసతి సౌకర్యాలు, సెక్యూరిటీ అవుట్ పోస్టులన్నీ కొట్టుకుపోయాయి. ఈ విషాద ఘటనలో


మిగతా 2వ పేజీలో...

వదలని వాన

పాలమూరు, రంగారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు 12

ములుగు జిల్లాలో గల్లంతైన ఆశావర్కర్ మృతి.. మరొకరి గల్లంతు

భారత్ రేటింగ్ పెంపు



మైనస్ బీబీబీ నుంచి బీబీబీకి అప్‌గ్రేడ్ చేసిన ఎస్ అండ్ పీ

- 18 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి
- భారత ఆర్థిక వ్యవస్థ భేష్
- ట్రంప్ సుంకాల పోటు ఉండదు
- అందుకే పరపతి రేటింగ్ పెంచుతున్నాం

న్యూఢిల్లీ: భారత్ మృత ఆర్థిక వ్యవస్థ అని నోరు పారేసుకున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఆ దేశానికే చెందిన ప్రముఖ అంతర్జాతీయ పరపతి రేటింగ్ సంస్థ 'ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్' గట్టి సమాధానం ఇచ్చింది. దీర్ఘకాలిక దృష్టితో చూస్తే భారత ఆర్థిక వ్యవస్థ పునాదులు చాలా పటిష్ఠంగా ఉన్నట్టు తెలిపింది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని భారత దేశ సార్వభౌమ పరపతి రేటింగ్‌ను 'బీబీబీ మైనస్' స్థాయి నుంచి 'బీబీబీ' స్థాయికి పెంచుతున్నట్టు ప్రకటించింది. గత 18 సంవత్సరాల్లో ఈ సంస్థ మన దేశ పరపతి రేటింగ్‌ను పెంచడం ఇదే మొదటిసారి. ట్రంప్ సుంకాల పోటు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా, హుషారుగా ఉన్నట్టు తెలిపింది. ఈ పరపతి రేటింగ్ పెంపుతో కేంద్ర ప్రభుత్వం, ప్రైవేటు కంపెనీలు తక్కువ వడ్డీకే విదేశాల నుంచి రుణాలు, నిధులు సమీకరించగలుగుతాయని భావిస్తున్నారు.

వృద్ధికి ఢోకా లేదు

ట్రంప్ సుంకాల కత్తి వేలాడుతున్నా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ వృద్ధి రేటుకు ఎలాంటి ఢోకా ఉండదని ఎస్ అండ్ పీ గ్లోబల్ అంచనా. గత ఆర్థిక సంవత్సరంలోలానే ఈ ఆర్థిక సంవత్సరం కూడా భారత ఆర్థిక వ్యవస్థ 6.5 శాతం వృద్ధి రేటు నమోదు చేస్తుందని తెలిపింది. తగ్గుతున్న వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణం ఇందుకు దోహదం చేస్తాయని పేర్కొంది.

పెట్టుబడులకు ఊతం!

పరపతి రేటింగ్ పెంపు విదేశాల నుంచి మన దేశం మరిన్ని పెట్టుబడులు ఆకర్షించేందుకూ దోహదం చేయనుంది. ఈ రేటింగ్ పెంపుతో మన దేశ మధ్య, దీర్ఘకాలిక అవకాశాలపై దేశ, విదేశీ పెట్టుబడిదారులకు మరింత నమ్మకం ఏర్పడనుంది. దీంతో ఎఫ్‌పీఐలతో పాటు విదేశీ కంపెనీలూ మన దేశంలో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తాయని భావిస్తున్నారు. ట్రంప్ సుంకాలతో అనిశ్చితిలో పడిన భారత ఆర్థిక వ్యవస్థకు ఈ పరపతి రేటింగ్ పెంపు పెద్ద ఊరట అని మద్రాస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ డైరెక్టర్ ఎన్‌ఆర్ భానుమూర్తి చెప్పారు. ఈ రేటింగ్స్ ప్రభావం ఫారెక్స్ మార్కెట్లో రూపాయి మారకం రేటు స్థిరపడేందుకూ దోహదం చేస్తుందని ఆర్థిక నిపుణుల అంచనా.

అమెరికా రేటింగ్ మాత్రం కిందికి..

డొనాల్డ్ ట్రంప్ అధికార పగ్గాలు చేపట్టిన మూడు నెలలకే అంటే మే నెలలో మూడీస్ రేటింగ్స్.. అమెరికా పరపతి రేటింగ్‌ను ట్రిపుల్ ఏ నుంచి డబుల్ 'ఏ'కు తగ్గించింది. అంతకుముందు ఫిచ్ రేటింగ్స్ కూడా 2023 ఆగస్టులో అమెరికా పరపతి రేటింగ్‌ను ట్రిపుల్ ఏ రేటింగ్ నుంచి డబుల్ ఏ రేటింగ్‌కు తగ్గించింది. అప్పటి నుంచే అమెరికాలో వడ్డీ రేట్లు గణనీయంగా పెరిగాయి. తాజాగా ట్రంప్ సుంకాల పోటు, అర్థంపర్థం లేని ఆర్థిక విధానాలతో అమెరికా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి వెళ్లే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కాగ్నిజెంట్‌లో 80% సిబ్బంది జీతం పెంపు

నవంబరు 1 నుంచి అమల్లోకి..

న్యూఢిల్లీ: ఈ ఏడాది నవంబరు 1 నుంచి 80 శాతం సిబ్బంది వేతనాన్ని పెంచనున్నట్టు నాస్‌డాక్ లిస్టెడ్ ఐటీ కంపెనీ కాగ్నిజెంట్ గురువారం ప్రకటించింది. సీనియర్ అసోసియేట్ లెవెల్ వరకు ఉద్యోగులకు వేతన పెంపు ఉండనుందని తెలిపింది. జీతం పెంపు శాతం ఉద్యోగి పనితీరు, ఏ దేశంలోని కార్యాలయంలో పనిచేస్తున్నాడనే ప్రాతిపదికన నిర్ణయించనున్నట్లు కాగ్నిజెంట్ అధికార ప్రతినిధి వెల్లడించారు. భారత్‌లో నిలకడగా మంచి పనితీరు కనబరుస్తున్న ఉద్యోగికి 9 శాతం వరకు జీతం పెరిగే అవకాశం ఉందన్నారు. టాప్ పెర్‌ఫార్మర్లకు అత్యధిక వేతన పెంపు లభించనుందన్నారు. ఈ ఏడాది ద్వితీయార్థంలో తమ ఉద్యోగులకు పనితీరు ఆధారంగా వేతనాలను పెంచాలనుకుంటున్నట్లు గత నెల 31న రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగానూ కంపెనీ వెల్లడించింది. ఈ మార్చిలో కాగ్నిజెంట్ తన ఉద్యోగులకు గడిచిన మూడేళ్లలో అత్యధిక బోనస్‌ను ప్రకటించింది. కాగా, దేశీయ ఐటీ దిగ్గజం టీసీఎస్ కూడా గత వారంలో 80 శాతం సిబ్బందికి (జూనియర్ నుంచి మధ్య స్థాయి వరకు ఉద్యోగులకు) వేతన పెంపును ప్రకటించింది.

ఒరాకిల్‌లో 150కి పైగా ఉద్యోగాల కోత

అమెరికన్ ఐటీ కంపెనీ ఒరాకిల్ తన క్లౌడ్ విభాగం నుంచి 150కి పైగా ఉద్యోగులను తొలగించబోతున్నట్లు తెలిసింది. కంపెనీ తాజా నిర్ణయంతో యూఎస్‌తో పాటు భారత కార్యాలయాల్లోని ఈ విభాగ ఉద్యోగులపై ప్రభావం పడనుందని సమాచారం.

నవ లిమిటెడ్ లాభం రూ.399 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నవ లిమిటెడ్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,232.60 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.399.10 నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే ఆదాయం 2 శాతం, లాభం 10.5 శాతం తగ్గింది. అయితే గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంతో పోల్చితే మాత్రం ఆదాయం 16.7 శాతం, లాభం 31.8 శాతం వృద్ధి చెందింది. కాగా స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.572.70 కోట్ల ఆదాయంపై రూ.141 కోట్ల లాభాన్ని ప్రకటించింది. సమీక్షా త్రైమాసికంలో మెటల్స్ వ్యాపారంతో పాటు ఎనర్జీ పోర్టుఫోలియో పనితీరు మెరుగ్గా ఉండటం కలిసి వచ్చిందని కంపెనీ పేర్కొంది. అయితే జాంబియాలోని విద్యుత్ డివిజన్ మాంబా ఎనర్జీ లిమిటెడ్ (ఎంఈఎల్)కు సంబంధించి 50 శాతం ట్యాక్స్ కన్సెషన్స్ అమలు చేయటం కంపెనీపై కొంత మేర ప్రభావం చూపించిందని తెలిపింది.

యూపీఐ పీ2పీ కలెక్ట్ రిక్వెస్ట్‌లకు స్వస్తి

అక్టోబరు 1 నుంచి అమలు

న్యూఢిల్లీ: డిజిటల్ మోసాలను అరికట్టేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. ఏకీకృత చెల్లింపుల వ్యవస్థ (యూపీఐ)లో పీర్ టు పీర్ (పీ2పీ) కలెక్ట్ రిక్వెస్ట్‌లకు స్వస్తి పలుకుతున్నట్లు గురువారం ప్రకటించింది. ఈ అక్టోబరు 1 నుంచి బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్ల (పీఎస్‌పీ)తో పాటు ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం వంటి థర్డ్ పార్టీ డిజిటల్ పేమెంట్ యాప్‌లు.. యూపీఐలో పీ2పీ కలెక్ట్ రిక్వెస్ట్ లావాదేవీలను అనుమతించరాదని ఎన్‌పీసీఐ నిర్దేశించింది. తమ వ్యవస్థలో తదనుగుణంగా మార్పులు చేసుకోవాలని కోరింది. యూపీఐ వినియోగదారుల్లో ఒక వ్యక్తి మరో వ్యక్తి నుంచి నగదు కోరేందుకు పీ2పీ కలెక్ట్ రిక్వెస్ట్ ఫీచర్ వీలుకల్పిస్తుంది. ముఖ్యంగా స్నేహితులు లేదా సన్నిహితులు తమ మధ్య తిరిగి చెల్లింపులు లేదా బిల్లు చెల్లింపు భారాన్ని సమంగా పంచుకునేందుకు (స్లిట్టింగ్ బిల్స్) దీన్ని విరివిగా వినియోగించుకుంటున్నారు. ప్రస్తుతం ఒక వ్యక్తి పీ2పీ కాల్ రిక్వెస్ట్ లావాదేవీ ద్వారా మరో వ్యక్తి నుంచి రూ.2,000 వరకు పొందే వీలుంది. రోజులో గరిష్ఠంగా 50 లావాదేవీలు నెరిపేందుకు అనుమతి ఉంది. అయితే, ఈ మార్గంలోనూ డిజిటల్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ఎన్‌పీసీఐ వీటిని నిలిపివేయాలని నిర్ణయించింది.

తగ్గిన అమరరాజా లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో రూ.164.8 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.249.12 కోట్లతో పోల్చితే లాభం 33 శాతం తగ్గింది. అధిక వ్యయాలే లాభాల క్షీణతకు కారణమని కంపెనీ తెలిపింది. సమీక్షా త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.3,263.05 కోట్ల నుంచి రూ.3,401.08 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు రూ.2,957.93 కోట్ల నుంచి రూ.3,190.66 కోట్లకు పెరిగాయి. ఉత్పత్తిలో వినియోగించిన వస్తువుల వ్యయాలు రూ.1,692.77 కోట్ల నుంచి రూ.1,800.68 పెరిగినట్టు కంపెనీ వెల్లడించింది. సమీక్షా కాలంలో లెడ్ యాసిడ్ బ్యాటరీలు, అనుబంధ ఉత్పత్తుల విభాగం రూ.3,279.79 కోట్లు, న్యూ ఎనర్జీ విభాగం రూ.121.29 కోట్ల ఆదాయం ఆర్జించాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,300 ▼	92,850 ▼	1,26,000 ▲
విజయవాడ	1,03,000 ▼	97,000 ▲	1,18,250 ▼
విశాఖపట్నం	1,03,010 ▲	93,750 ▼	1,26,000 ▲
రాజమండ్రి	1,01,350 ▼	92,900 ▼	1,18,800 ▲
ప్రొద్దుటూరు	1,00,950 ▲	92,870 ▲	1,17,700 ▲
ముంబై	1,00,023 ▲	91,621 ▲	1,14,933 ▼

జూలై ఎగుమతుల్లో 7% వృద్ధి

న్యూఢిల్లీ: ఎగుమతుల రంగం రెండు నెలల క్షీణతకు స్వస్తి పలికింది. జూలైలో ఎగుమతులు 7.29 శాతం వృద్ధితో 3,724 కోట్ల డాలర్లుగా (రూ.3.24 లక్షల కోట్లు) నమోదయ్యాయి. ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, వజ్రాభరణాలు, ఫార్మా, కెమికల్స్ రంగాలు ఈ వృద్ధికి ఊతం ఇచ్చాయి. అదే సమయంలో వాణిజ్య లోటు మాత్రం 8 నెలల గరిష్ఠ స్థాయి 2,735 కోట్ల డాలర్లకు (రూ.2.38 లక్షల కోట్లు) దూసుకుపోయింది. గత ఏడాది నవంబరులో నమోదైన వాణిజ్య లోటు 3,177 కోట్ల డాలర్ల (రూ.2.76 లక్షల కోట్లు) తర్వాత నమోదైన గరిష్ఠ స్థాయి ఇదే. గురువారం వాణిజ్య శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం దిగుమతులు 8.6% వృద్ధితో 6,459 కోట్ల డాలర్లకు (రూ.5.62 లక్షల కోట్లు) చేరాయి.

అమెరికాతో వాణిజ్యం అప్

ట్రంప్ సుంకాల నేపథ్యంలోనూ భారత్-అమెరికా దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం పెరుగుతోంది. జూలైలో మన దేశం అమెరికాకు 801 కోట్ల డాలర్ల విలువైన సరుకులు ఎగుమతి చేసి..ఆ దేశం నుంచి 455 కోట్ల డాలర్ల విలువైన సరుకులు దిగుమతి చేసుకుంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే జూలైలో భారత ఎగుమతులు 19.94 శాతం పెరగగా, దిగుమతులు 13.78 శాతం పెరిగాయని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లోనూ అమెరికాకు మన ఎగుమతులు 21.64 శాతం పెరిగి 3,353 కోట్ల డాలర్లకు చేరాయి. ఆ దేశం నుచి మన దేశానికి వచ్చే దిగుమతులూ 12.33 శాతం పెరిగి 1,741 కోట్ల డాలర్లకు చేరాయి.

మార్కెట్లో ఆద్యంతం ఊగిసలాటలే..

సెన్సెక్స్ 57 పాయింట్ల లాభంతో ముగింపు

ముంబై: స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు గురువారం ఆద్యంతం తీవ్ర ఊగిసలాటలకు లోనైనప్పటికీ, అతి స్వల్ప లాభాలను నమోదు చేయగలిగాయి. సెన్సెక్స్ 57.75 పాయింట్లు పెరిగి 80,597.66 వద్ద స్థిరపడింది. ఒక దశలో సూచీ 211 పాయింట్లు ఎగబాకి 80,751 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. నిఫ్టీ విషయానికొస్తే, 11.95 పాయింట్ల వృద్ధితో 24,631.30 వద్ద స్థిరపడింది. శుక్రవారం ట్రంప్-పుతిన్ భేటీ నేపథ్యంలో ఇన్వెస్టర్లు ముందు జాగ్రత్త ధోరణితో వ్యవహరించారని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో సగమే రాణించాయి. ఈ వారం మొత్తానికి సెన్సెక్స్ 739.87 పాయింట్లు (0.92 శాతం), నిఫ్టీ 268 పాయింట్లు (1.10 శాతం) లాభపడ్డాయి

నేడు మార్కెట్లకు సెలవు: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్టాక్ మార్కెట్లు బీఎస్‌ఈ,ఎన్ఎస్ఈలకు సెలవు. కమోడిటీ మార్కెట్లు కూడా పని చేయవు. వచ్చే సోమవారం మార్కెట్లు యథావిధిగా పనిచేస్తాయి.

డీఈసీ ఇన్‌ఫ్రాకు రూ.2,000 కోట్ల ఆర్డర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న డీఈసీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ అండ్ ప్రాజెక్ట్స్.. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.2,000 కోట్ల విలువైన కాంట్రాక్ట్‌ను దక్కించుకుంది. ఈ మేరకు సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ నుంచి లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్స్‌ను అందుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఆర్డర్‌లో భాగంగా ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం రెసిడెన్షియల్ భవనాలను నిర్మించాల్సి ఉంటుందని తెలిపింది. శ్రీనివాసపురిలోని 20.86 ఎకరాల విస్తీర్ణంలో మొత్తం 16 బ్లాకుల్లో 1,100 చదరపు అడుగులతో 3,112 డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లను నిర్మించాల్సి ఉంటుందని పేర్కొంది. ప్రస్తుతం కంపెనీ చేతిలో రూ.10,000 కోట్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

15వ తేదీ			
హైదరాబాద్	485	విజయవాడ	520
వరంగల్	487	గోదావరి	510
చిత్తూరు	548	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	102	విజయవాడ	119
వరంగల్	102	గుంటూరు	121
కరీంనగర్	102	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	102	చిత్తూరు	95
కర్నూలు	102	నెల్లూరు	100
విశాఖపట్నం	113	అనంతపురం	100
గోదావరి	119		

స్పోర్ట్స్

దయచేసి మాతో ఆడొద్దు!



- ఆడితే చిత్తవుతాం
- పాక్ మాజీ క్రికెటర్ బాసిత్ అలీ

కరాచీ: త్వరలో జరిగే ఆసియాకప్ టీ20 టోర్నీలో భారత జట్టు తమతో మ్యాచ్‌ను బహిష్కరించాలని పాకిస్థాన్ మాజీ ఆటగాడు బాసిత్ అలీ కోరాడు. మంగళవారం జరిగిన మూడో వన్డేలో విండీస్ 202 పరుగుల తేడాతో పాక్‌ను చిత్తుగా ఓడించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో భారత్ చేతిలోనూ తమ జట్టుకు చావుదెబ్బ తప్పదని చెప్పాడు. 'ఆసియాకప్‌లో పాక్‌తో మ్యాచ్ ఆడకుండా భారత్ నిర్ణయం తీసుకోవాలని ప్రార్థిస్తున్నా. ఇటీవలి వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ మాదిరే మా జట్టుతో ఆటను వారు బహిష్కరించాలి. ఎందుకంటే టీమిండియా పాక్ జట్టును ఎంత ఘోరంగా ఓడిస్తుందో ఆలోచిస్తేనే వణుకు పుడుతోంది. అఫ్ఘాన్ చేతిలో ఓడితే ఎవరూ పట్టించుకోరేమో కానీ భారత్‌పై ఓటమిని పాక్‌లో జీర్ణించుకోలేరు' అని బాసిత్ తమ జట్టు ఆటగాళ్ల పేలవ ఫామ్‌పై వ్యంగ్యంగా స్పందించాడు.

నా శిష్యుల్లో కోహ్లీ బెస్ట్



● రవిశాస్త్రి

న్యూఢిల్లీ: తాను శిక్షణ ఇచ్చిన టీమిండియా ఆటగాళ్లలో విరాట్ కోహ్లీ అత్యుత్తమ ప్లేయర్ అని రవిశాస్త్రి ప్రశంసించాడు. 2017-2021 వరకు భారత జట్టు కోచ్‌గా శాస్త్రి వ్యవహరించాడు. కోహ్లీ అద్భుత ప్రదర్శన కారణంగానే తన హయాంలో భారత్ టెస్టుల్లో టాప్ టీమ్‌గా నిలిచిందని చెప్పాడు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్‌లో కొన్ని మ్యాచ్‌ల్లో కోహ్లీ ప్రదర్శన నమ్మశక్యం కాని రీతిలో ఉందన్నాడు. ధోనీ రిటైర్మెంట్ తర్వాత జట్టును నడిపించే నాయకత్వ లక్షణాలు కోహ్లీలోనే చూశానని తెలిపాడు. బ్యాటర్‌గా తన బాధ్యతలు నిర్వహిస్తూనే.. జట్టు గెలుపు కోసం తుదికంటా పోరాడేవాడని కితాబిచ్చాడు.

45 ఏళ్ల వీనస్‌కు వైల్డ్‌కార్డ్

యూఎస్ ఓపెన్



న్యూయార్క్: లేటు వయసులో యూఎస్ ఓపెన్ సింగిల్స్ వైల్డ్‌కార్డ్ అందుకొన్న ప్లేయర్‌గా అమెరికా వెటరన్ వీనస్ విలియమ్స్ (45) రికార్డులకెక్కింది. ఈ నెల 24 నుంచి జరగనున్న యూఎస్ ఓపెన్‌కు సంబంధించిన వైల్డ్‌కార్డ్ ఎంట్రీలను నిర్వాహకులు ప్రకటించారు. రెండేళ్ల విరామం తర్వాత వీనస్ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ బరిలోకి దిగనుంది. ఈ క్రమంలో 1981లో రెనీ రిచర్డ్స్ (47) తర్వాత సింగిల్స్ వైల్డ్‌కార్డ్ అందుకొన్న పెద్ద వయసు ప్లేయర్‌గా విలియమ్స్ నిలిచింది. పురుషుల సింగిల్స్‌లో భారత సంతతికి చెందిన అమెరికా ఆటగాడు నిశేష్ బసవారెడ్డి (20)కి కూడా వైల్డ్‌కార్డ్ లభించింది. నెల్లూరు జిల్లాకు చెందిన నిశేష్ తండ్రి...మురళీకృష్ణ 1999లో అమెరికా వెళ్లి స్థిరపడ్డారు.



బసవారెడ్డి

మధుర జ్ఞాపకం

సచిన్ తొలి శతకానికి 35 ఏళ్లు



ముంబై: సచిన్ టెండూల్కర్..24 ఏళ్ల సుదీర్ఘ క్రికెట్ కెరీర్‌లో నెలకొల్పిన రికార్డులు ఎన్నో..అందుకున్న ఘనతలు మరెన్నో.. 664 అంతర్జాతీయ మ్యాచ్‌లలో 34,357 పరుగులు, 100 సెంచరీలు. ఈ శతకాలకు పునాది పడింది 35 ఏళ్ల కిందట..1990 ఆగస్టు 14న ఓల్డ్‌ట్రాఫర్డ్ మైదానంలో. తొలి సెంచరీ ఏ క్రికెటర్‌కైనా ఎంతో అపురూపం. పైగా..ఆ శతకం జట్టును ఓటమి కోరలనుంచి తప్పించినదైతే ఆ థ్రిల్లే వేరు కదా! ఇంగ్లండ్‌తో మూడు టెస్టుల సిరీస్‌లో భాగంగా ఓల్డ్‌ట్రాఫోర్డ్ రెండో టెస్టుకు వేదికైంది. ఆ టెస్టు సచిన్‌కు తొమ్మిదవది. ఆ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 68 పరుగులు చేసిన 17 ఏళ్ల టెండూల్కర్..408 పరుగుల లక్ష్యంతో చివరి రోజు 103/4తో జట్టు క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న దశలో ఆరో నెంబర్‌లో క్రీజులోకి వచ్చాడు. బంతి రివ్వుమని దూసుకొస్తూ బ్యాటర్లకు దడ పుట్టిస్తోంది. ఈ తరుణంలో దుర్భేద్యమైన డిఫెన్స్ ఆటతో ఇంగ్లండ్ బౌలర్లకు ఎదురొడ్డాడు. ఓ పక్క సహచరులు అవుటవుతున్నా వెరవలేదు. చూడముచ్చటైన బౌండరీలతో ఆకట్టుకొని సెంచరీ సాధించిన సచిన్ (189 బంతుల్లో 17 ఫోర్లతో 119 నాటౌట్) మనోజ్ ప్రభాకర్ (67 నాటౌట్) జతగా మ్యాచ్‌ను డ్రా (343/6) చేయగలిగాడు.

ఒలింపిక్స్ హాకీ కాంస్య విజేత, లియాండర్ తండ్రి

వేస్ పేస్ మృతి





లియాండర్

కోల్‌కతా: టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ తండ్రి, హాకీ మాజీ ఆటగాడు వేస్ పేస్ (80) మరణించాడు. పార్కిన్సన్ వ్యాధితో బాధపడుతున్న వేస్ పేస్‌ను గత మంగళవారం ఇక్కడి ఓ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. విదేశాలలో స్థిరపడిన వేస్ పేస్ కుమార్తెలు వచ్చాక ఆయన అంత్యక్రియలు సోమ లేదా మంగళవారం జరపనున్నట్టు కుటుంబ సభ్యులు వెల్లడించారు. వేస్ పేస్ భార్య జెన్నిఫర్ భారత బాస్కెట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్. భారత క్రీడా రంగంతో వేస్ పేస్‌కు సుదీర్ఘ అనుబంధం ఉంది. మిడ్‌ఫీల్డర్‌గా జాతీయ హాకీ జట్టుకు సేవలందించాడు. 1971 బార్సిలోనా వరల్డ్ కప్, 1972 మ్యూనిచ్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకాలు గెలుపొందిన భారత జట్లలో పేస్ సభ్యుడు. ఫుట్‌బాల్, క్రికెట్, రగ్బీ క్రీడలలోనూ పేస్‌కు ప్రవేశం ఉంది. డివిజన్ స్థాయిలో ఆ మూడు క్రీడలకు అతడు ప్రాతినిధ్యం వహించాడు. 1945లో గోవాలో జన్మించిన వేస్ పేస్ ఆటలతోపాటు చదువులోనూ ఎంతో ప్రతిభావంతుడు. హాకీ నుంచి రిటైర్ అయ్యాక స్పోర్ట్స్ మెడిసిన్ డాక్టర్‌గా మారాడు. ఆసియా క్రికెట్ కౌన్సిల్, బీసీసీఐ, భారత డేవిస్ కప్ జట్టుకు కన్సల్టెంట్ డాక్టర్‌గా వ్యవహరించాడు. కుమారుడు లియాండర్ పేస్‌కు మేనేజర్‌గానూ బాధ్యతలు నిర్వర్తించాడు. కుటుంబ వారసత్వాన్ని కొనసాగిస్తూ లియాండర్ పేస్ 1996 అట్లాంటా ఒలింపిక్స్ టెన్నిస్ సింగిల్స్‌లో కాంస్యం నెగ్గడం విశేషం.. దేశ క్రీడా రంగానికి వేస్ పేస్ అందించిన సేవలు వెల కట్టలేనివని అంటూ ఆయన మృతికి టెన్నిస్ మాజీ ఏస్ సానియా మీర్జా సంతాపం తెలిపింది.

చెన్నై గ్రాండ్ మాస్టర్స్ విజేత విన్సెంట్

అర్జున్ టైటిల్ ఆశలు ఆవిరి

చెన్నై: జర్మనీ గ్రాండ్ మాస్టర్ విన్సెంట్ కీమర్.. మరో రౌండ్ మిగిలుండగానే చెన్నై గ్రాండ్ మాస్టర్స్ టోర్నీ టైటిల్‌ను సొంతం చేసుకొన్నాడు. గురువారం జరిగిన ఎనిమిదో రౌండ్‌ను డ్రా చేసుకొన్న విన్సెంట్ మొత్తం ఆరు పాయింట్లతో టాప్‌లో నిలిచాడు. సహచరుడు విదిత్ గుజరాతీతో గేమ్‌ను జీఎం అర్జున్ ఇరిగేసి డ్రా చేసుకొన్నాడు. దీంతో అగ్రస్థానంలో నిలిచే అవకాశాన్ని ఇరిగేసి కోల్పోయాడు. సహచరులు కార్తికేయన్ మురళీ, నిహాల్ సరీన్ మధ్య గేమ్ కూడా డ్రాగా ముగిసింది. అర్జున్, కార్తికేయన్ చెరో 4.5 పాయింట్లతో రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. శుక్రవారం తొమ్మిదో, ఆఖరి రౌండ్ జరగనుంది. చాంపియన్స్ విభాగంలో ప్రనేష్ చేతిలో జీఎం ద్రోణవల్లి హారిక, ఆర్యన్ చోప్రా చేతిలో వైశాలి పరాజయం పాలయ్యారు.

ర్యాపిడ్‌లో గుకేష్‌కు 4వ స్థానం



సెయింట్ లూయిస్ (యూఎస్): వరల్డ్ చెస్ టూర్‌లో భాగంగా జరుగుతున్న సెయింట్ లూయిస్ ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ టోర్నీలో ర్యాపిడ్ రౌండ్‌లు ముగిసే సరికి వరల్డ్ చాంపియన్ గుకేష్ దొమ్మరాజు నాలుగో స్థానంలో నిలిచాడు. 9 రౌండ్ల ర్యాపిడ్‌లో గుకేష్ నాలుగు గేమ్‌లు గెలిచి.. రెండు గేమ్‌లను డ్రా చేసుకొన్నాడు. మొత్తం 10 పాయింట్లతో నాలుగో స్థానం దక్కించుకొన్నాడు. అమెరికా జీఎం ఫాబినో కరువానా 14 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు.

'బైపాస్' కాలేదు అడ్డంకి..

నాలుగు స్వర్ణాలతో ఔరా !

జాతీయ పవర్ లిఫ్టింగ్‌లో 73 ఏళ్ల శంకర్ రావు సంచలనం



కోజికోడ్: ఆయన వయస్సు 73 సంవత్సరాలు.. ఆరు నెలల కిందటే బైపాస్ సర్జరీ అయ్యింది.. సాధారణంగా అంత పెద్ద ఆపరేషన్ అయితే మరెవరైనా విశ్రాంతికే పరిమితమవుతారు..కానీ ఆయన అలా కూర్చోలేదు.. అప్పటిదాకా పెద్దగా పరిచయంలేని పవర్‌లిఫ్టింగ్‌లోకి అడుగుపెట్టారు..కోజికోడ్ ఆతిథ్యమిచ్చిన జాతీయ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్స్‌లో ఏకంగా నాలుగు స్వర్ణాలు సాధించి చరిత్ర సృష్టించారు..ఆయనే భద్రాచలానికి చెందిన డీవీ శంకర్ రావు. ఎస్‌బీఐలో ఉద్యోగం చేసి రిటైరైన ఆయన జాతీయ పోటీల 83 కిలోల మాస్టర్-4 విభాగంలో బరిలోకి దిగారు. వ్యక్తిగత విభాగాలలో మూడు, ఓవరాల్ చాంపియన్‌గా మరొకటి కలిపి మొత్తం నాలుగు పసిడి పతకాలు కొల్లగొట్టి అబ్బురపరిచారు. బైపాస్ సర్జరీ అయ్యాక పోటీలలో పాల్గొనడంతో పాటు నాలుగు పసిడి పతకాలు సొంతం చేసుకోవడం జాతీయ పవర్ లిఫ్టింగ్ చరిత్రలో తొలిసారని పవర్ లిఫ్టింగ్ వర్గాలు వెల్లడించాయి.

పెళ్లి పీటలెక్కనున్న అర్జున్



ముంబై: దిగ్గజ బ్యాటర్ సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్ త్వరలోనే పెళ్లి పీటలెక్కనున్నాడు. స్థానిక పారిశ్రామికవేత్త రవి ఘాయ్ మనవరాలు సానియా చందోక్‌తో అర్జున్ (25)కు ఈనెల 11న నిశ్చితార్థం జరిగింది. ముంబైలోని సానియా స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఇరువురి కుటుంబ సభ్యులు మాత్రమే హాజరయ్యారట. అయితే ఈ విషయమై ఇరు కుటుంబాల నుంచి ఎటువంటి ప్రకటనా రాలేదు. మరోవైపు ఈ సానియా గురించి అభిమానులు నెట్టింట తెగ శోధిస్తున్నారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో చదువుకున్న తను పెంపుడు జంతువుల కోసం ముంబైలో స్పా అండ్ స్టోర్‌ను నిర్వహిస్తోంది. అలాగే ప్రపంచ ప్రఖ్యాత బాస్కిన్-రాబిన్స్ ఐస్‌క్రీమ్‌కు సంబంధించి భారత్‌లో వ్యవహారాలను వీరి కుటుంబానికి చెందిన గ్రావిస్ గ్రూప్ చూస్తోంది. ఇంకా బ్రూక్లిన్ క్రీమరీ ఐస్‌క్రీమ్‌తో పాటు ఇంటర్ కాంటినెంటల్ హోటల్స్ కూడా వీరి సొంతమే. రియల్ ఎస్టేట్‌లోనూ రవి ఘాయ్‌కు చెందిన గ్రూప్ ప్రముఖ పాత్ర పోషిస్తోంది.

మ్యాచ్‌ల ఎంపిక సరికాదు



బుమ్రాపై అజర్ అసంతృప్తి

న్యూఢిల్లీ: అండర్సన్-టెండూల్కర్ సిరీస్‌లో పేసర్ బుమ్రా అన్ని టెస్టులూ ఆడకపోవడంపై విమర్శలు కొనసాగుతూనే ఉన్నాయి. పని ఒత్తిడి కారణంగా తను కీలక మ్యాచ్‌లకు దూరమయ్యాడు. తాజాగా మాజీ కెప్టెన్ అజరుద్దీన్ కూడా ఇదే విషయమై అసంతృప్తిని వ్యక్తం చేశాడు. 'ఒక్కసారి జట్టులోకి వస్తే ఫలానా మ్యాచ్‌లే ఆడతానని ఎంపిక చేసుకోవడం కుదరదు. పని ఒత్తిడి అనేది ఉంటుంది. అయినా అంతర్జాతీయ స్థాయిలో ఆడుతున్నప్పుడు ఎవరికి వారే దీన్ని ఎదుర్కోవాలి. టెస్టు సిరీస్‌లో పేసర్లు సిరాజ్, ప్రసిద్ధ్, ఆకాశ్ రాణించడం జట్టు అదృష్టం. ఒకవేళ ఏదైనా క్లిష్ట సమయాల్లో బుమ్రా అవసరం ఏర్పడి ఉంటే పరిస్థితి ఎలా ఉండేది? గాయమైన సందర్భాల్లో మ్యాచ్‌కు దూరం కావడంపై బోర్డు, ఆటగాడు కలిసి నిర్ణయం తీసుకోవాలి' అని అజర్ సూచించాడు.



www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

శుక్రవారం | 15-8-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 121 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం, తిథి: సప్తమి రా.11.50 తదుపరి అష్టమి, నక్షత్రం: అశ్విని ఉ.7.36 తదుపరి భరణి, వర్జ్యం: సా.4.36-6.06, దుర్ముహూర్తం: ఉ.8.32-9.23, మ.12.44-1.35, అమృతఘడియలు: రా.1.36-3.06, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 6.01, సూర్యాస్తమయం: 6.37 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కానిస్టేబుల్ రాజు నాయక్‌కు శౌర్య పతకం

ఏఎస్సై సిద్దయ్య, కానిస్టేబుల్ హసేన్‌కు రాష్ట్రపతి పోలీస్ విశిష్ట సేవా పతకం

21 మంది తెలంగాణ పోలీసులకు పతకాలు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పోలీస్ పతకాలను ప్రకటించిన కేంద్రం

దక్షిణ మధ్య రైల్వేలో ఇద్దరికి పతకాలు 14

సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్‌కు రాష్ట్రపతి మెరిటోరియస్ అవార్డు

'సిందూర్' వీరులకు శౌర్య పతకాలు.. 16 మంది బీఎస్ఎఫ్ సిబ్బందికి ప్రకటించిన కేంద్రం

65 లక్షల మంది పేర్లు వెల్లడించండి

బిహార్‌లో తొలగించిన ఓటర్ల విషయంలో ఈసీకి సుప్రీం ఆదేశం

ఓటర్ల జాబితా నుంచి తొలగింపునకు కారణాలూ చెప్పాలని స్పష్టీకరణ



19వ తేదీలోగా ఈసీ వెబ్‌సైట్లలో ప్రచురించాలి

బ్లాక్‌డెవలప్‌మెంట్/పంచాయతీ ఆఫీసుల్లోనూ నోటీసుబోర్డుపై ఆ జాబితాను అతికించాలి

మళ్లీ దరఖాస్తు చేసుకునేవారు సమర్పించే పత్రాల్లో ఒకటిగా ఆధార్‌నూ పరిగణించాలి

వెబ్‌సైట్‌లో ప్రచురించే జాబితా.. ఓటర్ ఐడీతో వెతుక్కోగలిగేలా ఉండాలి: సుప్రీం ధర్మాసనం

ఈ జాబితా ఇవ్వడం వల్ల ఎన్నికల కమిషన్ పట్ల ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని వ్యాఖ్య

'ఓటు చౌర్యం'పై.. బిహార్ నుంచి రాహుల్ సమరం

17 నుంచి ఓటర్ అధికార్ యాత్ర

సెప్టెంబరు 1న పాట్నా గాంధీ మైదానంలో ముగింపు సభ

'ఓటు చౌర్యం' అనే నీచ పదాన్ని వాడొద్దు: ఈసీఐ

2

న్యూఢిల్లీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) డ్రైవ్ నిర్వహించి తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల పేర్లనూ వెల్లడించాలని సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. వారిని ఓటర్ల జాబితా నుంచి ఎందుకు తొలగించారో కారణాలు సైతం స్పష్టం చేయాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చీలతో కూడిన ధర్మాసనం నిర్దిష్ట ఆదేశాలు జారీ చేసింది. ఆ వివరాలను.. జిల్లాలవారీగా సంబంధిత జిల్లా ఎన్నికల అధికారుల వెబ్‌సైట్లతోపాటు, బిహార్ ఎన్నికల ప్రధాన అధికారి వెబ్‌సైట్‌లో కూడా ఆగస్టు 19లోగా ప్రచురించాలని సూచించింది. ఏ ఓటరును ఎందుకు తొలగించారనే విషయాన్ని.. ఓటర్ ఐడీ నంబర్ల సాయంతో తెలుసుకునేలా ఆ డాక్యుమెంట్లు ఉండాలని సుప్రీం తన ఆదేశాల్లో పేర్కొంది. ఎవరైనా ఓటర్ల జాబితాలో తమ పేరు మళ్లీ చేర్చాలంటూ దరఖాస్తు సమర్పించేటప్పుడు.. వారు గుర్తింపు పత్రంగా ఆధార్‌కార్డును కూడా సమర్పించవచ్చని పేర్కొంటూ పేపర్లలో, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో బహిరంగ నోటీసులు ఇవ్వాలని సూచించింది. ఓటు హక్కుకు సంబంధించి.. ఆమోదించతగ్గ 11 పత్రాల్లో ఆధార్ కార్డును కూడా చేర్చాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను వచ్చే శుక్రవారానికి (ఆగస్టు 22) వాయిదా వేసింది. బిహార్‌లో ఎస్ఐఆర్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లను సర్వోన్నత న్యాయస్థానం విచారిస్తున్న సంగతి తెలిసిందే. పిటిషనర్లలో ఒకరైన 'ద అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్'.. జాబితా నుంచి తొలగించిన ఓటర్ల పేర్లను ప్రచురించేలా ఈసీని ఆదేశించాలని కోరింది. దీనికి ఈసీ అంగీకరించలేదు. తొలగించిన వారి పేర్ల జాబితాను ప్రచురించడం, ఎందుకు తొలగించామనే కారణాలు చెప్పడం చట్టపరంగా తప్పనిసరి కాదని గతంలోనే విస్పష్టంగా పేర్కొంది. కానీ, ఆ రెండు పనులూ చేయాల్సిందేనని సుప్రీం స్పష్టం చేసింది. ఈ తీర్పును కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యానికి విజయంగా.. ఓట్ల దొంగలకు సందేశంగా అభివర్ణించింది. సుప్రీం తీర్పును తాము స్వాగతిస్తున్నామని.. ఇంతటితో తమ పోరాటం ఆగదని, ప్రజల ఓటుహక్కును కోల్పోనివ్వబోమని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పేర్కొన్నారు. అయితే.. బిహార్‌లో ఎస్ఐఆర్‌ను ఆపడానికి కాంగ్రెస్ పార్టీ అన్ని ప్రయత్నాలూ చేసిందని, చివరకు సుప్రీంలో ఆ పార్టీకి నిరాశే ఎదురైందని

మిగతా 2వ పేజీలో...

మీ ఫొటోషాప్ బాగుంది!

సోనియా ఓటుకార్డు ఆరోపణలపై బీజేపీకి కాంగ్రెస్ కౌంటర్ 2

పోలీసు డిగ్రీ

సర్వీసులో ఉన్నవారు డిగ్రీ చదివేందుకు అవకాశం

'దూరవిద్య'లో ఐదేళ్లలో పూర్తి

అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీతో రాష్ట్ర పోలీసు శాఖ ఒప్పందం

పోలీసు ట్రైనింగ్ సెంటర్లలో వర్సిటీ తరఫున స్టడీ సెంటర్లు

ఇంటర్‌తో పోలీసు కొలువుల్లో ప్రస్తుతం 30 వేల మంది

డిగ్రీ చేస్తే పదోన్నతులకు చాన్స్

హైదరాబాద్,ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్హతతో పోలీసు ఉద్యోగాల్లో చేరిన వారు ఇకపై డిగ్రీలు అందుకోవచ్చు. ఐదేళ్లలో పట్టభద్రులై పట్టాలు పుచ్చుకోవచ్చు. ఉన్నత చదువులు చదువుకునేందుకు తెలంగాణ పోలీసు శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇంటర్ విద్యార్హతతో ఉద్యోగంలో చేరిన కానిస్టేబుల్, ఏఆర్ ఎస్ఐ, ఏఎస్ఐ పోస్టుల్లో పనిచేస్తున్న వారు ఐదేళ్ల కాలంలో దూరవిద్యా విధానం ద్వారా డిగ్రీ పూర్తి చేసుకునేలా అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీతో తెలంగాణ పోలీసుశాఖ ఒప్పందం చేసుకుంది. డీజీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డీజీపీ జితేందర్, అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఘంటా చక్రపాణి అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. పోలీసులను ప్రత్యేక కేటగిరిగా భావించి

మిగతా 13వ పేజీలో...



జగన్ కోటపై టీడీపీ జెండా

ఆంధ్రప్రదేశ్‌లోని రెండు జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో వైసీపీ చిత్తు

పులివెందులలో డిపాజిట్ గల్లంతు

6,033 ఓట్ల భారీ ఆధిక్యంతో టీడీపీ అభ్యర్థి లతారెడ్డి విజయం

ఒంటిమిట్టలో 'దేశం' అభ్యర్థి ముద్దుకృష్ణారెడ్డి జయకేతనం 3



దోషిని నల్లగొండ జిల్లా జైలుకు తరలిస్తున్న పోలీసులు

ఒక దోషి.. 2 ఉరి శిక్షలు

14

బాలికపై అత్యాచారం, హత్య కేసులో నల్లగొండ జిల్లా కోర్టు తీర్పు

ఐపీసీ 302, పోక్సో ప్రకారం రెండు శిక్షలు

ఆధారాలు నాశనం చేసినందుకు ఏడేళ్ల జైలు

విశ్రాంత జీవితం.. వేదనాభరితం

8000 మంది విశ్రాంత ఉద్యోగుల విరమణ కష్టాలు

పెళ్లలకు పెళ్లిళ్లు చేయలేక.. పెద్ద చదువులు చదివించలేక..

అనారోగ్యానికి చికిత్స చేయించుకోలేక ఇబ్బందులు

కూతురిని కోల్పోయి గుండెపోటుతో మరణించిన విశ్రాంత ఇన్‌స్పెక్టర్

రిటైర్మెంట్ బెనిఫిట్స్ అంచనా వేసుకుని కట్నం ఇచ్చేందుకు హామీ

సకాలంలో ఇవ్వకపోవడంతో అల్లుడి వేధింపులు.. కూతురి ఆత్మహత్య

సర్కారు నుంచి 75 లక్షలు రావాల్సి ఉన్నా క్యాన్సర్ చికిత్సకు ఇబ్బందులు


పీఎఫ్ కూడా ఇవ్వడం లేదని విశ్రాంత ఆర్‌అండ్‌బీ ఎస్ఈ ఆవేదన

ఒక్కొక్కరిదీ ఒక్కో దీనగాథ.. లక్షలు రావాల్సి ఉన్నా తప్పని ఇబ్బందులు

రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ.5000 కోట్లు పెండింగ్

హామీ ఇచ్చినా.. కమిటీ వేసినా పరిష్కారం కాని సమస్య 13

బాలకృష్ణ.. పోలీస్ శాఖలో 32 ఏళ్లు సర్వీసు చేసి 2024 మేలో ఇన్‌స్పెక్టర్ హోదాలో పదవీ విరమణ చేశారు. ఆయనకు దాదాపు రూ.65 లక్షలకు పైగా ఉద్యోగ విరమణ ప్రయోజనాలు రావాల్సి ఉంది. వాటిని అంచనా వేసుకుని.. కూతురి పెళ్లి సమయంలో కొంత కట్నం ఇస్తానని అల్లుడికి చెప్పారు. సమయానికి డబ్బులు అందలేదు. కట్నం ఇవ్వాలంటూ అల్లుడి వేధింపులు మొదలయ్యాయి. వాటిని తట్టుకోలేక కూతురు ఆత్మహత్య చేసుకుంది. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రాలేదన్న మనోవేదనకు తోడు కూతురి దుర్మరణంతో చివరకు ఆయన జూలై 26న గుండె పోటుతో మరణించారు.



టెస్కాబ్, డీసీసీబీ, పీఏసీఎస్

పాలకవర్గాల పదవీకాలం పొడిగింపు

కొత్త ఆదేశాలు వచ్చేదాకా.. ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పీఏసీఎస్), జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు(డీసీసీబీ), తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు(టెస్కాబ్) పాలకవర్గాల పదవీ కాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పొడిగించింది. రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. సహకార చట్టంలోని 32(7)(ఏ) సెక్షన్ ప్రకారం.. ప్రస్తుత పాలకవర్గాల పదవీకాలం కొత్త ఆదేశాలు వచ్చేవరకు కొనసాగుతుంది. పనితీరు సరిగా లేకపోయినా, సొసైటీల్లో అవినీతి, ఆరోపణలు వచ్చినా విచారణ జరిపించి చర్యలు తీసుకునే అధికారం సహకారశాఖ రిజిస్ట్రార్‌కు కల్పించారు. రాష్ట్రంలో 908 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. పాత తొమ్మిది జిల్లాలకు డీసీసీబీలు, రాష్ట్రస్థాయిలో టెస్కాబ్ ఉన్నాయి. వీటన్నింటి పాలకవర్గాల పదవీకాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం పొడిగించటం విశేషం. సహకార సంఘాలు, సహకార బ్యాంకుల పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో ఆయా పాలకవర్గాల కోసం తక్షణమే ఎన్నికలు జరపటం సాధ్యం కాదని భావించిన ప్రభుత్వం పొడిగింపు ఉత్తర్వులను జారీచేసింది. ఇంతకుముందు 2024 ఫిబ్రవరి 24న సహకార సంఘాలు, సహకార బ్యాంకుల పదవీకాలాన్ని పొడిగించారు.





పుతిన్, ట్రంప్ భేటీ విఫలమైతే..

భారత్‌పై మరిన్ని సుంకాలు!

రష్యా నుంచి చమురు కొంటున్నందుకే.. రష్యాపై ఆంక్షలు కఠినం చేస్తాం

చైనా విషయంలో ఏం చేయాలో డొనాల్డ్ ట్రంప్‌కు బాగా తెలుసు

యూఎస్ మంత్రి స్కాట్ బెసెంట్ వ్యాఖ్యలు 2

పరస్పర ప్రయోజనాల మేరకు అమెరికాతో సంబంధాలు: రణ్‌ధీర్ జైస్వాల్

కోవా లక్ష్మికి సుప్రీంలో ఊరట



నాలుగేళ్ల రాబడి వెల్లడించకపోవడం లోపం కాదన్న అత్యున్నత న్యాయస్థానం

ఆమె ఎన్నిక చెల్లదంటూ దాఖలైన పిటిషన్ కొట్టివేత 13

ఆపరేషన్ సిందూర్ చరిత్రాత్మకం

» సైనికుల వ్యూహాత్మక, సాంకేతిక సామర్థ్యమిది

» స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో రాష్ట్రపతి ముర్ము




న్యూఢిల్లీ, ఆగస్టు 14: ఉగ్రవాదంపై పోరులో ఆపరేషన్ సిందూర్ చరిత్రాత్మక ఘటనగా నిలిచిపోతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొనియాడారు. పహల్గాం ఉగ్ర దాడికి నిర్ణయాత్మకంగా బదులిచ్చామని, ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం దేశ ఐక్యతను చాటి చెప్పిందని వ్యాఖ్యానించారు. శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకొంటున్న వేళ జాతిని ఉద్దేశించి గురువారం ఆమె ప్రసంగించారు. పహల్గాంలో అమాయక పౌరులను చంపడాన్ని అమానవీయ, పిరికిపంద చర్యగా అభివర్ణించారు. సరిహద్దు వెంబడి ఉగ్రవాద మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడం ద్వారా మన సైనికులు వ్యూహాత్మక, సాంకేతిక సామర్థ్యాన్ని ప్రదర్శించారని కొనియాడారు. రక్షణ రంగంలో ఆత్మ నిర్భర్ భారత్‌కు ఆపరేషన్ సిందూర్ విజయం ప్రతీకగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. అవినీతి, వంచన ప్రజాస్వామ్య ఉత్పత్తులు కారాదని జాతిపిత మహాత్మ గాంధీ ఆశించారని, దేశం నుంచి అవినీతిని పారదోలాలన్న గాంధీజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారు. గతంలో ఎన్నడూ లేనట్లుగా చదరంగం క్రీడలో భారత్ అంతర్జాతీయ స్థాయిలో ఆధిపత్యం సాధిస్తోందని రాష్ట్రపతి ముర్ము కొనియాడారు. అతి పిన్న వయసులో ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన గుకేశ్ విజయ ప్రస్థానం కొనసాగుతోందని, చదరంగ చిచ్చరపిడుగులు ప్రజ్ఞానంద, అర్జున్ ఇరిగేసి, విదిత్ గుజరాతీ, కోనేరు హంపి, దివ్య దేశ్‌ముఖ్ తదితరులు వరుస విజయాలు సాధిస్తున్నారని కొనియాడారు.

నాలుగు రోజుల్లో భారత్ అహాన్ని అణిచివేశాం

» మే నెలలో సైనిక చర్యతో పెద్ద విజయం సాధించాం

» పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సంచలన వ్యాఖ్యలు



ఇస్లామాబాద్, ఆగస్టు 14: పహల్గాం ఉగ్రదాడికి బదులుగా పాక్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా మే 7న భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ అంశంలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారతదేశ దురహంకారాన్ని కేవలం నాలుగు రోజుల్లోనే అణిచివేశామని ప్రకటించారు. మే నెలలో భారత్-పాక్ మధ్య జరిగిన సైనిక చర్య తమకు లభించిన గొప్ప విజయమని పేర్కొన్నారు. భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణకు కృషి చేశారంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. పాకిస్థాన్ 79వ స్వాతంత్ర్య దినోత్సవం(ఆగస్టు 14) నేపథ్యంలో బుధవారం రాత్రి ఇస్లామాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో షెహబాజ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అణ్వాయుధ సామర్థ్యం కలిగిన భారత్‌ను ఎదుర్కొనే విషయంలో తమ అణు సామర్థ్యం వ్యూహాత్మకంగా కీలక పాత్ర పోషించిందని తెలిపారు. భారత్‌తో యుద్ధం వేళ తమకు అండగా నిలిచిన చైనా, సౌదీ అరేబియా, తుర్కియే, అజర్‌బైజన్, యూఏఈ, ఇరాన్ దేశాలకు కూడా షెహబాజ్ కృతజ్ఞతలు తెలిపారు. ఉగ్రవాదంపై పోరులో పాక్ ఎన్నో త్యాగాలు చేసిందని, 90వేల మంది ప్రాణాలు కోల్పోయారని, 150 బిలియన్ డాలర్లకు పైగా ఆర్థికంగా నష్టపోయామని ఈ సందర్భంగా వెల్లడించారు. ఇదిలా ఉండగా, పాకిస్థాన్ సైనిక సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పాకిస్థాన్ రాకెట్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని షెహబాజ్ షరీఫ్ ఈ సందర్భంగా ప్రకటించారు. రాకెట్ ఫోర్స్‌కు అత్యాధునిక సాంకేతికతను సమకూరుస్తామని వెల్లడించారు. కానీ, దానికి సంబంధించి ఇతర వివరాలను ఆయన చెప్పలేదు. అయితే, పాక్‌కు మిత్ర దేశమైన చైనాకు చెందిన పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ రాకెట్ ఫోర్స్ మాదిరిగానే పాక్ రాకెట్ ఫోర్స్ కూడా ఉంటుందనే అంచనాలు ఉన్నాయి. చైనా రాకెట్ ఫోర్స్ అమ్ములపొదిలో క్షిపణులు ఉంటాయి

కశ్మీరులో వరద కల్లోలం



బురదలో కొట్టుకొచ్చిన మృతదేహం



బురదలో చిక్కుకొని గాయపడ్డ ఆరేళ్ల బాలుడికి ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్న దృశ్యం

(మొదటిపేజీ తరువాయి)

46 మంది మరణించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉందని అధికారులు చెబుతున్నారు. శిథిలాలు, బురద కింద మరింత మంది చిక్కుకొని ఉంటారని భావిస్తున్నట్లు తెలిపారు. ఘటనా స్థలంలో పెద్ద ఎత్తున సహాయక చర్యలు చేపట్టి 167 మందిని కాపాడగా.. వారిలో 38 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు వెల్లడించారు. 200 మందికి పైగా గల్లంతైనట్లు భావిస్తున్నారు. మృతుల్లో ఇద్దరు సీఐఎస్ఎఫ్ సిబ్బంది కూడా ఉన్నారని చెప్పారు. ఘటనా స్థలంలో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, పోలీసులు, ఆర్మీ, స్థానిక వాలంటీర్లు ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. చోసితి గ్రామంలో ఎటుచూసినా భయానక దృశ్యాలే కనిపిస్తున్నాయి. హఠాత్తుగా వచ్చిన వరదలకు దాదాపు గ్రామమంతా తుడిచిపెట్టుకుపోయింది. మృతదేహాలు, క్షతగాత్రులతో ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది. గత నెల 25న మొదలైన మాచైల్ మాతా యాత్రలో భాగంగా చోసితి నుంచి భక్తులు కాలినడకన 8.5 కి.మీ. మేర కొండలు ఎక్కుతూ 9500 అడుగుల ఎత్తులో ఉన్న ఈ గుడికి చేరుకోవాల్సి ఉంటుంది. కిష్త్వార్ పట్టణానికి 90 కి.మీ. దూరంలో చోసితి ఉంటుంది. బేస్ పాయింట్‌లో మెరుపు వరదలు సంభవించిన వెంటనే కిష్త్వార్ డిప్యూటీ కమిషనర్ పంకజ్‌కుమార్ శర్మ రంగంలోకి దిగారు. సహాయక బృందాలను అక్కడికి తరలించడంతో పాటు ఆయన స్వయంగా ఘటనా స్థలానికి వెళ్లారు. "కిష్త్వార్‌లోని చోసితిలో మెరుపు వరదలు వచ్చాయి. మాచైల్ మాతా యాత్రకు బేస్ క్యాంప్ కావడంతో పెద్ద ఎత్తున భక్తులు ఉంటారు. భారీగా ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉంది. అధికారులు తక్షణమే రంగంలోకి దిగారు. నా కార్యాలయానికి నిరంతరం సమాచారం అందజేస్తున్నారు" అని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఇప్పటికే చోసితికి తరలి వెళ్లాయని, అదనపు బృందాలు, హెలికాప్టర్లను సిద్ధం చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. సహాయక చర్యల్లో సైన్యాన్ని కూడా రంగంలోకి దించారు. 300 మంది సైనికులు చోసితిలో సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు అధికారులు తెలిపారు.

అత్యంత విషాదకర ఘటన: రాష్ట్రపతి

జమ్మూకశ్మీరులో మెరుపు వరదల ఘటన అత్యంత విషాదకరమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానిమోదీ పేర్కొన్నారు. ఈ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కిష్త్వార్‌లో మెరుపు వరదల ఘటనపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా జమ్మూకశ్మీరు లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ), సీఎంలతో మాట్లాడారు. సహాయక చర్యలను ముమ్మరం చేయాలని సూచించారు. కేంద్రం అండగా ఉంటుందని చెప్పారు.

మాచైల్ యాత్ర నిలిపివేత

మాచైల్ మాతా మందిరం సముద్ర మట్టానికి సుమారు 2,800 మీటర్ల ఎత్తులో ఉంది. గత నెల 25న మొదలైన ఈ యాత్రకు జమ్మూ డివిజన్ నుంచి వేల సంఖ్యలో భక్తులు వచ్చారు. ఈ పెను విషాదం నేపథ్యంలో మాచైల్ యాత్రను నిలిపివేశారు. చోసితిలో మెరుపు వరదలతో జమ్మూకశ్మీరు అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రజలు, భక్తులకు సహాయం అందించేందుకు కంట్రోల్ రూమ్, హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసింది. కాగా, జమ్మూకశ్మీరులోని రాజౌరి తదితర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. రియాసి జిల్లాలోని వైష్ణోదేవి ఆలయానికి వెళ్లే మార్గాన్ని గురువారం మూసివేశారు. భారీ వర్షాలకు తావి, చీనాబ్ తదితర నదులకు మెరుపు వరదలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

హిమాచల్‌ప్రదేశ్‌లో కూడా..

హిమాచల్‌ప్రదేశ్‌లో కూడా భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. మేఘవిస్ఫోటంతో మెరుపు వరదలు వచ్చాయి. సిమ్లా, లాహోల్-స్పితి ప్రాంతాల్లో చాలా నిర్మాణాలు కొట్టుకుపోయాయి. జాతీయ రహదారులతో సహా 396 మార్గాలను మూసివేశారు. సిమ్లాలోని విద్యుత్తు సరఫరా కార్యాలయం కూడా దెబ్బతింది. అయితే, ప్రాణ నష్టానికి సంబంధించిన సమాచారం అందలేదని అధికారులు తెలిపారు.



సిమ్లాలో భారీ వరదతో కొట్టుకువచ్చిన మట్టిలో కూరుకుపోయిన వాహనాలు

లోకం తీరు



ట్రంప్, పుతిన్ భేటీ విఫలమైతే.. భారత్‌పై మరిన్ని సుంకాలు!

» యూఎస్ ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్

న్యూయార్క్, ఆగస్టు 14: ఉక్రెయిన్‌తో యుద్ధ విరమణ అంశంపై రష్యా, అమెరికా మధ్య చర్చలు విఫలమైతే.. భారత్‌పై సుంకాలు మరింతగా పెంచుతామని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్ ప్రకటించారు. రష్యా నుంచి భారత్ భారీగా చమురు కొనుగోలు చేస్తుండటమే దీనికి కారణమని చెప్పారు. అమెరికాలోని అలాస్కాలో శుక్రవారం(భారత కాలమానం ప్రకారం శనివారం) రష్యా అధ్యక్షుడు పుతిన్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భేటీకానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బ్లూమ్‌బర్గ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్కాట్ బెస్సెంట్ కీలక వ్యాఖ్యలు చేశారు. "పుతిన్ తీరుతో అందరూ విసిగిపోయి ఉన్నారు. ఈసారి ఆయన సానుకూల చర్చలకు సిద్ధంగా ఉన్నట్టు కనిపిస్తోంది. ఒకవేళ ట్రంప్, పుతిన్ చర్చలు సఫలం కాకపోతే.. రష్యా నుంచి చమురు కొంటున్న భారత్‌పై సుంకాలు మరింతగా పెంచుతాం. రష్యాపై ఆంక్షలు కఠినతరం చేస్తాం" అని పేర్కొన్నారు. రష్యా నుంచి భారత్ కంటే ఎక్కువ చమురు కొంటున్న చైనా సంగతి ఏమిటని విలేకరి ప్రశ్నించగా.. అధ్యక్షుడు ట్రంప్ కంటే ముందే తానేమీ చెప్పలేనని, ఏం చేయాలో ఆయనకు బాగా తెలుసని స్కాట్ బెస్సెంట్ చెప్పారు. రష్యాపై మరింత ఒత్తి తెచ్చేందుకు యూరోపియన్ దేశాలు అమెరికా వెంట నిలవాలని కోరారు. మరోవైపు, అమెరికా, భారత్ మధ్య సంబంధాలు పరస్పర గౌరవం, ప్రయోజనాల ఆధారంగా ముందుకు సాగుతాయని, మెరుగుపడతాయని ఆశిస్తున్నామని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ గురువారం పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య బలమైన వ్యూహాత్మక భాగస్వామ్యం ఉందని, కొన్ని సమయాల్లో అది సవాళ్లను ఎదుర్కొన్నా ముందుకు సాగిందని చెప్పారు. రక్షణ రంగానికి సంబంధించి అమెరికా, భారత్ మధ్య బలమైన బంధం ఉందని.. ఇది ద్వైపాక్షిక సంబంధాలకు కీలక ఆధారమని తెలిపారు.

65 లక్షల మంది పేర్లు వెల్లడించండి

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు.


రాజకీయ పార్టీలకు ఇచ్చాం..

జాబితా నుంచి తొలగించిన ఓటర్ల వివరాలను బూత్‌ల స్థాయిలో రాజకీయ పార్టీల ఏజెంట్లకు ఇప్పటికే ఇచ్చామని ఈసీ తరఫున వాదనలు వినిపించిన రాకేశ్ ద్వివేది గురువారం కోర్టుకు తెలపగా.. తమ ఓటు ఉందో లేదో తెలుసుకునేందుకు ఓటర్లు రాజకీయ పార్టీల దగ్గరికి ఎందుకు వెళ్లాలని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. "ఓటర్లు స్థానిక రాజకీయ పార్టీల చుట్టూ తిరగాల్సిన అవసరం లేని యంత్రాంగం మీ వద్ద లేదా? ఇంటర్నెట్ ద్వారా మీరు ఈ పని ఎందుకు చేయకూడదు?" అని జస్టిస్ సూర్యకాంత్ ఈసీని ప్రశ్నించారు. దీనికి రాకేశ్ ద్వివేదీ.. ఓటర్ ఐడీ నంబర్‌తో వెతకడం ద్వారా జాబితాలో తమ పేరు ఉన్నదీ లేనిదీ ఓటర్లు తెలుసుకునే వీలుందని జవాబిచ్చారు. దీనికి ధర్మాసనం.. తొలగించినవారి పేర్ల జాబితానే ఎందుకు పెట్టకూడదని ప్రశ్నించింది. "చనిపోయిన/ఒకచోటు నుంచి మరోచోటుకు వెళ్లిపోయిన/రెండుచోట్ల ఉన్నవారి పేర్లను ఎందుకు పెట్టరు?" అని జస్టిస్ బాగ్చీ అడిగారు. "మీరు ఆ వివరాలను బహిరంగపరిస్తే.. ఈసీ మీద ఉన్న అభిప్రాయాలు మారుతాయి" అని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. పారదర్శకత వల్ల ఓటర్లలో విశ్వాసం కలుగుతుందన్నారు. ఓటర్ల జాబితాలో లేనివారి పేర్లు కారణాలతో సహా వెల్లడిస్తే ఓటర్లు పరిష్కార చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని.. కాబట్టి అందరికీ అర్థమయ్యే భాషలో, సామాన్యులకు అనుకూలంగా ఉండే విధంగా.. తొలగించిన వారి పేర్లు వెల్లడించాలని ఆయన స్పష్టం చేశారు. ఉదాహరణకు.. పూనం దేవి అనే మహిళ పేరు తొలగిస్తే.. తన పేరు ఎందుకు తొలగించారో తెలుసుకునేలా ఆ జాబితా ఉండాలని సూచించారు. ఈసీ అప్‌లోడ్ చేసే పత్రాలు 'సెర్చబుల్ ఫార్మాట్'లో.. అంటే, ఓటరు గుర్తింపు కార్డ నంబరుతో వెతుక్కోగలిగేలా ఉండాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు గోపాల్ శంకరనారాయణన్, వృందా గ్రోవర్ కోరగా జస్టిస్ సూర్యకాంత్ అందుకు అంగీకరించారు. అయితే, ఆ విధంగా ఓటర్ల జాబితాను ప్రచురించాల్సిన అవసరం లేదంటూ 2018లో కమల్‌నాథ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని రాకేశ్ ద్వివేదీ గుర్తుచేయగా.. డాక్యుమెంట్‌ను అలా వెతుక్కోగలిగేలా రూపొందించడం వల్ల ఏ సమస్యా ఉండదని జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు.

ఇవీ ఆదేశాలు..

బిహార్‌లో సమగ్ర ఓటర్ల జాబితాకు సంబంధించి సుప్రీంకోర్టు శుక్రవారం జారీ చేసిన ఆరు నిర్దిష్ట ఆదేశాలు..

1) తొలగించిన 65 లక్షల ఓటర్ల పేర్లను జిల్లా ఎన్నికల అధికారుల వెబ్‌సైట్లలో ప్రదర్శించాలి. వారిని ఓటరు జాబితాలో ఎందుకు చేర్చలేదో ఆ కారణాన్ని నిర్దిష్టంగా పేర్కొనాలి. ఓటర్ ఐడీకార్డు నంబర్ ద్వారా ఈ సమాచారం తెలుసుకునేలా ఉండాలి.
2) తొలగించిన 65 లక్షల ఓటర్ల పేర్లను వెబ్‌సైట్‌లో ప్రచురించిన విషయాన్ని.. బిహార్‌లోని ప్రాంతీయ వార్తాపత్రికల ద్వారా ప్రజలకు ప్రజలకు తెలిసేలా చేయాలి. టీవీ, రేడియో చానళ్లలో వెల్లడించాలి. జిల్లా ఎన్నికల అధికారులకు.. అధికారిక సోషల్ మీడియా ఖాతా ఉంటే దాని ద్వారా కూడా ఈ విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లాలి.
3) ఆన్‌లైన్‌లోనే కాక ప్రజలకు మాన్యువల్‌గా కూడా అందుబాటులో ఉండేలా.. ఈ 65 లక్షల ఓటర్ల జాబితాను (తొలగింపునకు కారణాలతో సహా) ప్రతి బూత్ స్థాయి అధికారీ.. తమ తమ బ్లాక్ డెవలప్‌మెంట్/పంచాయతీ కార్యాలయాల్లో నోటీస్ బోర్డుపై అతికించాలి.
4) జాబితాలో తమ పేర్లు లేని వారు ఆధార్ కార్డు ప్రతితో ఫిర్యాదు చేయవచ్చని బహిరంగ నోటీసుల్లో పేర్కొనాలి.
5) వ ః సా ం ః దా జాబితాలో లేనివారి పేర్లతో కూడిన సాఫ్ట్ కాపీని రాష్ట్ర ఎన్నికల అధికారులకు సవ ః ర్పిం చాలి. ఈ మొత్తం జాబితాను బిహార్ సీఈవో వెబ్‌సైట్‌లో ఉంచాలి.
6) వెబ్‌సైట్ జాబితాలో పేర్లను ఎపిక్ (ఓటర్ గుర్తింపు కార్డు) నంబర్ ఆధారంగా వెతుక్కోగలిగేలా ఉండాలి.



ఓడితే చెడ్డవి.. గెలిస్తే మంచివట!

రాజకీయ పార్టీలు ఓడిపోయినప్పుడు ఈవీఎంలు చెడ్డవని తిడుతున్నాయని, గెలిచినప్పుడు మాత్రం మంచివే అంటున్నాయని.. తీవ్ర రాజకీయ వైరుధ్యాలున్న వాతావరణంలో తాము పనిచేయాల్సి వస్తోందని.. తాము తీసుకున్న ప్రతి నిర్ణయాన్నీ కోర్టుల్లో సవాల్ చేస్తున్నారని ఈసీ తరఫు న్యాయవాది రాకేశ్ ద్వివేదీ కోర్టుకు తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ సహా కొన్ని నిర్ణయాలు తీసుకునే అధికారం రాజ్యాంగంలోని 324వ అధికరణం కింద తమకు (ఈసీ) ఉందని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల అభిప్రాయలతో తమకు పనిలేదని.. చట్టం ఏం చెబుతోందో అదే తమకు ముఖ్యమని పేర్కొన్నారు. విపక్షాలు బిహార్‌ను కడు పేద రాష్ట్రంగా.. అసలక్కడ డిజిటల్ సాంకేతికతే లేనట్టుగా.. వరదల్లో సర్టిఫికెట్లన్నీ కొట్టుకుపోయినట్టు.. అసలు ఆ రాష్ట్రం ఏదో చీకటియుగాల్లో జీవిస్తున్నట్టుగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆక్షేపించారు. కానీ, ఆ రాష్ట్రం దేశానికి తొలి రాష్ట్రపతిని అందించిందని.. అది జ్ఞానభూమి అని కొనియాడారు. ఈ సందర్భంగా జోక్యం చేసుకున్న జస్టిస్ బాగ్చి కూడా.. బిహార్‌ను ప్రజాస్వామ్యానికి జన్మస్థానంగా అభివర్ణించారు.

ప్రజాస్వామ్యాన్ని రక్షించిన సుప్రీం

» ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

సుప్రీంకోర్టు తీర్పు ప్రజాస్వామ్యాన్ని రక్షించిందని ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో భారత ఎన్నికల సంఘం చేస్తున్న దారుణాన్ని తాము తీవ్రంగా ప్రశ్నించామని ఆయన గుర్తుచేశారు. తొలగించిన 65 లక్షల ఓటర్ల పేర్లను, వారిని తొలగించడానికి గల కారణాలను బహిర్గతం చేయాలని రాహుల్ డిమాండ్ చేస్తున్నారని.. ఇప్పుడు సుప్రీంకోర్టు సైతం అవే ఆదేశాలు ఇచ్చిందని అన్నారు. పార్లమెంటులో దీనిపై చర్చపెట్టాలంటూ రాహుల్ నేతృత్వంలో తాము అడుగుతుంటే.. స్పీకర్ వాయిదాలతో కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. కానీ, సుప్రీంకోర్టు సరైన తీర్పు ఇచ్చిందన్నారు. రాజ్యాంగబద్ధంగా స్వతంత్రంగా పనిచేయాల్సిన ఎన్నికల కమిషన్ ప్రలోభాలకు గురైతే తీరని నష్టం జరుగుతుందని, ఇది కేవలం కాంగ్రెస్ పార్టీ సమస్య కాదని, దేశంలోని ప్రతి పౌరుడూ ప్రశ్నించాల్సిన అంశమని పేర్కొన్నారు.

న్యాయవాదిగా అనుభవం ఉంటేనే జడ్జి పోస్టులకు అర్హత

» జ్యుడీషియల్ ఆఫీసర్‌గా పనిచేసిన కాలం లెక్కలోకి రాదు

» తీర్పులో మార్పు చేయబోం.. సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 14: జ్యుడీషియల్ సర్వీసెస్ పరీక్షలు రాసేవారికి కనీసం మూడేళ్లపాటు న్యాయవాదిగా పనిచేసే అనుభవం ఉండాలంటూ గతంలో ఇచ్చిన తీర్పును సవరించడానికి గురువారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. తీర్పులో మార్పులు చేస్తే తేనెతుట్టెను కదిలించినట్టవుతుందని వ్యాఖ్యానించింది. న్యాయాధికార పదవులకు పోటీపడే వారికి న్యాయవాదిగా కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలంటూ మే నెల 20న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ ఆధ్వర్యంలోని ధర్మాసనం తీర్పు ఇచ్చింది. కోర్టుల్లో ఎలాంటి అనుభవం సంపాదించకుండా న్యాయవిద్యార్థులు నేరుగా జూనియర్ జడ్జి పదవులకు పోటీపడలేరని తెలిపింది. అయితే అప్పటికే ఒక రాష్ట్రంలో జ్యుడీషియల్ ఆఫీసర్‌గా ఉద్యోగం సంపాదించిన వారు ఇతర రాష్ట్రాల న్యాయాధికార పోస్టులకు పరీక్షలు రాయాలనుకున్నప్పుడు ఈ తీర్పు ఆటంకంగా మారిందని పేర్కొంటూ మధ్యప్రదేశ్‌కు చెందిన కొందరు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. జ్యుడీషియల్ అధికారిగా అనుభవం సంపాదించినప్పటికీ, న్యాయవాదిగా అనుభవం లేదన్న కారణంతో పరీక్ష రాయలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. తీర్పును పునఃపరిశీలించాలని కోరారు. విచారణ జరిపిన జస్టిస్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం.. మధ్యప్రదేశ్ వారికి ఏమయిందని వ్యాఖ్యానించింది. పాత తీర్పులో మార్పులు చేయబోమని స్పష్టం చేసింది. జ్యుడీషియల్ ఆఫీసరుగా పనిచేసిన కాలాన్ని అనుభవం కింద పరిగణించబోమని తెలిపింది.

జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాపై వివరణ ఇవ్వండి

న్యూఢిల్లీ, ఆగస్టు 14: జమ్మూ-కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణపై వివరణ ఇవ్వాలని గురువారం సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అదే సమయంలో క్షేత్రస్థాయి పరిస్థితులను, ఇటీవల జరిగిన పహల్గాం వంటి దుర్ఘటనలను కూడా దృష్టిలో పెట్టుకోవాలని సూచించింది. రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కోరుతూ విద్యావేత్త జహూర్ అహ్మద్ భట్, సామాజిక-రాజకీయ కార్యకర్త అహ్మద్ మాలిక్‌లు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ వాదనలు వినిపిస్తూ 370 అధికరణం రద్దు అంశంపై జరిగిన విచారణ సందర్భంగా సాధ్యమైనంత త్వరగా రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని 2023 డిసెంబరు 11న కేంద్రం కోర్టుకు హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇది జరిగి 21 నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు చాలా ప్రశాంతంగా జరిగాయని, అందువల్ల మళ్లీ రాష్ట్ర హోదా ఇవ్వడంలో ఎలాంటి ఆటంకాలు లేవని తెలిపారు.

అధికారుల నిష్క్రియ వల్లే ఢిల్లీలో కుక్కల బెడద

» తీర్పును రిజర్వు చేసిన సుప్రీం త్రిసభ్య ధర్మాసనం

న్యూఢిల్లీ, ఆగస్టు 14: స్థానిక సంస్థల అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా స్తబ్దుగా ఉండిపోవడం, జంతు సంతతి నియంత్రణ చర్యలు చేపట్టకపోవడమే ఢిల్లీలో వీధి కుక్కల బెడదకు కారణమని సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం పేర్కొంది. 'ప్రభుత్వం నిబంధనలు రూపొందిస్తుంది. కానీ అవి అమలు కావు. దాని ఫలితమే ఈ సమస్య' అని అసంతృప్తి వ్యక్తం చేసింది. ఢిల్లీలో ఒక్క వీధి కుక్క కూడా కనిపించకూడదని, వాటిని షెల్టర్లకు తరలించాలని సోమవారం ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలను వెనక్కి తీసుకోవాలంటూ దాఖలైన పిటిషన్లపై గురువారం త్రిసభ్య ధర్మాసనం విచారణ నిర్వహించింది. ఒకవైపు వీధి కుక్కల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మరోవైపు జంతు ప్రేమికులేమో వాటితో గౌరవంగా వ్యవహరించాలంటారని వ్యాఖ్యానించింది. ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది.

'ఓటు చౌర్యం'పై బిహార్ నుంచి రాహుల్ సమరం

» 17వ తేదీ నుంచి ఓటర్ అధికార్ యాత్ర



న్యూఢిల్లీ, ఆగస్టు 14: 'ఓటు చౌర్యం'పై కేంద్ర ప్రభుత్వంతోపాటు.. భారత ఎన్నికల సంఘం(ఈసీఐ)కి వ్యతిరేకంగా గళమెత్తిన కాంగ్రెస్ సీనియర్ నేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ.. ఈ నెల 17 నుంచి సమర శంఖం పూరించనున్నారు. బిహార్ నుంచి ఆయన 'ఓటర్ అధికార్ యాత్ర'ను ప్రారంభించనున్నారు. దేశవ్యాప్తంగా పారదర్శక ఓటర్ల జాబితా లక్ష్యంగా తమ యాత్ర కొనసాగుతుందని రాహుల్ ఈ సందర్భంగా తెలిపారు. "ఓటు చౌర్యం అనేది కేవలం ఎన్నికలకు సంబంధించిన అంశం కాదు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, 'ఒక వ్యక్తి-ఒక ఓటు' సూత్రాన్ని కాపాడే నిర్ణయాత్మక సమరం మాది. ఈ సమరంతో ఓటు దొంగల ఓటమి జరగాలి. ప్రజలు విజయం సాధించాలి. రాజ్యాంగం విజయం సాధించాలి" అని ఆయన వ్యాఖ్యానించారు. 17న ప్రారంభం కానున్న ఓటర్ అధికార్ యాత్ర.. సెప్టెంబరు 1న పట్నాలోని గాంధీ మైదానంలో జరిగే మహాసభతో ముగుస్తుంది. ఈ ఉద్యమాన్ని విస్తరించేందుకు కాంగ్రెస్ నేతలు గురువారం 'లోక్‌తంత్ర బచావో మషాల్ మార్చ్', ఆగస్టు 22 నుంచి సెప్టెంబరు 7 వరకు 'ఓట్ చోర్.. గద్దీ చోర్' సభలు.. సెప్టెంబరు 15 నుంచి అక్టోబరు 15 వరకు ప్రజల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. కాగా.. గతవారం రాహుల్ గాంధీ బెంగళూరులోని మహాదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్‌లో 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో లక్షకు పైగా ఓట్లు తారుమారయ్యాయంటూ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే..! ఇదే అంశంపై విపక్షాలు పార్లమెంట్‌ను అట్టుడికించాయి. మరోవైపు ఈ అంశంపై రాబర్ట్ వాద్రా తీవ్రంగా స్పందించారు. రాహుల్, ప్రియాంక దేశమంతా తిరిగి, ప్రజలకోసం కష్టపడుతున్నారని, ప్రజలు ఈ పోరాటాన్ని గుర్తించకపోతే.. బీజేపీ తప్పుడు మార్గాల్లో గెలుస్తూనే ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, రాహుల్ గాంధీ నైరాశ్యంలో ఉన్నారని బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు.

'ఓటు చౌర్యం' పదాన్ని వాడొద్దు: ఈసీఐ

'ఓటు చౌర్యం' అనే పదాన్ని వాడొద్దంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) సూచించింది. "ఎవరైనా రెండుసార్లు ఓటు వేశారనడానికి ఆధారాలుంటే.. ప్రమాణపత్రంతో సమర్పించండి. అంతేకానీ, ఇలాంటి నీచ పదాన్ని వాడొద్దు" అని స్పష్టం చేసింది. 1951 నుంచి 'ఒక వ్యక్తి - ఒక ఓటు' చట్టం అమల్లో ఉందని గుర్తుచేసింది. కోట్ల మంది ఓటర్లను, లక్షల మంది ఎన్నికల సిబ్బందిని 'ఓటు దొంగలు' అని పిలవడం వారి గౌరవంపై దాడి చేయడమేనని వ్యాఖ్యానించింది.

'మీ ఫొటోషాప్ బాగుంది'..!

» సోనియా ఓటుకార్డు ఆరోపణలపై బీజేపీకి కాంగ్రెస్ కౌంటర్

న్యూఢిల్లీ, ఆగస్టు 14: పౌరసత్వం పొందక ముందు నుంచే సోనియా గాంధీకి భారతదేశ ఓటుకార్డు ఉందని బీజేపీ చేసిన ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ తిప్పికొట్టింది. పౌరసత్వానికి ముందు సోనియా గాంధీకిచ్చిన కార్డు ఇదేనంటూ ఆ పార్టీ ఓ ఓటుకార్డును విడుదల చేయడంపై కాంగ్రెస్ విస్మయం వ్యక్తం చేసింది. మంచిగా ఫొటోషాప్ చేసి ఐడీ కార్డును రూపొందించారని ఎద్దేవా చేసింది. "మీ ఫొటోషాప్ చాలా బాగుంది. సోనియా ఓటు కార్డును బాగా రూపొందించారు. కాని, 69వ రాజ్యాంగ సవరణ చట్టం 1991 ద్వారా 1992 జనవరి 2న నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ ఏర్పాటయింది. దానికి ముందు ఢిల్లీ కేంద్ర పాలిత ప్రాంతం మాత్రమే, మీరు ఆ విషయాన్ని గ్రహించకుండా కార్డును విడుదల చేయడం విడ్డూరంగా ఉంది" అంటూ బీజేపీ ఐటీ విభాగాన్ని ఉద్దేశించి ఎక్స్‌లో పేర్కొంది.

సూర్యాపేట జిల్లా మునగాలకు చెందిన కౌలు రైతు సిరికొండ రాజేశ్ (42)పై దొంగతనం కేసు నమోదు కావడంతో మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నారు. తన చావుకు వెంకటరెడ్డి కారణమంటూ సెల్ఫీ వీడియో తీసుకున్నాక గడ్డి మందు తాగారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు.

- మునగాల, ఆంధ్రజ్యోతి

జగన్ కోటపై టీడీపీ జెండా

రెండు జడ్పీటీసీ ఉప ఎన్నికల్లోనూ వైసీపీ చిత్తు.. పులివెందులలో డిపాజిట్ గల్లంతు

- టీడీపీ అభ్యర్థి లతారెడ్డికి 6,033 ఓట్ల భారీ ఆధిక్యత
- ఒంటిమిట్టలో 'దేశం' అభ్యర్థి ముద్దుకృష్ణారెడ్డి జయకేతనం



ఎన్నికల అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న మారెడ్డి లతారెడ్డి, అద్దలూరు ముద్దు కృష్ణారెడ్డి

కడప, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జగన్ కోటలో టీడీపీ జెండా ఎగిరింది! సొంత జిల్లాలోనే ఆయనకు ఓటర్లు దిమ్మతిరిగే షాకిచ్చారు!! పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో వైసీపీ ఘోరపరాజయం పాలైంది. జగన్ అడ్డా అయిన పులివెందులలో వైసీపీ అభ్యర్థికి డిపాజిట్ కూడా రాలేదు. ఒంటిమిట్టలో ఆ పార్టీ ఘోర ఓటమిని మూటగట్టుకుంది. ఈ రెండు చోట్లా తెలుగుదేశం జెండా రెపరెపలాడింది. గురువారం జరిగిన బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో తొలినుంచీ టీడీపీ దూసుకెళ్లింది. ప్రతి రౌండ్‌లోనూ దూకుడును ప్రదర్శించింది. వైసీపీ అభ్యర్థి తుమ్మల హేమంత్‌రెడ్డిపై టీడీపీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి 6,033 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఈ జడ్పీటీసీ పరిధిలో మొత్తం 10,601 ఓట్లు ఉండగా, 7,794 ఓట్లు పోల్ అయ్యాయి. ఇందులో లతారెడ్డికి 6,716 ఓట్లు పోల్ అయ్యాయి. వైసీపీ అభ్యర్థి తుమ్మల హేమంత్‌రెడ్డికి 6,83 ఓట్లు వచ్చాయి. 145 ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి. నోటాకు 11 ఓట్లు పడ్డాయి. స్వతంత్ర అభ్యర్థులు మొయిళ్ల శివకల్యాణ్‌రెడ్డికి 101, సురేశ్‌కుమార్‌రెడ్డికి 4, తుమ్మలూరు అనిల్‌కుమార్‌రెడ్డికి 1, భూమిరెడ్డి రవీంద్రరెడ్డికి 14, గజేంద్రనాథరెడ్డికి 79, భరత్‌రెడ్డికి 35, వెంగల్‌రెడ్డికి 3, సునీల్‌యాదవ్‌కు 2 ఓట్లు వచ్చాయి. శివారెడ్డి అనే అభ్యర్థికి ఒక్క ఓటుకూడా రాలేదు. విజేత మారెడ్డి లతారెడ్డికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. 'మేం చాలా ఆనందంగా ఉన్నాం' అంటూ సంతోషం వ్యక్తం చేశారు.

ఒంటిమిట్టలో అదే దూకుడు

ఒంటిమిట్టలో టీడీపీ అభ్యర్థి అద్దలూరు ముద్దుకృష్ణారెడ్డి.. వైసీపీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిపై 6,267 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఇక్కడ మొత్తం 20,467 ఓట్లకుగాను 19,836 ఓట్లు చెల్లాయి. 602 ఓట్లు చెల్లలేదు. 29 ఓట్లు నోటాకు పడ్డాయి. పోల్ అయిన ఓట్లలో టీడీపీకి 12,780రాగా వైసీపీకి 6,513 వచ్చాయి. ఇండిపెండెంట్ అభ్యర్థులు చంద్రకాంత్‌కు 23, వెంకటరమణకు 18, మల్లికార్జునరెడ్డికి 2, శివారెడ్డికి 148, సుధాకర్‌కు 16, మధుమూర్తికి 179, ఈశ్వరయ్యకు 2, వెంకటేశ్‌కు 9ఓట్లు పోల్ అయ్యాయి. పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికలను టీడీపీ గెలుచుకోవడంతో ఆ పార్టీలో జోష్ నెలకొంది. కడప, పులివెందుల, ఒంటిమిట్ట, రాజంపేటలలో సంబరాలు చేసుకున్నారు.

నాడు ఉమేశ్‌చంద్ర.. నేడు కోయ ప్రవీణ్

1990ల్లో.. కడప జిల్లాలో ఫ్యాక్షన్ రాజ్యమేలుతుండేది. అప్పట్లో ఏ ఎన్నికలు జరిగినా హింసాత్మకమే. అలాంటి సమయంలో 1996లో కడప పార్లమెంటుకు ఉప ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ నుంచి రాజశేఖర్‌రెడ్డి, టీడీపీ నుంచి రాజగోపాల్‌రెడ్డి పోటీ చేశారు. ఆ ఎన్నికలను అప్పటి ఎస్పీ ఉమేశ్‌చంద్ర ప్రశాంతంగా నిర్వహించారు. మళ్లీ ఇప్పుడు డీఐజీ కోయ ప్రవీణ్ పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించారు. కేవలం రెండు చిన్న సంఘటనలు మినహాయిస్తే ఈ ఎన్నికల్లో పెద్దగా గొడవలు జరగకపోవడంపై పులివెందుల ప్రజలు సంతృప్తివ్యక్తం చేస్తున్నారు.

ఇంటర్‌తో పాటు నాలుగేళ్లు స్థానికంగా చదివితేనే 'లోకల్': ఏపీ హైకోర్టు



అమరావతి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్‌తో పాటు నాలుగేళ్లు స్థానిక ప్రాంతంలో చదివినవారే లోకల్ అభ్యర్థులు అవుతారని ఏపీ హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. రాష్ట్రపతి ఉత్తర్వులు-1974లోని నిబంధనల్లో స్థానికత విషయాన్ని సవివరంగా నిర్వచించారని గుర్తుచేసింది. ఆ నిబంధనలకు అనుగుణంగా లేని విద్యార్థులను స్థానిక అభ్యర్థులుగా పరిగణించలేమని తేల్చిచెప్పింది. ఇదే విషయంలో ఉమ్మడి హైకోర్టు ఫుల్‌బెంచ్ కూడా తీర్పు ఇచ్చిందని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ వెలుపల ఇంటర్ చదివినవారిని కూడా వైద్య విద్య ప్రవేశాలకు (ఎంబీబీఎస్, బీడీఎస్) నిర్వహించే కౌన్సెలింగ్‌లో లోకల్ అభ్యర్థులుగా పరిగణించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన పలు వ్యాజ్యాలను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం తీర్పు ఇచ్చింది.

వికారాబాద్ జిల్లాలో భూప్రకంపనలు

- పరిగి, పూడూరు మండలాల్లో కంపించిన భూమి
- రిక్టర్ స్కేల్‌పై 3.1 తీవ్రత నమోదు

పరిగి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి)/పూడూరు: వికారాబాద్ జిల్లా పరిగి, పూడూరు మండలాల్లో గురువారం తెల్లవారుజామున భూ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. పరిగి మండలం బసిరెడ్డిపల్లి, రంగాపూర్, న్యామత్‌నగర్, పరిగి, చెన్‌గోముల్ తదితర ప్రాంతాల్లో తెల్లవారుజామున 3.56 గంటలకు భూమి స్వల్పంగా కంపించింది. మూడు, నాలుగు సెకన్ల పాటు కొనసాగిన ఈ ప్రకంపనలతో ఆ సమయంలో నిద్రలో ఉన్న ప్రజలు తీవ్రభయాందోళనలతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. కొందరి ఇళ్లల్లో వంట సామగ్రి కిందపడిందని, శబ్దాలు కూడా వచ్చాయని పలు గ్రామాల ప్రజలు చెబుతున్నారు. పరిగి, పూడూరు మండలాల పరిధిలో భూ ప్రకంపనలు సంభవించిన విషయాన్ని శాస్త్రవేత్తలు ధృవీకరించారు. భూప్రకంపల తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 3.1గా నమోదైంది. పూడూరు మండలం, చన్‌గోముల్ గ్రామ పరిధిలోని రైతు ఎండీ ఖయ్యూం పంటపొలం కేంద్రంగా భూ ప్రకంపనలు చోటు చేసుకోగా, అక్కడ 10 కి.మీ. లోతులో భూమి కంపించినట్లు గుర్తించారు. చన్‌గోముల్ కేంద్రంగా ఏర్పడ్డ భూ ప్రకంపనల ప్రభావంతోనే పరిగి, పూడూరు మండలాల్లోని పలు గ్రామాల్లో స్వల్ప కంపనాలు చోటు చేసుకున్నాయి. సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, ఆర్డీవో వాసుచంద్ర, డీపీవో జయప్రద, తహశీల్దార్ వెంకటేశ్వరి, ఎంపీడీవో కరీం పరిగి మండలంలోని బసిరెడ్డిపల్లి, రంగాపూర్ గ్రామాలను సందర్శించారు. కలెక్టర్ గ్రామస్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కాగా, చన్‌గోముల్ కేంద్రంగా భూ ప్రకంపనలు వెలువడ్డ ప్రాంతానికి దామగుండం నేవీ రాడార్ స్టేషన్ కేవలం 12 కి.మీ. దూరంలోనే ఉంది. ఈ తరుణంలో చన్‌గోముల్ శివారులో 10 కి.మీ. లోతులో భూ ప్రకంపనలు చోటు చేసుకోవడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. నేవీ రాడార్ స్టేషన్‌లో పలు భవనాలను భూగర్భంలో నిర్మించి అక్కడి నుంచి పర్యవేక్షించనున్న నేపథ్యంలో రాబోయే రోజుల్లో ఆ భవనాలు ఎంత మేరకు సురక్షితంగా ఉండే అవకాశం ఉందనే ప్రశ్న తలెత్తుతోంది. భూ ప్రకంపనల నేపథ్యంలో నేవీ రాడార్ స్టేషన్ పరిస్థితి ఏమిటనే చర్చ జరుగుతోంది.

నిద్రిస్తున్న చిన్నారిని ఈడ్చుకెళ్లిన చిరుత!

- స్థానికులు కేకలు వేయడంతో పొదల్లో వదిలేసి పరుగు
- పాప తలకు, పొట్ట భాగంలో తీవ్ర గాయాలు
- ప్రకాశం జిల్లాలో ఘటన



చిరుత దాడిలో గాయపడిన చిన్నారి అంజమ్మ

ఆత్మకూరు/పెద్ద దోర్నాల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం సమీపంలోని ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాల మండలం చిన్నారుట్ల చెంచుగూడెంలో చిరుత కలకలం రేపింది. నిద్రిస్తున్న సమయంలో ఓ మూడేళ్ల చిన్నారిని చిరుత పులి ఈడ్చుకెళ్లే ప్రయత్నం చేయగా.. గూడెం వాసులు కేకలు వేయడంతో పొదల్లో వదిలేసి వెళ్లింది. బుధవారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటనలో బాధిత పాపకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీశైలానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్నారుట్ల చెంచుగూడెంకు చెందిన కుడుముల అంజయ్య, భార్య లింగేశ్వరి, వారి కుమార్తె అంజమ్మ బుధవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో వచ్చిన చిరుతపులి అంజయ్య పక్కనే నిద్రిస్తున్న అంజమ్మ తలను నోటికి కరుచుకొని అక్కడి నుంచి నెమ్మదిగా వెళ్లసాగింది. ఈ క్రమంలోనే ఆ చిన్నారి ఏడవడంతో తల్లిదండ్రులు ఒక్కసారిగా లేచి.. కర్ర చేతపట్టుకుని కేకలు వేస్తూ దాని వెంటపడ్డారు. విషయం తెలుసుకున్న గూడెంవాసులు కూడా వారికి తోడయ్యారు. దీంతో కొంత దూరంలో పులి ఆ చిన్నారిని చెట్లపొదల్లో వదిలేసి వెళ్లిపోయింది. ఈ ఘటనలో చిన్నారి తలకు, పొట్ట భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. సున్నిపెంట ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయడంతో ప్రాణాపాయం తప్పింది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ మహేష్ చిన్నారిని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్నారిని మెరుగైన వైద్యం కోసం దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇదిలా ఉండగా తమ గూడేనికి విద్యుత్ సదుపాయం లేకపోవడం వల్లే వన్యప్రాణుల నుంచి ముప్పు వాటిల్లిందని, విద్యుత్ సరఫరా అందించాలని స్థానికులు గురువారం దోర్నాల-శ్రీశైలం రోడ్డుపై ధర్నా చేపట్టారు. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దోర్నాల పోలీసు, అటవీ అధికారులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పారు. గూడేనికి విద్యుత్ సరఫరా అందించేలా చొరవ తీసుకుంటామని చెప్పడంతో వారు శాంతించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మళ్ళీ చిగురించిన దోస్తీ

అమెరికాతో చెడుతున్నకొద్దీ, చైనాతో స్నేహం పెరుగుతోంది. గురువారం చైనా అధికారప్రతినిధి భారత్‌తో సంబంధాలమీద చేసిన వ్యాఖ్యలు వస్తున్న మార్పును స్పష్టంగా సూచిస్తున్నాయి. భారత్ అభ్యంతరాలను గుర్తించడం, పొరపాట్లను సరిదిద్దుకోవడం, విశ్వాసాన్ని పెంచే చర్యలు చేపట్టడం గురించి ఆయన నిర్దిష్టంగా మాట్లాడారు. ఉభయదేశాల మధ్యా సరిహద్దు వాణిజ్యాన్ని పునరుద్ధరించేందుకు ఐదేళ్ళ తరువాత ప్రయత్నాలు జరుగుతున్నాయంటేనే, కొత్త ప్రేమలు చిగురిస్తున్నాయని అర్థం. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, సిక్కిం పర్వతశ్రేణుల్లో జరగబోతున్న ఈ ప్రయత్నం పరిమాణం రీత్యా పెద్దది కాకున్నా, ఒక సానుకూల పరిణామం. త్వరలోనే చైనా విదేశాంగమంత్రి మనదేశంలో పర్యటించడం కూడా గల్వాన్ ఘాతుకం అనంతరం ఉభయదేశాలమధ్యా పెరిగిన దూరాన్ని తగ్గించేందుకు ఉపకరిస్తుంది.

సుంకాల సమ్మెటదెబ్బలతో సరిపెట్టకుండా, ఏవో పాతకక్షలూ కోపతాపాలూ ఉన్నట్టుగా అమెరికా అధ్యక్షుడు భారత్‌తో వ్యవహరిస్తున్న నేపథ్యంలో, చైనాతో మన దోస్తీ పెరుగుతోంది. ఉభయదేశాలూ గతంలో పరస్పరం విధించుకున్న శిక్షలూ ఆంక్షలను సడలించడమో, తొలగించడమో జరుగుతోంది. బీజింగ్‌నుంచి ఎరువుల సరఫరా తిరిగి మొదలైంది, చైనా పౌరులకు భారత్ టూరిస్టు వీసాలు ఇస్తోంది. భారత్–చైనా మధ్య నేరుగా విమానసర్వీసులు నడిపే ప్రయత్నం కూడా జోరందుకుంది. ఉభయదేశాల మధ్యా సరిహద్దు వివాదాలకు సంబంధించిన చర్చలు జరుగుతున్నప్పటికీ, ఉన్నతస్థాయిలోనే చేయాల్సిన కొన్ని కీలక నిర్ణయాలు ఇంకా మిగిలే ఉన్నాయి. చైనా విదేశాంగమంత్రి పర్యటన, భారత భద్రతాసలహాదారు అజిత్ దోభాల్‌తో భేటీ ఈ వివాదాల పరిష్కారానికి దోహదపడవచ్చునని ఆశ. ఇక, అక్టోబర్‌లో జరగనున్న షాంఘై సహకార సంఘం సదస్సుకు హాజరుకావాలని ప్రధాని నరేంద్రమోదీ నిర్ణయించుకున్నందుకు చైనా సంతోషిస్తోంది. చైనా దినపత్రిక గ్లోబల్ టైమ్స్ తన సంపాదకీయంలో మోదీని ప్రశంసిస్తూ, హిందీ చీనీ భాయిభాయి తరహాలో అనేక మంచిమాటలు రాసింది.

భారత్–చైనా మధ్య ఐదేళ్ళపాటు కొనసాగిన ఎడబాటు ఇప్పుడు డోనాల్డ్ ట్రంప్ దయవల్ల, క్రమంగా తొలగిపోతోంది. భారత్‌ను తప్పుబట్టిన చైనానోటినుంచే ఇప్పుడు ప్రశంసలు వింటున్నాం. చైనాకు పోటీగా ఈ ప్రాంతంలో భారత్‌ను నిలబెట్టి, బలోపేతం చేసి, చైనా ఎదుగుదలనూ, విస్తరణవాదాన్నీ నియంత్రించాలన్న దశాబ్దాల అమెరికా వ్యూహాన్ని ట్రంప్ అతివేగంగా, స్వల్పకాలంలోనే తలకిందులు చేసేశారు. ట్రంప్ తొలివిడత ఏలుబడిలో మోదీతో పెరిగిన సాన్నిహిత్యం, భారత్‌మీద ఆయన కురిపించిన ప్రత్యేక ప్రేమలూ విస్మరించలేనివి. ట్రంప్ 'మగా', భారత్ 'మిగా' కలసి 'మెగా' అయిందంటూ మోదీ మొన్న ఫిబ్రవరిలో చేసిన ప్రసంగం ఆ దోస్తీకి అద్దంపట్టింది. కానీ, కొద్దినెలల్లోనే గాలి తిరిగిపోయింది. ఆపరేషన్ సిందూర్‌ను ఆపింది నేనేనని ట్రంప్ చెప్పుకోవడం, అవును నిజమేనంటూ పాకిస్థాన్ ప్రశంసించడం, ఆప్తమిత్రుడు మోదీ మాత్రం దానిని కాదనడం, ముప్పైసార్లు అదేపనిగా చెప్పుకుంటున్నా అవునని తలూపకపోవడం తెలిసిందే. నోబెల్‌శాంతికి నూరుశాతం అర్హుడనని అనుకుంటున్న ట్రంప్ అహాన్ని దెబ్బతీసిన ఫలితమే ఈ సుంకాలూ భారత్‌కు డెడ్ ఎకానమీ అంటూ శాపాలూ అని విశ్లేషకుల వాదన. భారత్‌లాంటి మిత్రదేశాలను ట్రంప్ తన దూకుడు నిర్ణయాలతో దూరం చేసుకోవడం సరికాదని నిక్కీ హేలీ వంటివారు హితవులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో ఒక బలమైన సంఘటిత శక్తిని అమెరికా ఎదుర్కోవాల్సి వస్తుందని అక్కడి మాజీ భద్రతాసలహాదారులు భయపడుతున్నారు. పాతస్నేహాలను గాలికొదిలేసి, శత్రువుకంటే అన్యాయంగా ట్రంప్ పరిగణిస్తున్న ఫలితంగానే ఇప్పుడు రష్యాతో రాసుకుపూసుకోవడానికీ, చైనాతో చేయి కలపడానికీ భారత్‌కు మరింత వీలుకలిగింది. ఆరేళ్ళ తరువాత మోదీ చైనా పర్యటనకు సిద్ధపడటమే కాక, పుతిన్‌తో టెలిఫోన్ సంభాషణ, ఆయన అక్టోబర్‌లో వస్తూండటం మార్పుకు నిదర్శనం. ఈ పరిణామాలన్నీ అంతిమంగా రష్యా–ఇండియా–చైనా (ఆర్ఐసి) త్రైపాక్షిక కూటమి పునరుద్ధరణకు మార్గాన్ని సుగమం చేస్తాయని అమెరికా మీద ఆగ్రహంతో ఉన్న విశ్లేషకుల నమ్మకం.

క్రైస్తవులకూ తప్పని వేధింపులు!



నరేంద్ర మోదీ 2014లో దేశ ప్రధానమంత్రి అయిన నాటి నుంచీ భారతీయ ముస్లింల పట్ల వ్యవహరిస్తున్న తీరుతెన్నులను పలువురు ఆక్షేపిస్తున్నారు. మోదీ సర్కార్‌ను 2002 గుజరాత్ మతోన్మాద హింసాకాండ వెన్నాడుతూనే ఉన్నది, హిందూత్వ భావజాల మెజారిటీవాద ప్రపంచ దృక్పథమే ప్రభావితం చేస్తూనే ఉన్నది. భారతీయ ముస్లింలు 'పరాయివారు, ప్రమాదకారులు'గా ఆయన ప్రభుత్వం పరిగణిస్తుందన్న భావనను ప్రజల మనసు నుంచి రూపుమాపలేకపోతున్నారు. సంఘ్ పరివార్‌లోని కరడుగట్టిన తీవ్రవాదుల మూలంగా మోదీ ప్రభుత్వం తనపై ఉన్న ముస్లిం వ్యతిరేకతా ముద్రను వదిలించుకోలేకపోతోంది. హిందూత్వ ఉన్మాదులు తమ మాటలు, చేతల్లోను ముస్లింలకు వ్యతిరేకంగా అమానుష నేరాలకు పాల్పడుతున్నారు. ఇటీవల కర్ణాటకలోని బెల్గావి నియోజకవర్గంలో శ్రీరామ సేన నాయకుడు ఒకరిని అరెస్టు చేశారు. ముస్లిం ప్రధానోపాధ్యాయుడు ఒకరిని అపఖ్యాతిపాలు చేసేందుకు ఒక ప్రభుత్వ పాఠశాలలోని తాగునీటిని విషపూరితం చేసాడని ఆరోపిస్తూ ఆ హెడ్‌మాస్టర్‌ను బదిలీ చేయించాడన్నది శ్రీరామ సేన నాయకుడిపై నమోదైన అభియోగం.

భారతీయ ముస్లింలకు వ్యతిరేకంగా విద్వేష ప్రసంగాలు పెచ్చరిల్లిపోవడం ఒక సాధారణ విషయమైపోయింది. అయితే అల్పసంఖ్యాకులలో అల్పసంఖ్యాకులు అయిన భారతీయ క్రైస్తవులతో భారతీయ జనతా పార్టీ సంక్లిష్ట సంబంధాల గురించిన మాటా మంతీ దేశ ప్రజలలో తక్కువే. జూలై 26న బీజేపీ పాలనలో ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ పోలీస్ స్టేషన్‌లో కేరళకు చెందిన ఇద్దరు క్రైస్తవ సన్యాసినులను నిర్బంధించారు. అమ్మాయిల అక్రమ రవాణా, బలవంతంగా మత మార్పిడులకు పాల్పడ్డారన్నది ఆ నన్స్‌పై నమోదైన ఆరోపణ. ఆ గిరిజన ప్రాంతానికి చెందిన స్థానిక బజరంగ్‌దళ్ నేతలు అరెస్టయిన క్రైస్తవ సన్యాసినులపై ఆ తప్పుడు ఆరోపణలు చేశారు. అక్రమ రవాణాకు గురయ్యారని చెప్పుతున్న అమ్మాయిలు తాము స్వచ్ఛందంగానే కేరళ నన్స్ వెంట వెళ్లామని, నర్సింగ్ వృత్తిలో శిక్షణ పొందాలని తాము ఆకాంక్షించామని కూడా వారు స్పష్టం చేశారు. మెరుగైన ఉద్యోగావకాశాలను అన్వేషించుకునేందుకు తమ కుమార్తెలకు అనుమతినిచ్చామని ఆ అమ్మాయిల తల్లిదండ్రులు కూడా చెప్పినట్టు నమోదయింది. అయినప్పటికీ దుర్గ్ గిరిజన ప్రాంత పోలీసులు ఈ వాస్తవాలను ఉద్దేశపూర్వకంగా ఉపేక్షించారు. స్థానిక బజరంగ్‌దళ్ నాయకుడి ఫిర్యాదు మేరకే ఆ క్రైస్తవ సన్యాసినులను అరెస్ట్ చేశారు. ఆ నన్స్‌కు మద్దతు తెలుపుతున్న వ్యక్తులను బజరంగ్‌దళ్ నేత జ్యోతిశర్మ బెదిరించినట్టు, కొంత మందిపై చేయి చేసుకున్నట్టు కూడా పూర్తి సాక్ష్యాధారాలతో వార్తలు వెలువడ్డాయి. అయినప్పటికీ పోలీసులు, బజరంగ్‌దళ్‌నే ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి సమర్థించారు.

ఇవేవీ ఆశ్చర్యకరమైన విషయాలు కాదు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో నేను ఛత్తీస్‌గఢ్‌లో పర్యటించాను. నారాయణపూర్ జిల్లాలోని ఒక చిన్న గ్రామంలో గిరిజనుల బృందం నొకదానితో మాట్లాడాను. హిందూత్వవాదులు తమను సామాజికంగా బహిష్కరించారని, తదాది తాము భయంతో బతుకుతున్నామని ఆ గిరిజనులు చెప్పారు. చివరకు తమ కుటుంబాలలో చనిపోయిన వారిని ఖననం చేసేందుకు కూడా అనుమతినివ్వడం లేదని వారు వాపోయారు. తిరిగి హిందూ మతంలోకి మారేంతవరకు తమను సామాజికంగా బహిష్కరిస్తామని హిందూత్వవాదులు అంటున్నారని వారు చెప్పారు. క్రైస్తవ గిరిజనుల 'ఘర్–వాప్సి' కార్యక్రమాన్ని సంఘ్ పరివార్ చాలా సంవత్సరాలుగా సువ్యవస్థితంగా నిర్వహిస్తోంది. మిషనరీలు ప్రలోభాలతో గిరిజనులను బలవంతంగా క్రైస్తవంలోకి మార్చుతున్నందుకు వ్యతిరేకంగా క్రైస్తవ గిరిజనులను సామాజిక బహిష్కరణతో తిరిగి హిందూ మతంలోకి తీసుకువచ్చేందుకు సంఘ్ పరివార్ అనుబంధ సంస్థ వనవాసి కల్యాణ్ కేంద్రాలు కృషి చేస్తున్నాయి.

> అల్పసంఖ్యాకులలో అల్పసంఖ్యాకులు అయిన క్రైస్తవుల పట్ల వ్యతిరేకతలు, విద్వేషాలను ముగింపునకు తీసుకురావడం ఎలా? ఈ ఏడాది క్రిస్మస్ పండుగ రోజున ప్రధానమంత్రి నరేంద్ర మోదీ క్రైస్తవ మత పెద్దలకు తేనీటి విందు ఇచ్చి జీసస్ మానవతను మెచ్చుకోవడం కాకుండా క్రైస్తవ మత వ్యతిరేక కార్యకలాపాలకు స్వస్తి చెప్పి తీరాలని బజరంగ్‌దళ్‌ను సరళంగా, కఠినంగా హెచ్చరించాలి. ఇది మాత్రమే మోదీ, బీజేపీలని భారతీయ క్రైస్తవులకు ప్రేమాస్పదులను చేస్తుంది.

భారత పౌరులకు మత స్వేచ్ఛ రాజ్యాంగబద్ధమైన హక్కు. తమకు ఇష్టమైన మతంలోకి మారే స్వేచ్ఛ అందులో భాగమే. బాబాసాహెబ్, ఆయన అనుయాయులు బౌద్ధ మతంలోకి మారారన్న విషయాన్ని మనం విస్మరించకూడదు. అయితే రాజ్యాంగ హక్కులు సంపూర్ణమైనవి కావు. ఇతర కారణాల దృష్ట్యా వాటిని ఎంపిక చేసి తగ్గించవచ్చు. ఈ దృష్ట్యా క్రైస్తవానికి మార్పిడిని బలవంతంగా జరిగినదిగా, అదొక నేరపూరిత చర్యగా పరిగణిస్తున్నారు. అయితే హిందూ మతంలోకి మళ్లీ మారడాన్ని స్వచ్ఛంద చర్యగా కొత్త జీవితానికి ఆశీర్వాదంగా భావిస్తున్నారు. అధికారంలో ఉన్న ప్రభుత్వాల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తున్న కారణంగానే బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు తమ ఇష్టారాజ్యంగా, నిర్భీతితో వ్యవహరించడం మామూలైపోయింది. భయపూరిత వాతావరణాన్ని సృష్టించి పోలీసుల మద్దతుతో ఘర్–వాప్సి కార్యక్రమాన్ని అమలుపరుస్తున్నారు.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

అనూహ్యంగా కేరళ క్రైస్తవ సన్యాసినులకు బెయిల్ మంజూరయింది. కేరళ ఎంపీలు కొంతమంది హోం మంత్రి అమిత్ షాను కలుసుకుని ఆ వ్యవహారంలో తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరడంతో ఆ బెయిల్ మంజూరు సుసాధ్యమయింది. కేంద్ర హోం శాఖ చాలా వేగంగా ప్రతిస్పందించింది, సందేహం లేదు. ఆ క్రైస్తవ సన్యాసినుల అరెస్ట్ కేరళలో రాజకీయ ఉద్రిక్తతలకు కారణం కావడం వల్లే అమిత్ షా ఎంపీలు అడిగిన వెన్వెంటనే జోక్యం చేసుకున్నారు. కేరళలో క్రైస్తవ జనాభా అధికంగా ఉన్నది. అందునా ఆ రాష్ట్రంలో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. కేరళలో ఎలాగైనా అధికారంలోకి రావడానికి బీజేపీ ఆరాటపడుతోంది. క్రైస్తవులను ఆకట్టుకోవడం ద్వారా హిందూ–క్రైస్తవ రాజకీయ ఒప్పందంతో అధికారాన్ని కైవసం చేసుకోవాలని బీజేపీ సంకల్పించుకున్నది. ఛత్తీస్‌గఢ్ పోలీసుల చెర నుంచి విడుదలై కేరళకు తిరిగి వచ్చిన క్రైస్తవ సన్యాసినులకు విమానాశ్రయంలో స్వాగతం పలికిన వారిలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ ఉండడంలో ఆశ్చర్యమేమీ లేదు. గోవాలో సొంత బలంతోను, మేఘాలయ, నాగాలాండ్‌లలో సంకీర్ణ ప్రభుత్వ భాగస్వామిగాను బీజేపీ అధికారంలో ఉన్నది. ఇవన్నీ క్రైస్తవులు అధికంగా ఉన్న రాష్ట్రాలే. ముస్లింలకు వ్యతిరేకంగా వ్యవహరించడం, ఆ మతస్థులు అత్యధికంగా ఉన్న జమ్మూ–కశ్మీర్‌ను రాత్రికి రాత్రే కేంద్ర పాలిత ప్రాంతాలుగా కుదించివేయడం తమ రాజకీయ ప్రయోజనాలకు దోహదం చేకూరగలదని బీజేపీ భావిస్తుండవచ్చు. అయితే క్రైస్తవులను తరచు విమర్శలకు లక్ష్యం చేసుకోలేదు. దానివల్ల దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా తనపై విమర్శలు వెల్లువెత్తగలవన్న వాస్తవాన్ని బీజేపీ విస్మరించలేదు.

ఈద్ పర్వదినం సందర్భంగా ముస్లిం మత పెద్దలు నిర్వహించే కార్యక్రమాలలో ఎన్నడూ పాల్గొనని ప్రధాని మోదీ గత డిసెంబర్‌లో క్రిస్మస్ వేడుకల సందర్భంగా కేథలిక్ బిషప్స్ కాన్ఫరెన్స్ గ్రూప్ ఇండియా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని జీసస్ బోధనలను ప్రస్తుతించారు. ఆ దైవ పురుషుని సామరస్యం, సౌభ్రాతృత్వ సందేశాలు మానవాళికి మార్గదర్శకమైనవని పేర్కొన్నారు. అంతేకాదు, క్రిస్మస్ పర్వదినం నాడు ప్రధానమంత్రి తన నివాసంలో క్రైస్తవ మత పెద్దలకు తేనీటి విందు ఇచ్చారు. జీసస్ ప్రబోధించిన విలువలను ఔదలదాల్చాలని సూచించారు. ఏ విధంగా చూసినా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్నేహపూర్వకమైన, ఆకర్షణీయమైన ఆతిథేయి, సందేహం లేదు.

సహనం, శాంతి సామరస్యాల సందేశం సామాన్య క్రైస్తవులకు చేరనప్పుడు మోదీ వ్యూహాత్మకంగా, ఆ అల్పసంఖ్యాకులను మొత్తంగా ఆకట్టుకునేందుకు చేస్తున్న ప్రయత్నాల వల్ల ప్రయోజనమేముంది? క్రైస్తవ సన్యాసినులు, మిషనరీలు బలవంతంగా మత మార్పిడులు చేయిస్తున్నారని బజరంగ్‌దళ్ ఆరోపిస్తోంది. ఈ క్రైస్తవులు 'జాతి–వ్యతిరేకులు', నేరస్థులు, ఇంకా అంతకంటే ఘోరమైనవారని కూడా ఆ హిందూత్వ సంస్థ దుయ్యబడుతోంది. 1999లో ఒడిషాలో మిషనరీ గ్రాహమ్ స్టెయిన్, బాలురు అయిన ఆయన కుమారులు ఇరువురూ బజరంగ్‌దళ్ నాయకుడు దారాసింగ్ పైశాచిక ఘాతుకానికి సజీవంగా దహనమయ్యారు. ఆ ఘటన, భారతీయ మత సామరస్య మహోదాత్త సంప్రదాయానికి ఒక మచ్చలా మిగిలిపోయింది. అలాగే, ఇటీవలి కాలంలో అష్టపదుల వయసులో ఉన్న ఫాదర్ స్టాన్‌స్వామి నక్సలైట్ల సానుభూతిపరుడు అనే నెపంతో, 'ఉపా' కింద అరెస్ట్ చేశారు. జైలులో ఉండగా ఆయనకు అత్యవసర వైద్య సదుపాయాలు సైతం ఆయనకు నిరాకరించారు. కోర్టు జోక్యం చేసుకునే దాకా ఆ వృద్ధుడిని జైలులోనే నిర్బంధించారు. అంతిమంగా ఆయన ఆస్పత్రిలో తుది శ్వాస విడిచారు. గత జూన్‌లో సంగ్లి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎమ్మెల్యే గోపీచంద్ పదాల్కర్ రూ.3 నుంచి రూ. 11 లక్షల బహుమానాన్ని ప్రకటించారు. ఎందుకు? 'బలవంతంగా మత మార్పిడులకు పాల్పడున్న క్రైస్తవ పూజారులపై హింసాత్మక దాడులను ప్రోత్సహించేందుకే సుమా. గ్లోబల్ వాచ్‌డాగ్ గ్రూప్ 'ఓపెన్ డోర్స్ గ్రూప్ రూపొందించిన 2024లో క్రైస్తవులను వేధించిన 'ప్రత్యేక ఆందోళనకరమైన దేశాలు' జాబితాలో భారత్ 11వ స్థానంలో ఉన్నది.

క్రైస్తవ మిషనరీలు పెద్ద ఎత్తున సామూహిక మత మార్పిడిలు చేయిస్తున్నారనే ఆరోపణ ఒకటి నిత్యం వినిపిస్తుండడం కద్దు. వాస్తవమేమిటి? దేశ జనాభాలో క్రైస్తవులు కేవలం 2.3 శాతం మంది మాత్రమే. ఆసక్తికరమైన విషయమేమిటంటే 1971 జనాభా గణనలో ఆ మతస్థులు 2.6 శాతంగా ఉన్నారు. క్రైస్తవ జనాభా తగ్గిపోతున్నప్పటికీ వారికి వ్యతిరేకంగా ఒక కపట ప్రచారం జరుగుతోంది. క్రైస్తవ మిషనరీలు బలవంతంగా, మోసంతో, నానా ప్రలోభాలతో సామూహిక మత మార్పిడులు చేయిస్తున్నారన్నదే ఆ తప్పుడు ప్రచారం. అల్పసంఖ్యాకులలో అల్పసంఖ్యాకులు అయిన క్రైస్తవుల పట్ల ఈ నిరాధార వ్యతిరేకతలు, విద్వేషాలను ముగింపునకు తీసుకురావడం ఎలా? ఈ ఏడాది క్రిస్మస్ పండుగ రోజున ప్రధానమంత్రి నరేంద్ర మోదీ క్రైస్తవ మత పెద్దలకు తేనీటి విందు ఇచ్చి జీసస్ మానవతను మెచ్చుకోవడం కాకుండా తమ క్రైస్తవ మత వ్యతిరేక కార్యకలాపాలకు స్వస్తి చెప్పి తీరాలని బజరంగ్‌దళ్‌ను సరళంగా, కఠినంగా హెచ్చరించాలి. భారతీయ నాగరికతా విలువలను కళంకపరిచే చర్యలకు పాల్పడకూడదని స్పష్టం చేయాలి. ఇది మాత్రమే మోదీని, బీజేపీని భారతీయ క్రైస్తవులకు ప్రేమాస్పదులను చేస్తుంది. అంతేగానీ వ్యూహాత్మక భేటీలు, విందులు, మరే ఇతర ప్రచార ఆర్భాటాలు ఆ మతస్థుల నుంచి గౌరవాదరాలను మీకు సమకూర్చలేవు.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

పాదచారులను మరచిన మార్గాలు!

మీరు ఇంటి నుంచి బయటికి వస్తారు. కనిపించేదేమిటి? రోడ్డుకు ఈ చివరి నుంచి ఆ చివరి దాకా వాహనాల వరుస! ఒకటి కాదు, రెండు వరుసల్లో మెల్లగా కదులుతూ కనిపిస్తుంటాయి, సందేహం లేదు. ఇది నగర ప్రధాన రహదారులకు పక్కగా ఉన్న మీ కాలనీలోని దృశ్యం. ఇక మెయిన్ రోడ్‌పై వాహనాల రద్దీ ఎలా ఉంటుందో చెప్పాలా? రద్దీ, రద్దీ, రద్దీ! జనసమ్మర్థం మన జీవితాలలో ఒక సాధారణ అంశమైపోయింది. ఆఫీసుకు బయలుదేరామా, బస్సుకోసం పడిగాపులు కాస్తాం. బస్సు వస్తుంది, తోసుకుంటూ ఎక్కుతాం, నుంచుంటాం, కూర్చుంటాం (అరుదుగా), ఒత్తిడికి గొణుగుతాం, ఆవేశపడతాం, శాపనార్థాలు పెడతాం, ఆశాభంగం చెందుతాం... చివరకు గమ్యానికి చేరే సమయానికి అ..ల..సి.. పోతాం, ఆ రోజు ముగిసిపోయిందని భావిస్తాం. నిజానికి అప్పటికి మన దైనందిన వృత్తి కార్యకలాపాలు ప్రారంభమే కావు!




■ సునీతా నారాయణ్

మట్టివాసన

దేశ వ్యాప్తంగా 50 నగరాలు, పట్టణాలలో ట్రాఫిక్ రద్దీని 'సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్'లోని నా సహచరులు విశ్లేషించారు. చిన్న పట్టణాలు, పెద్ద నగరాలు, మెట్రో నగరాలు, పర్వత ప్రాంత పట్టణాలు సర్వత్రా ప్రయాణ సేవలకు డిమాండ్ ఎక్కువగా ఉన్నప్పుడు, ఆ డిమాండ్ తక్కువగా ఉన్నప్పుడు రాకపోకలకు పడుతున్న సమయంలో వ్యత్యాసం రెట్టింపు, అంతకంటే ఎక్కువగా ఉంటుందని వెల్లడయింది. మరింత స్పష్టంగా చెప్పాలంటే మీ గమ్యాన్ని చేరేందుకు పట్టే సమయం మామూలు కంటే రెట్టింపుగా ఉంటోంది. ఢిల్లీ, బెంగళూరు లాంటి నగరాలలో పీక్ పీరియడ్ మరింతగా పెరిగిపోతుందని, కేవలం ఆఫీసు వేళల్లోనే కాకుండా ఇతర సమయాలలో కూడా రోడ్లపై వాహనాల కదలిక అసాధ్యమైపోతుందని వెల్లడయింది. మరో ముఖ్యమైన విషయమేమిటంటే ట్రాఫిక్ రద్దీ ఎంత ఎక్కువగా ఉంటే వాయు కాలుష్యం అంత అధికంగా ఉంటుంది. వాహనాలు ఎక్కువ సేపు రోడ్లపై కదలకుండా ఉండిపోవడం వల్లే వాయు కాలుష్యం పెరుగుదలకు దారితీస్తోంది. కనుక రద్దీ అనేది మీ దైనందిన జీవితాల నుంచి సమయాన్ని కొల్లగొట్టడమేకాదు. అనవసర ఒత్తిడిని పెంచుతుంది. ఆరోగ్యంపై హానికర ప్రభావాన్ని చూపుతోంది. మన ఆయుష్షును కూడా తగ్గిస్తోంది. ఇది చాలా బాధాకరం. మనకు మేలు చేయదు. ఇది మన జీవితాల్లో సాధారణం కాకూడదు.

ట్రాఫిక్ రద్దీతో సంభవిస్తున్న మనోవ్యాకులతను నధిగమించేందుకు మనం రాజకీయ అర్థశాస్త్రాన్ని అర్థం చేసుకోవాలి ప్రజలు అంతకంతకూ సొంత వాహనాలు సమకూర్చుకుంటున్నారు. తమ దైనందిన రాకపోకలకు వాటి మీదే ఆధారపడుతున్నారు. దీనివల్ల నగరాలు ఫ్లై ఓవర్లు మొదలైన రహదారి సదుపాయాలను అదనంగా సమకూర్చవలసి వస్తోంది. రోడ్డు ప్రదేశాన్ని అత్యంత అధికంగా, అత్యంత అసమర్థంగా ఉపయోగించుకునే చిన్న కార్లతో రహదారులు అన్నీ నిండిపోతున్నాయి. ఢిల్లీలో ప్రతి రోజూ 500కు పైగా కొత్త కార్లు రిజిస్టర్ అవుతున్నాయి. మేము సర్వే చేసిన నగరాలలో దైనందిన రాకపోకలకు 7 నుంచి 11 శాతం మంది మాత్రమే కార్లను వినియోగిస్తున్నారు. ట్రాఫిక్ రద్దీ బాగా ఉండే మరో నగరమైన బెంగళూరులో కార్లను వినియోగిస్తున్నవారు 7 శాతం మంది మాత్రమేనని నగరాలలో మరింత సమర్థ, స్థిరమైన రవాణా వ్యవస్థను సృష్టించడమే లక్ష్యంగా ఉన్న సమగ్ర మొబిలిటీ ప్రణాళిక సమాచారం వెల్లడించింది. ఇప్పుడు మన ప్రశ్న ఏమిటంటే మిగతా 80 నుంచి 90 శాతం మంది కూడా కార్లను వినియోగించుకుంటే అవన్నీ ప్రయాణించేందుకు సరిపోయే ప్రదేశం మన నగరాలలో ఉన్నదా? అవెలా ప్రయాణిస్తాయి?



పట్టణ, నగర ప్రాంతాలలో రోడ్లను పాదచారులనూ దృష్టిలో ఉంచుకుని రూపొందించడం లేదు. దీనివల్ల నడిచివెళ్లే వారికి ప్రమాదకరమైన, అసౌకర్య పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కాలిబాటలు ఉండవు. ఉన్నా వాటిని సరిగా నిర్వహించడం లేదు. ట్రాఫిక్ ప్రణాళికలో పాదచారుల భద్రత పట్ల నిర్లక్ష్యం సంపూర్ణంగా కనిపిస్తోంది.

నగరాలలో ప్రజా రవాణా తీరుతెన్నులు సరిగా లేకపోవడం ఒక ప్రధాన లోపం. ప్రజా రవాణా సంస్థ బస్సులు చాలా తక్కువగా తిరుగుతుంటాయి. అవి ప్రజల అవసరాలను తీర్చదగిన సంఖ్యలో ఉండవు. ప్రజలు వాటిపై ఆధారపడలేకపోతున్నారు. ట్రాఫిక్ రద్దీ కారణంగానే బస్సులు సమయానికి రావడం జరగకపోవడంతో వినయోగదారులు విసుగుచెందుతున్నారు. బస్సులు ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుపోతుండడంతో వాటి రాకపోకల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ కారణంగానే ఆ బస్సుల్లో ప్రయాణాలకు ప్రజలు విముఖత చూపుతున్నారు. మెట్రో రైల్ సదుపాయమున్న నగరాలలో వినియోగదారులకు కొంత ఉపశమనం చేకూరుతోంది. అయితే ఇక్కడ అనుకూలత, ప్రయాణ వ్యయాల ప్రశ్న తలెత్తుతోంది. మెట్రో టిక్కెట్ ధరనే కాకుండా తమ గమ్యాన్ని చేరుకునేందుకు రిక్షా, టాక్సీ మొదలైనవాటి వ్యయాన్ని కూడా భరించవలసి వస్తోంది. స్పష్టంగా చెప్పాలంటే పట్టణ, నగర ప్రాంతాలలో రోడ్లను పాదచారులనూ దృష్టిలో ఉంచుకుని రూపొందించడం లేదు. దీనివల్ల నడిచి వెళ్లేవారికి ప్రమాదకరమైన, అసౌకర్య పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కాలిబాటలు ఉండడం లేదు. ఉన్నా వాటిని సరిగా నిర్వహించడం లేదు. ట్రాఫిక్ ప్రణాళికలో పాదచారుల భద్రత పట్ల నిర్లక్ష్యం సంపూర్ణంగా కనిపిస్తోంది.

ఈ పరిస్థితిలో ఆటో రిక్షాలు, బ్యాటరీ రిక్షాలు, మినీ బస్సుల లాంటి అనుబంధ రవాణా సాధనాలపై అధికంగా ఆధారపడడం అనివార్యమవుతోంది. అయితే రోడ్లపై మరింత అస్తవ్యస్త పరిస్థితులను సృష్టిస్తున్నాయి. అయినా ఇవి కీలకమైనవి. గమ్యాన్ని చేరుకునేందుకు లక్షలాది ప్రజలకు అనువైన, భరించగల ప్రయాణ ప్రత్యామ్నాయంగా ఉంటున్నాయి. గుర్తించవలసిన వాస్తవమేమిటంటే ఈ రవాణా వ్యవస్థ ప్రణాళికాబద్ధంగా, నియంత్రితంగా లేదు. వాటిపై నియంత్రణ లేదు. వీటి ప్రాధాన్యాన్ని గుర్తించని పక్షంలో నగరాలలో రవాణా పద్ధతులను సౌకర్యవంతంగా తీర్చిదిద్దలేము. మరి ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు మార్గాంతరమేమిటి? ప్రజా రవాణా వ్యవస్థను మరింత విస్తృతమూ, పటిష్ఠం చేయాలి. బస్సుల సంఖ్యను మెట్రో రైళ్లను పెంచాలి. గమ్యాలకు వడిగా చేరేందుకు కాలి బాటలను నిర్మించాలి. వాహనాల కదలికలను నియంత్రించాలి. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన వారికి భారీ జరిమానాలు విధించాలి. చట్టవిరుద్ధ పార్కింగ్‌ను అరికట్టాలి. ఇవన్నీ మనకు తెలుసు. అయితే ఈ విషయమై మనం కలిసికట్టుగా కృషి చేయడం లేదు. అందుకు బదులుగా రోడ్డు వెడల్పు జరిగితే మనకు బాధలు తప్పిపోతాయని ఆశిస్తాం. ఇప్పటికైనా మనం మేల్కొనాలి. ట్రాఫిక్ పరిస్థితులను సమగ్రంగా ఆకళింపు చేసుకోవాలి.

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

త్యాగదీప్తి...దేశ స్ఫూర్తి

వీర పుత్రులు గన్న వసుంధరీ ఈ జననీ..
ధీర పుత్రులు వున్న పురంధరీ ఈ అవనీ..

త్యాగాల నా తల్లి తనువెల్లా రగిలింది
బానిసత్వ బతుకుల్లో బాధల్ని మ్రింగింది
కష్టాల కడలిలో కన్నీరు కార్చింది
చెరసాల చెలిమిలో చరితల్ని రాసింది

శరాలను సంధించిన వీరోచిత పోరాటం
శరీరాలు బంధించిన ఆకాంక్షల ఆరాటం
అల్లూరి సారథిగా అడుగేసిన వెలుగుబాట
తెల్లోడి గుండెల్ని వణికించిన తెలుగుపాట

సత్యాగ్రహ శాంతిదూత గాంధీజీ నెహ్రూజీ
వీరగాథ ఛత్రపతి శివమెత్తిన శివాజీ
మీసాలను మెలిపెట్టిన భగత్‌సింగు సుభాసు
మోసాలను కనిపెట్టిన భరతమాతే శెభాసు

రాజ్యాంగ నిర్మాణము రాచబాట వేసిన రోజు
అంబేద్కరుడి ఆశయ వెలుగులు నిండిన రోజు
సమానత్వ ఉషస్సులు ప్రసరించిన పండుగ రోజు
సర్వ సత్తాక ప్రజాస్వామ్యం పరిఢవిల్లిన రోజు

బాధించిన పరతంత్రం స్వేచ్ఛా హృది ఆర్తి
సాధించిన స్వాతంత్రం విరజిమ్మిన త్యాగ దీప్తి
అలుపెరగని ధీరత్వం అదే మన దేశ స్ఫూర్తి
మువ్వన్నెల జెండాతో మురిసింది జాతి కీర్తి

– డా.కటుకోఝ్వల రమేష్

నా జెండా

దారం సమైక్యగీతానికి బాణీ కట్టింది
దండలో రంగురంగుల పూలు
గొంతువిప్పాయి

గాంధీ –
స్వేచ్ఛగా ఎగురుతున్న
శాంతి కపోతాన్ని చూశాడేమో
దేశపటాన్ని బాగా గీశాడు

సమూహాన్ని నడిపించే
ఇంధన రహస్యం
గాంధీకి మాత్రమే తెలుసు

తుపాకీపై పావురం వాలింది
ఆంగ్లేయులపై అహింసావాది

ముందుకు సాగిపో!
అదిగో! నువ్వెగరేసే జెండా

కశ్మీరు కుంకుమ దిద్దుకొన్నాను
మల్లెలు తురుముకొన్నాను
ఆకుపచ్చ ఖద్దరు చీర ధరించాను
ఆయుధం లేకుండా గెలిచిన వీరనారిని

నా జెండా – రెపరెపల భాషలో
దేశభక్తి గీతాల్ని
ఆలపిస్తోంది

– రసరాజు

కాళేశ్వరానికి నేతలు, అధికారుల అవినీతి హారతి!

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి వరదలై పారిందని, అలక్ష్యం ఏరులై పొంగిందని జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ నివేదిక కుండబద్దలు కొట్టింది. దీనంతటికీ కేసీఆర్ పూర్తి బాధ్యుడని సూటిగా చెప్పింది. బ్యారేజీల కుంగుబాటు వ్యవహారం అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరిగింది కాబట్టే ఆ ప్రాజెక్టు మాటున సాగిన దారుణాలు బయటికి వచ్చాయి. కాదు, ప్రకృతే బయటేసింది. ఓ పెను ప్రమాదం నుంచి తెలంగాణ సమాజాన్ని అప్రమత్తం చేసింది. ప్రపంచ చరిత్రలో ఎక్కడా లేని విధంగా, నియంతల పాలన సాగుతున్న దేశాల్లో కూడా లేని విధంగా, ఒక ముఖ్యమంత్రి ఈ ప్రాజెక్టు నిర్మాణంలో ఆద్యంతం తానే అయి పోషించిన పాత్ర చర్చనీయాంశం అయింది.

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను ఎక్కడ కట్టాలో నిర్దేశించింది కేసీఆర్. ఎలా కట్టాలీ, ఎంత నీరు నిల్వ చేయాలీ, ఎలా నిర్వహించాలీ అన్న విషయాలతో పాటు, ప్రాజెక్టు ఆర్థిక అంచనాలను మార్చేసింది కూడా ఆయనే. సెంట్రల్ వాటర్ కమిషన్, హైపవర్ కమిటీ నిపుణుల సూచనల్ని నామమాత్రంగా కూడా పట్టించుకోలేదు. అప్పటి ముఖ్యమంత్రిగా కేసీఆర్, నీటిపారుదలశాఖ మంత్రిగా హరీశ్‌రావు, ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ తమ విధుల నిర్వహణలో ఏ మాత్రం బాధ్యత లేకుండా వ్యవహరించారని ఘోష్ కమిషన్ తప్పు పట్టింది. కాళేశ్వరం నిర్మాణం కోసం ఇచ్చిన ప్రధాన జీవోల్ని అసలు క్యాబినెట్ ముందే ఉంచలేదన్న నిజాన్ని కూడా కమిషన్ బయటపెట్టింది.

రూ.38,500 కోట్ల వ్యయంతో తలపెట్టిన ఈ ప్రాజెక్టు అంచనాల్ని ఓసారి రూ.71,436కోట్లకు ఆపై రూ.1,10,248.48 కోట్లకు పెంచారు. కాళేశ్వరం లోగుట్టు అంతా ఇక్కడే ఉంది. ఆ పెరిగిన అంచనాలు తలా కొందరు పంచుకున్న కారణంగానే అప్పటి అధికారులు నేతల్ని మించి చురుగ్గా వ్యవహరించి కాళేశ్వరం పూర్తి చేశారు. అప్పటి నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.కె. జోషి స్వయంగా మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మాణం వద్దన్న నిపుణుల కమిటీ నివేదికను తొక్కిపెట్టి కేసీఆర్ మౌఖిక ఆదేశాలకు జీహుజూర్ అన్నారు. నాటి సీఎం అదనపు కార్యదర్శి స్మితా సబర్వాల్ ప్రాజెక్టుకి సంబంధించి ఫైళ్లను కాబినెట్ ముందుకు రాకుండా చూసుకున్నారు. ఈఎన్‌సీగా ఉన్న సి. మురళీధర్ కేంద్ర జలవనరుల సంఘానికి తప్పుడు సమాచారం ఇచ్చారు. నాటి ఈఎన్‌సీ హరిరామ్ కాళేశ్వరం ప్రాజెక్టు ఎండీగా ఉండి విచారణ కమిషన్ ముందు బ్యారేజీల గురించి తనకేమీ తెలియదని సిగ్గులేకుండా చెప్పుకున్నారు. వీళ్ళతో పాటు నరేందర్‌రెడ్డి, కె.ఎస్.ఎస్ చంద్రశేఖర్, బసవరాజు, టి. శ్రీనివాస్, ఓంకార్ సింగ్ లాంటి ఉన్నతాధికార్లు కుప్పలు కుప్పలుగా తప్పులు చేసినట్టు ఘోష్ కమిషన్ తేల్చింది. వీరిలో కొందరు అధికారులపై ఏసీబీ దాడులు చేసింది. ఒకొక్కరి దగ్గర రూ.300 నుంచి 500 కోట్ల దాకా అక్రమాస్తులు ఉన్నట్టు తేలింది. అధికారుల వద్దే ఇంత డబ్బు మూలుగుతుండగా కాళేశ్వరానికి అసలు అవినీతి మకిలి అంటనేలేదని బీఆర్ఎస్ నాయకులు చెబుతున్నారు. అవినీతి అధికారుల వల్ల మొత్తం అధికార వ్యవస్థకే చెడ్డ పేరు వస్తోంది.

> అధికారుల వద్దే ఇంత డబ్బు మూలుగుతుండగా కాళేశ్వరానికి అసలు అవినీతి మకిలి అంటనేలేదని బీఆర్ఎస్ నాయకులు చెబుతున్నారు. అవసరార్థం జరిగే అవినీతి కన్నా అవినీతి కోసమే అవసరాలు, ఆలోచనలు ముందుకొస్తే పరిస్థితి ఎంత ప్రమాదకరంగా మారుతోందో తేలికైన ఉదాహరణ కాళేశ్వరం ప్రాజెక్ట్!



సహజంగా అధికారులు ప్రభుత్వ నిర్ణయాన్ని అమలుపరిచే విధానంలో కీలకంగా ఉంటారు. రాజకీయ నాయకుల కన్నా అధికారులకే సంబంధిత సబ్జెక్టులో సాధికారత ఉంటుంది. ఈ సాధికారత వల్ల ప్రభుత్వాధినేతలు రాజకీయ ప్రయోజనాల్ని ఆశించి తెలిసో తెలియకో చేసే తప్పుల్ని ఒకప్పుడు అధికారులు నియంత్రించేవాళ్ళు. చెన్నారెడ్డి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్, ఎన్టీఆర్, చంద్రబాబు లాంటి వాళ్ల సైతం సదరు ఐఏఎస్ అధికారుల మాటని గౌరవించి తమ నిర్ణయాన్ని మార్చుకున్న సందర్భాలు అనేకం. 1966 బ్యాచ్ ఐఏఎస్ అధికారి పీవీఆర్‌కే ప్రసాద్, ఐఏఎస్ అధికారి శంకరన్, ఈ తరానికి సుపరిచితమైన జయప్రకాష్ నారాయణ... వీరి నిజాయితీ నిబద్ధతల గురించి ఇప్పటికీ మాట్లాడుకుంటారు. వీరి ఈ తరహా వ్యవహారశైలి వల్ల అంతిమంగా ప్రజలే లబ్ధి పొందారు. సర్వీసెస్ నుంచి వచ్చిన అధికారులకు, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాధినేతలకు మధ్య సమన్వయం సమాజానికి హితం చేయడం ఎంత సహజమో, ఆ బంధం దారి తప్పితే ఎదురయ్యే పరిణామాలు సమాజానికి అంతే చేటు.

ఆస్తులు డబ్బు మూటలు కూడగడుతున్న ఉన్నతాధికారులు కొందరు ఆ తర్వాత ఆత్మగౌరవం పోయి, ఆత్మవిశ్వాసం లోపించి, సమాజం దృష్టిలోను ఒక్కోసారి కుటుంబం దృష్టిలోను కూడా దోషులుగా నిలబడుతున్నారు. విచారణల్లో బైటపడే వారి తప్పులు మొత్తం వ్యవస్థ మీదే నమ్మకం పోయేలా చేస్తున్నాయి. దీంతో ప్రజలు సైతం ఒక మోస్తరు అవినీతిని సహిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు అవ్వగానే తృణమో, పణమో ఇవ్వడానికి పెద్దగా ఆలోచించడం లేదు. కానీ డిమాండ్లతో తమ నడ్డి విరగగొట్టే అధికారం మీదే వీరి ఆక్రోశం. అవసరార్థం జరిగే అవినీతి కన్నా అవినీతి కోసమే అవసరాలు, ఆలోచనలు ముందుకొస్తే పరిస్థితి ఎంత ప్రమాదకరంగా మారుతోందో తేలికైన ఉదాహరణ కాళేశ్వరం ప్రాజెక్ట్!

■ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

హైదరాబాద్
నగర వార్తలు
శుక్రవారం 15 ఆగస్టు 2025

గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.0 కనిష్ఠం 21.6

ఆర్టీసీ టీ 24 టికెట్ ధర తగ్గింపు

హైదరాబాద్ సిటీ ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): ఒకే టికెట్‌పై రోజంతా ప్రయాణించే అవకాశమున్న టీ 24 టికెట్ ధరలను ఆర్టీసీ అధికారులు స్వల్పంగా తగ్గించారు. ప్రస్తుత ధర రూ.150 ఉండగా రూ.130 చేశారు. సీనియర్ సిటిజన్ల టికెట్ రూ.120 నుంచి రూ.110, బాలుర టికెట్ రూ.100 నుంచి రూ.90కు తగ్గించారు. కొత్త చార్జీలు ఆగస్టు 15 నుంచి 31 వరకు అమలులో ఉంటాయని అధికారులు తెలిపారు.


పురానాపూల్ వద్ద రోడ్డుపైకి వరద నీరు


జన చైతన్య మొండి కత్వ వద్ద నీటి ప్రవాహం


ఎంజీబీఎస్ వద్ద..

వరద ప్రవాహం | హిమాయత్‌సాగర్ గేట్లను ఎత్తడంతో మూసీలో వరద ఉప్పొంగుతోంది. పురానాపూల్, చాదర్‌ఘాట్‌లోని మూసానగర్ తదితర ప్రాంతాల్లో నీటి ఉధృతి పెరుగుతోంది. ఈసా కాలువ మధ్యలో జనచైతన్య వెంచర్ వద్ద ఉన్న మొండి కత్వ ప్రాంతంలో వరద నీరు పరవళ్లు తొక్కుతోంది. ఆనకట్ట పై నుంచి నీరు పారుతుండటం వాటర్ ఫాల్స్‌ను తలపిస్తోంది.

- ఫొటోలు : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్


మూసారాంబాగ్ వద్ద వరద ఉధృతి.. నిలిచిపోయిన బ్రిడ్జి పనులు

ముస్లోరాంబాగ్

- రెండేళ్లుగా సా...గుతున్న బ్రిడ్జి నిర్మాణం
- 30 శాతం కూడా పూర్తవని వైనం
- భారీ వర్షాలతో ప్రజలకు ఇక్కట్లు
- ఓ వైపు పాత బ్రిడ్జిపైకి నీరు
- వాహనాల రాకపోకలకు అంతరాయం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మూసీ నదిపై మూసారాంబాగ్ వద్ద హై లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. శంకుస్థాపన చేసి రెండేళ్లు కావస్తున్నా 30 శాతం పనులు కూడా పూర్తవలేదు. ఇప్పటికీ ఆస్తుల సేకరణ ప్రక్రియ కొలిక్కి రాకపోవడం గమనార్హం. భారీ వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వరద ఉధృతి పెరుగుతుండడంతో బ్రిడ్జి వద్ద ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం మూసీ వరద ఉధృతిలో బ్రిడ్జిపై నుంచి భారీగా వరద నీరు ప్రవహిస్తుండడంతో దానిపై నుంచి రాకపోకలను బంద్ చేశారు. బ్రిడ్జి నిర్మాణంలో ఆలస్యానికి బల్దియాలోని ఇంజనీరింగ్ విభాగం అధికారుల నిర్లక్ష్యమే కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సాధారణంగా వంతెనల నిర్మాణానికి సంబంధించి 15 రోజులు, నెల రోజుల లక్ష్యం నిర్దేశిస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. పనుల్లో ఆలస్యం జరిగితే ఏజెన్సీని అప్రమత్తం చేయడం.. అవసరమైతే పెనాల్టీ విధించాలి. కొన్నాళ్లుగా జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారుల్లో ఆ చొరవ కనిపించడం లేదు.

15లో ఒక్కటే..

పాత, కొత్త నగరాన్ని కలుపుతూ ప్రవహించే మూసీనదిపై పురాతన బ్రిడ్జిలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భారీ వర్షాలు పడినప్పుడు బ్రిడ్జిలపై నుంచి వాహనాల రాకపోకలు నిలిపివేయాల్సి వస్తోంది. దీంతో వాహనదారులకు దూరాభారం తప్పడం లేదు. ఈ ఇబ్బందులకు చెక్ పెట్టేలా, హైదరాబాద్ చారిత్రక నేపథ్యం ప్రతిబింబించేలా రూ.545 కోట్లతో పలు ప్రాంతాల్లో 15 బ్రిడ్జిలు నిర్మించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే సెప్టెంబరు 2023లో

మిగతా 6వ పేజీలో..

అయినా.. తవ్వకాలు!

మాన్‌సూన్‌లోనూ ఆగని వైనం

పైపులైన్లు, రహదారుల నిర్మాణం కోసం..
భారీ వర్షాలతో స్థానికుల ఇబ్బందులు
ఇళ్ల నుంచి అడుగు బయట పెట్టలేని దుస్థితి
ఏళ్లుగా పెండింగ్‌లో రహదారుల పునరుద్ధరణ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): 'భారీ వర్ష సూచన.. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దు. స్కూళ్లకు సెలవులు/ఒంటి పూట బడులు.. అంటూ ట్రాఫిక్ తిప్పల నేపథ్యంలో సర్కారీ శాఖలు అప్రమత్తమయ్యాయి. ఇదంతా నాణానికి ఒకవైపు. మాన్‌సూన్ సీజన్, భారీ వర్షాలు కురుస్తాయని తెలిసినా కొన్ని విషయాల్లో ప్రభుత్వ విభాగాలు ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యం ప్రజలకు ముప్పులా మారుతోంది. నిబంధనల నిక్కచ్చి అమలుకు కృషి చేయాల్సిన సర్కారీ శాఖలే వాటిని ఉల్లంఘిస్తే, నిషేధాన్ని పట్టించుకోకుంటే..? నగరంలోని పలు ప్రాంతాల్లో అదే దుస్థితి. పైపులైన్లు, రోడ్ల నిర్మాణం కోసం ఇష్టానికి తవ్వకాలు చేపట్టారు. దీంతో స్థానికంగా ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి.


సికింద్రాబాద్‌లో తవ్వివదిలేసిన రోడ్డు

నిషేధం ఉన్నా..

మాన్‌సూన్‌కు ముందే రోడ్ల తవ్వకాలపై నిషేధం విధిస్తున్నట్టు జీహెచ్ఎంసీ ప్రకటించింది. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు ఎక్కడా రహదారులు తవ్వవద్దని, నిషేధం ఉల్లంఘిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించింది. అత్యవసరమైతే తప్ప తవ్వకాలకు అనుమతి ఇచ్చేది లేదని స్పష్టం చేసింది. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు పూర్తి భిన్న పరిస్థితులు నెలకొన్నాయి. ఓ వైపు వర్షాలు కురుస్తున్నా, నూతన నిర్మాణాల పేరిట రహదారులు తవ్వారు. ఎత్తు పెరగకుండా అంతకుముందు ఉన్న రోడ్లను మిల్లింగ్ చేశారు. ఇక వాటర్‌బోర్డు వైఖరి మరీ అధ్వానం. డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ల పేరిట అంతర్గత రహదారులు తవ్వారు. మదీనాగూడ- మియాపూర్ రోడ్డులో జాతీయ రహదారి పక్కనే భారీ గుంత తవ్వి వదిలేశారు. సికింద్రాబాద్‌లోని ఆర్ఆర్‌ఇ మైదానం, వెంకట్‌నగర్ ప్రాంతాల్లో పైపులైన్ల కోసం రోడ్లు తవ్వి వదిలేశారు. దీంతో స్థానికులు అడుగు బయటపెట్టలేని దుస్థితి నెలకొంది. చిన్నారులు, వృద్ధులు తవ్విన రహదారులపై నడిచే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు.


మదీనాగూడలో రోడ్డు పక్కన తవ్వకాలు

పునరుద్ధరణ పట్టదా?

పైపులైన్లు, భూగర్భ కేబుళ్ల కోసం తవ్విన రహదారుల పునరుద్ధరణను ప్రభుత్వ విభాగాలు పట్టించుకోవడం లేదు. రెండు, మూడేళ్ల క్రితం పైపులైన్లు వేసేందుకు, మరమ్మతు చేసేందుకు తవ్విన రోడ్లను ఇప్పటికీ పునరుద్ధరించలేదు. చిక్కడపల్లి, హయత్‌నగర్ కూరగాయల మార్కెట్, మటన్ దుకాణం వీధి, నాగోల్ నువ్వులబండ కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్ల పునరుద్ధరణ పనులను పట్టించుకోవడం లేదు. రహదారుల తవ్వకాలకు సంబంధించి వాటర్‌బోర్డు నుంచి రూ.53 కోట్లు రావాల్సి ఉంది, అందుకే పనులు చేపట్టడంలో జాప్యం జరుగుతోందని జీహెచ్ఎంసీ చెబుతోంది. బల్దియా నుంచి మాకు రూ250 కోట్లకు పైగా బకాయిలు రావాలని జలమండలి పేర్కొంటుంది. ఇరు విభాగాల మధ్య ఆర్థిక పంచాయితీ పౌరులకు శాపంగా మారుతోంది.


నాగోలు-నువ్వులబండ రహదారి దుస్థితి


శరవేగంగా ఖైరతాబాద్ గణపతి పనులు
6

ఏడేళ్ల విద్యార్థిపై టీచర్ దాష్టీకం!

- నోటికి ప్లాస్టర్‌వేసి పెన్సిల్‌తో చిత్రహింసలు
- స్కూల్ సీసీ ఫుటేజీల్లో బయటపడ్డ బాగోతం
- పాఠశాల ఎదుట ఆందోళన

6



31 వరకు వన్ టైమ్ చాన్స్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గడువులోగా తమ పీహెచ్‌డీ పూర్తి చేయలేకపోయిన రీసెర్చ్ స్కాలర్స్‌కు 'వన్ టైమ్ చాన్స్' గడువును ఆగస్టు 31 వరకు జేఎన్‌టీయూ పొడిగించింది. అయితే, ప్రీ-పీహెచ్‌డీ పూర్తిచేసిన రీసెర్చ్ స్కాలర్స్‌కు మాత్రమే ఈ అవకాశం కల్పిస్తున్నట్లు ఆర్అండ్‌డీ డైరెక్టర్ చెన్నకేశవరెడ్డి తెలిపారు. అలాగే, ఫీజు/పెనాల్టీలు అధికంగా ఉన్నాయన్న ఫిర్యాదులపై వీసీ కిషన్ కుమార్ రెడ్డి స్పందించారు. పునఃసమీక్షించాలని అర్అండ్‌డీ డైరెక్టర్‌కు సూచించారు.

ఫుల్‌టైమ్ స్కాలర్స్‌కు జేఎన్‌టీయూ స్టైఫండ్

పోస్టుగ్రాడ్యుయేటెడ్ విద్యార్థులను పరిశోధనల వైపు ప్రోత్సహించేలా జేఎన్‌టీయూ

మిగతా 6వ పేజీలో..

వరదనీటి కాలువల పరిశీలన

- ముప్పు లేకుండా చర్యలు తీసుకోవాలని రంగనాథ్ ఆదేశం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలున్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వ విభాగాలు అప్రమత్తమయ్యాయి. లోతట్టు ప్రాంతాల వాసులకు ఇబ్బంది లేకుండా చేపట్టాల్సిన చర్యలపై ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. గురువారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నగరంలోని పలు ప్రాంతాల్లో వరద నీటి కాలువలను పరిశీలించారు. బంజారాహిల్స్‌లోని అంబేడ్కర్ బస్తీలో ఇటీవల రిటైనింగ్ వాల్ కూలిపోయిన నాలా వద్దకు వెళ్లారు. గోడ కూలడంతో వరద నీరు పొంగి పొర్లి తమ నివాసాల్లోకి వస్తుందన్న స్థానికుల ఫిర్యాదు నేపథ్యంలో ఆయన అక్కడకు వెళ్లారు. రిటైనింగ్ వాల్ పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. తలాబ్ చంచలం డివిజన్‌లోనూ రంగనాథ్ పర్యటించారు.



నాలాను పరిశీలిస్తున్న రంగనాథ్

పరిష్కరించకుండానే..

ఆన్‌లైన్ ఫిర్యాదులపై స్పందించని యంత్రాంగం
క్షేత్రస్థాయికి రాకుండానే అధికారి వచ్చినట్టు..
సమస్య పరిష్కరించినట్టు సందేశాలు
జీహెచ్ఎంసీలో కొనసాగుతున్న తంతు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గౌలిదొడ్డి జర్నలిస్టు కాలనీలోని ఓ వీధిలో స్ట్రీట్ లైట్స్ వెలగడం లేదని స్థానికంగా నివాసముండే వ్యక్తి పై జీహెచ్ఎంసీ మొబైల్ యాప్‌లో జూలై 11న ఫిర్యాదు చేశారు. వారం రోజుల అనంతరం సంబంధిత అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కరించినట్టు మొబైల్ నంబర్‌కు సందేశం వచ్చింది. కానీ లైట్లు మాత్రం వెలగలేదు. దీంతో అదే నెల 21వ తేదీన మరోసారి ఫిర్యాదు చేశారు. జూలై 31, ఆగస్టు 6న కూడా ఫిర్యాదు చేయగా సమస్య పరిష్కరించకపోగా.. అదే సమాధానం

మిగతా 6వ పేజీలో..




మొబైల్ యాప్‌లో ఫిర్యాదు చేసిన వివరాలు

'ఖజానా' దొంగల

నేర చరిత్రపై ఆరా!

హైదరాబాద్ సిటీ/చందానగర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నగరంలో సంచలనం సృష్టించిన ఖజానా జువెలరీ షాపు దోపిడీ కేసు దర్యాప్తును సైబరాబాద్ పోలీసులు ముమ్మరం చేశారు. ఎస్ఓటీ, సీసీఎస్, లా అండ్ ఆర్డర్ విభాగాలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల మీదుగా వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. సీసీ టీవీ దృశ్యాలు, ఆధారాలతో నిందితుల కోసం వేట కొనసాగిస్తున్నారు. విశ్వసనీయంగా తెలిసిన సమాచారం ప్రకారం నగరం నుంచి బీదర్ పారిపోయిన దొంగలు అక్కడి నుంచి మహారాష్ట్రలోని పుణేకు వెళ్లారు. అక్కడ ముఠాలోని కొందరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. మిగతా వారితో పాటు దోపిడీ సూత్రధారులు, పాత్రధారులందరినీ అదుపులోకి తీసుకొన్న తర్వాతే పూర్తి వివరాలు పోలీసులు వెల్లడించే అవకాశం ఉంది. అప్పటి వరకు దొంగలను వివిధ కోణాల్లో విచారించనున్నారు. దొంగల ముఠా సభ్యులు ఏ ప్రాంతానికి చెందిన వారు, నగరానికి ఎప్పుడు వచ్చారు.. ఎన్ని రోజుల పాటు నగరంలో ఉన్నారు, దోపిడీకి ముందు రెక్కీ ఎలా నిర్వహించారు అనే అంశాలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. భారీ దోపిడీకి స్కెచ్ వేసినా, కేవలం 10 కిలోల వెండి ఆభరణాలు, కొన్ని వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలతో దొంగలు వెళ్లిపోయారు. అయితే పట్టపగలే రద్దీగా ఉన్న ప్రాంతంలో దోపిడీకి పాల్పడడాన్ని పోలీసులు చాలెంజ్‌గా తీసుకున్నారు. హైదరాబాద్-ముంబై జాతీయ రహదారిపైనే ఈ సంఘటన జరగడం సవాల్‌గా మారింది. కేసును స్వయంగా సీపీ పర్యవేక్షిస్తున్నారు.



బిహార్ ముఠాగా అనుమానం?

దోపిడీ జరిగిన ప్రాంతంలోని సెల్‌టవర్స్ ద్వారా ఆయా సమయాల్లో కొన్ని మొబైల్ నంబర్స్‌ను పరిగణనలోకి తీసుకొని వారికి పోలీసులు ఫోన్ చేశారు. అందులో కొందరి ఫోన్లు స్విచ్ఛాఫ్ ఉన్నాయని, ప్రాథమిక సమాచారం ప్రకారం బిహార్‌కు చెందిన వారే చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

సీసీ ఫుటేజీలే కీలకం

దొంగలను పట్టుకోవడంలో సీసీ టీవీ ఫుటేజీలు కీలకంగా మారాయి. దొంగలు ఖజానా జువెలరీ షాపుల్లోకి వచ్చింది మొదలుకొని లోపల వెండి వస్తువులను బ్యాగుల్లో నింపుకుంటున్న దృశ్యాలతో పాటు బయట బైకులను పార్కింగ్ చేయడం, లోపలికి రావడం, తిరిగి వాటిపై పారిపోవడం వంటివి సీసీ టీవీల్లో స్పష్టంగా ఉన్నాయి. వీటితో పాటు దొంగలు పారిపోయిన మార్గాల్లోనూ సీసీ ఫుటేజీలనే ఆధారంగా సైబరాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.




వెలుగు జిలుగులు ▶ పంద్రాగస్టు నేపథ్యంలో చారిత్రక ప్రదేశాలు, కట్టడాలు విద్యుత్ వెలుగుల్లో ధగధగలాడుతున్నాయి. త్రివర్ణ రంగుల్లో కాంతులీనుతున్నాయి.

ప్రభుత్వ స్థలాలను విక్రయించొద్దు

● పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించాలి: రాజాసింగ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): హౌసింగ్ బోర్డు ఖాళీ స్థలాలను అమ్మడానికి ప్రభుత్వం యత్నిస్తుందని, వాటిని ప్రజా ప్రయోజన కోసం వినియోగించాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయం వెనుక హౌసింగ్ బోర్డుకు సంబంధించి విలువైన ఖాళీ స్థలం ఉందని, దానిని వేలం వేయడానికి అధికారులు నోటీసు ఇచ్చారని తెలిపారు. ఈ మేరకు గురువారం రాజాసింగ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఖాళీగా ఉన్న హౌసింగ్ బోర్డు స్థలాల్లో పేదలకు డబ్బుల్ బెడ్ రూం ఇళ్లు కానీ, ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ ఆఫీసులు ఏర్పాటు చేయాలన్నారు. పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలనే ఆలోచన సీఎం రేవంత్‌రెడ్డికి ఉంటే విలువైన ప్రభుత్వ స్థలాను విక్రయించడం మానుకోవాలన్నారు.



తార్నాకలోని ఓ ఇంట్లో రసాయనాలను పిచికారి చేస్తున్న సిబ్బంది

దోమల నివారణ చర్యలపై సాంకేతిక పర్యవేక్షణ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యం లో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా, దోమల నివారణ చర్యలపై జీహెచ్ఎంసీ సాంకేతిక పర్యవేక్షణ ప్రారంభించింది. ఎంటమాలజీ విభాగం బృందాలు క్షేత్రస్థాయిలో చేపడుతోన్న యాంటీ లార్వల్ ఆపరేషన్ (ఏఎల్ఓ), ఫాగింగ్‌ను జియోట్యాగింగ్ ద్వారా ట్రాక్‌చేసి, నివారణ చర్యలకు సంబంధించిన ఫొటోలను అక్షాంశం, రేఖాంశం ఆధారంగా సంబంధిత గ్రూపుతో పాటు, సర్కిల్, జోనల్, కేంద్ర కార్యాలయం అధికారులకు పంపుతున్నారు. డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా కేసులు నమోదైన ఇళ్లు, పరిసర ప్రాంతాల్లోని 100 నివాసాల్లో ఏఎల్ఓ ఫొటోలు అప్‌లోడ్ చేసేందుకు ప్రత్యేక మొబైల్ యాప్ అందుబాటులోకి తీసుకువచ్చారు. మనుషులు వెళ్లలేని ప్రాంతాల్లో మూసీ, చెరువులు, నాలాల్లో డ్రోన్ల ద్వారా రసాయనాల పిచికారి చేయనున్నట్టు గురువారం విడుదల చేసిన ప్రకటనలో జీహెచ్ఎంసీ పేర్కొంది. తతతగ్రేటర్‌లోని 4846 కాలనీల్లో నీటి నిల్వ ప్రదేశాలు, చెరువులు, బావులు, కుంటల్లో దోమల నివారణకు గంబుసియా చేపలు వదులుతున్నారు.

ఓక్రిడ్జ్ స్కూల్‌కు షోకాజ్ నోటీసులు

● 3 రోజుల్లో వివరణ ఇవ్వకుంటే చర్యలు: జీహెచ్ఎంసీ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఖాజాగూడలోని ఓక్రిడ్జ్ స్కూల్ యజమాన్యానికి జీహెచ్ఎంసీ నోటిసులు ఇచ్చింది. ప్రభుత్వ రహదారులపై పాఠశాలకు చెందిన వాహనాలు పార్కింగ్ చేసి పౌరులకు అసౌకర్యం కలిగిస్తున్నారని, దీంతో ఆ మార్గంలో నిత్యం 500 మీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అవుతుందని పేర్కొంటు శేరిలింగంపల్లి డిప్యూటీ మునిసిపల్ కమిషనర్ షోకాజ్ నోటిసులు జారీ చేశారు. ప్రభుత్వ రోడ్లపై అనధికారికంగా వాహనాలు పార్కింగ్ చేయడం జీహెచ్ఎంసీ చట్టం 1955 సెక్షన్ 405, టీజీ-బీపాస్ చట్టం-2020లను ఉల్లంఘించినట్టవుతుందని నోటీసుల్లో పేర్కొన్నారు. మూడు రోజుల్లో లిఖిత పూర్వకంగా వివరణ ఇవ్వని పక్షంలో చట్టపరంగా ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించినందుకు జరిమానా చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని నోటీస్‌లో పేర్కొన్నారు.

రద్దీ వేళల్లో అదనపు మెట్రో ట్రిప్పులు నడిపించాలి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రద్దీ వేళల్లో నగరంలో అదనపు మెట్రో ట్రిప్పులను నడిపించాలని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పీవైఎల్) రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ ప్రదీప్ ఎల్అండ్‌టీ అధికారులను కోరారు. మెట్రో రైళ్లలో ప్రయాణికుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ కొత్త రైళ్లు, కోచ్‌లను తీసుకురావడంలో ఎల్అండ్‌టీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. వర్షాకాలంలో, పీక్ అవర్స్‌లో అదనపు మెట్రో రైళ్ల ట్రిప్పులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అధికారులు ప్రత్యేక చొరవ చూపి మెట్రో సర్వీసుల సంఖ్యను వెంటనే పెంచాలని గురువారం ఓ ప్రకటనలో ఆయన కోరారు.

31 వరకు వన్ టైమ్ చాన్స్

(5వ పేజీ తరువాయి)

ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతోంది. జేఆర్ఎఫ్ (జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్) తరహాలో జేఎన్‌టీయూ నుంచి కూడా ఫుల్‌టైమ్ పీహెచ్‌డీకి అర్హులైన అభ్యర్థులుకు నెలవారీ ఉపకారవేతనాన్ని అందించాలని వీసీ కిషన్‌కుమార్ రెడ్డి నిర్ణయించారు. ఫుల్‌టైమ్ పీహెచ్‌డీ అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు రెండేళ్లపాటు నెలకు రూ.10వేల చొప్పున, మూడో ఏడాది నుంచి నెలకు రూ.25వేల చొప్పున ఇవ్వాలని వీసీ తీసుకున్న నిర్ణయం పట్ల విద్యార్థి సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

ముస్లోరాంబాగ్

(5వ పేజీ తరువాయి)

పనులకు శంకుస్థాపన చేశారు. మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టు చేపట్టాలని భావిస్తోన్న ప్రస్తుత సర్కారు 14 బ్రిడ్జిల నిర్మాణ ప్రతిపాదనలు రద్దు చేసింది. పనులు ప్రారంభం కావడంతో ముసారాంబాగ్ వద్ద బ్రిడ్జి నిర్మాణం కొనసాగించాలని నిర్ణయించారు. రూ.52కోట్లతో 220 మీటర్ల మేర ఆరు లేన్లుగా బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది.

ఆస్తుల సేకరణ ఎప్పుడు..?

నదికి ఇరువైపులా బ్రిడ్జి దిగే చోట మలక్‌పేట వైపు 25, అంబర్‌పేట వైపు 25 ఆస్తులు సేకరించాల్సి ఉంది. ఇప్పటి వరకు సేకరణ ప్రక్రియ పూర్తవలేదు. బ్రిడ్జి నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ బుధవారం పరిశీలించారు. అంబర్‌పేట నుంచి మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్ వైపు వెళ్లే వారికి బ్రిడ్జి ఎంతో కీలకమని, పట్టణ ప్రణాళిక, విపత్తుల నిర్వహణ శాఖల సమన్వయంతో నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బ్రిడ్జి నిర్మాణం నిర్ణీత గడువులోపు పూర్తయ్యేలా చూడాలని పేర్కొన్నారు.

పరిష్కరించకుండానే..

(5వ పేజీ తరువాయి)

వస్తుండడం గమనార్హం. దీంతో బుధవారం (ఆగస్టు 13న) మళ్లీ ఫిర్యాదు చేశారు. ఇదొక్కటే కాదు.. మొబైల్ యాప్, జీహెచ్ఎంసీ వెబ్‌సైట్‌లో చేస్తున్న ఫిర్యాదులపై ఇదే స్పందన. సమస్య పరిష్కరించకుండానే ఫిర్యాదు క్లోజ్ చేయడం సంస్థలో పరిపాటిగా మారింది. కంప్లయింట్ నెంబర్‌లో కనిపించే మొబైల్ నెంబర్‌కు ఫోన్ చేస్తే సంబంధిత అధికారులు స్పందించడం లేదు. తమ పరిధి కాదు.. మరో అధికారికి కాల్ చేయాలని కొందరు సూచిస్తున్నారు.

ఉన్నతాధికారులకు వెళ్తుందన్న భయంతో...

ఆన్‌లైన్‌లో జీహెచ్ఎంసీ దృష్టికి తీసుకెళ్లే సమస్యలు పరిష్కరించకుండానే ఫిర్యాదు క్లోజ్ చేయడం సాధారణమై పోయింది. గతంలోనూ ఈ అంశాలు ఉన్నతాధికారుల దృష్టికి రాగా ఒకరిద్దరు అధికారులను సస్పెండ్ చేశారు. ట్యాంక్‌బండ్‌పై వీధి దీపాలకు సంబంధించి సమస్య పరిష్కరించకుండానే క్లోజ్ చేసినందుకు అసిస్టెంట్ ఇంజనీర్‌పై అప్పటి కమిషనర్ జనార్దన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. ఆ తరువాత కొన్నాళ్లు జాగ్రత్తగా వ్యవహరించిన యంత్రాంగం.. కొన్నాళ్లుగా తిరిగి ఎప్పటిలానే వ్యవహరిస్తోంది. ఏడు పని దినాల్లో ఫిర్యాదు పరిష్కరించకుంటే సమాచారం ఆటోమేటిక్‌గా ఉన్నతాధికారులకు వెళ్తుంది. ఈ తరహా పెండింగ్ ఫిర్యాదులు ఎక్కువ ఉంటే చర్యలు తీసుకునే అవకాశముంది. అందుకే కొందరు అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లకుండా, సమస్య పరిష్కరించకుండా క్లోజ్ చేస్తుండడం గమనార్హం.



మోసం చేసిన వ్యక్తుల పోస్టర్‌ను చూపిస్తున్న బాధితులు

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం

● రూ. కోటీ 40 లక్షలు వసూలు

● వారిపై విచారణ జరిపించి న్యాయం చేయండి

● రాష్ట్ర ప్రభుత్వానికి బాధితుల విజ్ఞప్తి

బర్కత్‌పుర, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ ఆధారిత ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.కోటీ 40 లక్షలు వసూలు చేసి మోసం చేసిన వ్యక్తులపై పోలీసులు, సిట్ ద్వారా సమగ్ర దర్యాప్తు చేపట్టాలని బాధితులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో మంచిర్యాల జిల్లా మందమర్రి కి చెందిన బాధితులు కె.నాగరాజు, ఎన్.విజయ మాట్లాడుతూ.. కరీంనగర్‌కు బిజ్జిగిరి శ్రీనివాస్ అతడి స్నేహితుడు అబ్బోజు శ్రీనివాస్ అతడి చెల్లెలు శ్యామల కాంట్రాక్టు ఆధారిత ఉద్యోగాలు ఇస్తామని తమ నుంచి డబ్బులు వసూలు చేశారని తెలిపారు. ఇందుకోసం రాంగోపాల్‌పేట సింధి కాలనీలో 16 మందికి శిక్షణ ఇచ్చారని, శిక్షణ కాలంలో ఒక్కొక్కరికి నెలకు రూ. 6 వేల చొప్పున స్టైఫండ్‌ను బాధితుల అకౌంట్‌లో వేశారని, అప్పటికే తాము రూ. 40 లక్షలు చెల్లించామని వారు పేర్కొన్నారు. మొత్తం 23 మంది బాధితుల నుంచి రూ. కోటి 40లక్షలు వసూలు చేశారు గానీ, ఇప్పటివరకు ఉద్యోగాలు ఇప్పించలేదని, వారు ఇచ్చిన ఉద్యోగ ఆర్డర్ కాపీ నకీలదని తేలిందన్నారు. తాము మోసపోయామని గ్రహించి 2024 జూలై 5న రాంగోపాల్‌పేట పీఎస్‌లో ఫిర్యాదు చేశామని బాధితులు తెలిపారు. తమను మోసం చేసిన వారిని ప్రశ్నిస్తే వేధింపులకు గురిచేస్తున్నారని వాపోయారు. ఇంతవరకు ఒక్కరినీ అరెస్టు చేయలేదని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని తమను మోసం చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాల ని, తాము చెల్లించిన డబ్బులను తిరిగి ఇప్పిం చి న్యాయం చేయాలని బాధితులు కోరారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/h1yCzA7లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

ఈసాకు భారీగా వరద నీరు


హైదరీ ఎన్‌క్లేవ్‌లో నివాసాల్లోకి వచ్చిన వరద నీరు


మూసీ పరివాహక ప్రాంతాల్లో విపత్తు స్పందన బృందాల సభ్యులు

రాజేంద్రనగర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): హిమాయత్‌సాగర్ నుంచి బాపుఘాట్ వరకు ఉన్న ఈసా కాలువకు భారీగా వరదనీరు రావడంతో పరివాహక ప్రాంతాల్లోని హైదరీ ఎన్‌క్లేవ్‌లో నివాసముండే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో నివాసముండే ప్రజలు ఇళ్లకు తాళాలు వేసుకొని తెలిసిన వారి ఇళ్లలోకి వెళ్లిపోయారు. మొదటి, రెండో అంతస్తుల వారు అక్కడే ఉన్నారు. ఎగువ భాగంలో బుధవారం కురిసిన భారీ వర్షాలకు హిమాయత్‌సాగర్ జలాశయం నీటి మట్టం పెరగడంతో గురువారం హిమాయత్‌సాగర్ 10 గేట్లను నాలుగు ఫీట్ల మేర ఎత్తడంతో ఈ పరిస్థితి నెలకొంది.

ఈసా బఫర్ జోన్‌లో నిర్మాణాల వల్లే..

హిమాయత్‌సాగర్ నుంచి బాపుఘాట్ వరకు ఉన్న కాలువను ఈసా కాలువ అంటారు. ఆ కాలువ పక్కన బఫర్ జోన్ స్థలంలో నిర్మాణాలు ఉండడంతో హిమాయత్‌సాగర్ జలాశయం నిండినప్పుడల్లా బఫర్ జోన్‌లో ఉన్నటువంటి హైదరీ ఎన్‌క్లేవ్‌లోకి వరద నీరు వస్తోంది. మొండి కత్వ వద్ద ప్రమాదమని తెలిసినా కొందరు యువకులు సెల్ఫీలు తీసుకోవడానికి వెళ్లారు. మొండి కత్వ దగ్గరకు ఎవ్వరు వెల్లకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సివుంది.

సర్వాయి పాపన్న గౌడ్ జయంత్యుత్సవాల కన్వీనర్‌గా భాస్కర్ గౌడ్

రాజేంద్రనగర్,ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంత్యుత్సవాల కన్వీనర్‌గా అత్తాపూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముద్దగోని భాస్కర్‌గౌడ్ నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన మాట్లాడుతూ, 18న రవీంద్రభారతీలో నిర్వహించనున్న ఉత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గౌడ కులస్థులు, బహుజనులు తరలిరావాలన్నారు.

భారీ వర్షాలకు కూలిన పాత భవనం

అఫ్జల్‌గంజ్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బేగంబజార్ మార్కెట్‌లోని సంతోషిమాత దేవాలయం సమీపంలో ఉన్న 100సంవత్సరాల పురాతన భవనం ఒక్కసారిగా కూలిపోయింది. భవనంలో 20 సంవత్సరాలుగా ఎవరూ నివాసం ఉండడంలేదు. ప్రస్తుతం ఖాళీగానే ఉండడంతో ప్రమాదంతప్పింది. విషయం తెలుసుకున్న జీహెచ్ఎంసీ అధికారులు, ఎక్స్‌కవేటర్ సాయంతో శిథిలాల తొలగింపు చర్యలు చేపట్టారు.

25న సత్యాగ్రహ దీక్ష

బర్కత్‌పుర,ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బీసీలకు విద్యా ఉద్యోగ, స్థానిక సంస్థలలో 42శాతం రిజర్వేషన్లు సాధించుకోవడానికి ఈనెల 25న ఇందిరాపార్కు వద్ద సత్యాగ్రహ దీక్ష నిర్వహించనున్నట్టు రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. బీసీ రిజర్వేషన్లపై జీవో జారీ చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమసంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్‌ను గవర్నర్‌కు పంపినా ఇంతవరకు ఆమోదించలేదని మరొకసారి పంపాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు నీలా వెంకటేష్, జిల్లపల్లి అంజి, అనంతయ్య, సతీష్, అనురాధ, గంగాపురం పద్మ, బాలయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

గిరిజన గురుకులాల్లో 18న స్పాట్ అడ్మిషన్లు

రాజేంద్రనగర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలురు, బాలికల విద్యాలయాల్లో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న పరిమిత సీట్లలో చేరడానికి విద్యార్థులు ఈనెల 18న జిన్నారంలో జరిగే స్పాట్ అడ్మిషన్‌కు హాజరు కావాలని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల రీజినల్ కో ఆర్డినేటర్ నాగార్జునరావు ఓ ప్రకటనలో తెలిపారు. రంగారెడ్డి జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర విద్యాలయం జిన్నారంలో ఈనెల 18న స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ ఉంటుందని వివరాలకు 9441917170, 9490233477లను సంప్రదించవచ్చన్నారు.

శరవేగంగా ఖైరతాబాద్ గణపతి పనులు


పూరీ జగన్నాథుడికి రంగులు వేయడమే తరువాయి


రూపుదిద్దుకుంటున్న లక్ష్మీ సమేత హయగ్రీవస్వామి

గణపతి ఉత్సవాలకు మరో 15 రోజులు మాత్రమే ఉండడంతో ఖైరతాబాద్ భారీ గణపతి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం గణపతి ఫినిషింగ్ పనులు జరుగుతుండగా అవి పూర్తి కాగానే ఆర్టిస్టులు రంగులద్దే పనులు ప్రారంభించనున్నారు. ఈసారి ఖైరతాబాద్ గణపయ్య శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతిగా భక్తులకు దర్శనమివ్వనున్నాడు. 69 అడుగుల ఎత్తు, 28 అడుగుల వెడల్పుతో శాంతమూర్తిగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల త్రిశక్తి సమేతుడిగా రూపుదిద్దుకుంటున్నాడు. గణపయ్యకు ఇరువైపులా ఉండేలా పూరి జగన్నాథుడు సుభద్ర, బలరాముడి సహా లక్ష్మీ సమేత హయగ్రీవస్వామి, ఖైరతాబాద్ గ్రామ దేవతగా పిలువబడే గజ్జెలమ్మ అమ్మవారిని తీర్చిదిద్దుతున్నారు. అయితే, ఇప్పటికే పెద్ద ఎత్తున సందర్శకులు వస్తూ సెల్ఫీలు, ఫొటోలు, వీడియోలు తీస్తూ సందడి చేస్తున్నారు. దీంతో ఈ ప్రాంగణం ఓ మంచి సెల్ఫీస్పాట్‌గా మారింది. **ఖైరతాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి)**


భారీ గణపతి నమూనా చిత్రం


చివరి దశలో భారీ గణపతి పనులు

ఏడేళ్ల విద్యార్థిపై టీచర్ దాష్టీకం!

- నోటికి ప్లాస్టర్‌వేసి పెన్సిల్‌తో చిత్రహింసలు
- స్కూల్ సీసీ ఫుటేజీల్లో బయటపడ్డ బాగోతం
- పాఠశాల ఎదుట ఆందోళన

మన్సూరాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఓ క్లాస్ టీచర్ విద్యార్థిపై దాష్టీకానికి పాల్పడింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థి తండ్రి కృష్ణచైతన్యరెడ్డి వివరాల ప్రకారం.. రెండోతరగతి చదువుతున్న సాయినందన్‌రెడ్డి (7) రెండేళ్ల క్రితం బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషన్‌లో స్కూల్‌లో చేర్పించారు. కొద్దిరోజులుగా సాయినందన్ క్రమంగా బలహీన పడుతూ ఎవరితో మాట్లాడకుండా, నిద్రపోకుండా ఉంటూ స్కూల్‌కి వెళ్లడం మానేశాడన్నారు. దీంతో తల్లిదండ్రులు బాలుడిని ఇటీవల మానసిక వైద్యనిపుణుడి దగ్గరికి తీసుకెళ్లగా బాలుడు మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు పడుతున్నాడని తెలిపారు. దీంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు స్కూల్ అడ్మిన్ వద్ద నుంచి సీసీ కెమెరాలను పరిశీలించడంతో అసలు విషయం బయపడింది. ఓ టీచర్ సాయినందన్‌రెడ్డి నోటికి ప్లాస్టర్ వేస్తూ ఇబ్బంది పెట్టడం కనిపించింది. అదేవిధంగా బాలుడిని ఆరాతీయగా తన నోటికి ప్లాస్టర్ వేస్తూ పెన్సిల్‌తో చిత్రహింసలు చేసేదంటూ ఆరోపించారు. దీంతో ఆగ్రహించిన విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులతో కలిసి పాఠశాలకు వెళ్లగా సిబ్బందితో తమపై దాడి చేయించారని వారు ఆరోపించారు.


విద్యార్థికి ప్లాస్టర్ వేస్తూ ఇబ్బంది పెడుతున్న ఉపాధ్యాయురాలు (సీసీ ఫుటేజీలో)


పాఠశాల గేటు ఎదుట ధర్నా చేస్తున్న బాధిత విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు

రూ.2లక్షలకు పైగా ఫీజు తీసుకుని..

తమ పిల్లల భవిష్యత్ బాగుపడుతుందని ఏడాదికి రూ.2లక్షలు ఆపై ఫీజులు చెల్లించి పంపిస్తే ఇలాంటి దారుణాలకు పాల్పడతారా అంటూ తల్లిదండ్రులు ఆగ్రహించారు. ఈ విషయమై విద్యాశాఖ అధికారులు, డీఈఓ, ఎంఈఓలకు సమాచారం ఇస్తే వారు స్పందించడం లేదని వారు ఆరోపించారు. వెంటనే సదరు టీచర్‌ను అరెస్టు చేసి పాఠశాల పై చర్యలు తీసుకోవాలంటూ పలు విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి గురువారం స్కూల్ గేటు ఎదుట బాలుడి తల్లిదండ్రులు, బంధువులు ఆందోళనకు దిగారు. అయితే, ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి పాఠశాల యాజమాన్యాన్ని వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా ఎలాంటి స్పందన రాకపోవడం గమనార్హం.

లెక్కల పుస్తకం తేలేదని..

బోరబండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): లెక్కల పుస్తకం తేలేదని ఆరేళ్ల చిన్నారి (ఒకటోతరగతి విద్యార్థి) వీపుపై వాతలు తేలేలా ఓ టీచర్ దారుణంగా కొట్టింది. బోరబండ పోలీసులు తెలిపిన ప్రకారం ఎర్రగడ్డకు చెందిన మహ్మద్ రియాన్‌ఖాన్ గౌతంపురి కాలనీలోని ఓ ప్రైవేట్ స్కూల్లో ఒకటో తరగతి చదువుతున్నాడు. గురువారం సాయంత్రం రియాన్ ఏడ్చుకుంటూ ఇంటికెళ్లాడు. లెక్కల పుస్తకం తేలేదని టీచర్ తబస్సుమ్ తీవ్రంగా కొట్టిందని తల్లిదండ్రులకు చెప్పాడు. దుస్తులు తీసి చూడగా ఒళ్లంతా వాతలు కనిపించాయి. ఈ మేరకు విద్యార్థి తండ్రి మహమ్మద్ అమీర్‌ఖాన్ టీచర్‌పై బోరబండ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


ఎండీ రియాన్‌ఖాన్


సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న సీపీ సీవీ ఆనంద్

మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

హైదరాబాద్ సిటీ ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వినాయక మండపాల నిర్వాహకులు నిబంధనలను, కోర్టు ఆదేశాలను పాటించాలని నగర సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. విగ్రహాల వివరాలు పోలీసులకు తెలిపితే అందుకు తగ్గట్టుగా సీసీ కెమెరాలతో నిఘా, భద్రత, నిమజ్జన ఏర్పాట్లు చేస్తామన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో గురువారం గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు, అన్ని విభాగాల అధికారులతో కలిసి అంతర్గత సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అర్ధరాత్రి వరకు డీజే మోగించకుండా ఉండేందుకు గణేశ్ ఉత్సవ సమితి వారు సహకరించాలన్నారు. ఈ ఏడాది గణేశ్ ఉత్సవాలు, మిలాద్ ఉల్‌నబీ పండుగలు ఒకేసారి వస్తున్నందున అందరూ సమన్వయంతో పోలీసులకు సహకరించాలని కోరారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ చిన్న విగ్రహాల నిమజ్జనం కోసం బేబీ పాండ్‌లు, క్రేన్‌లు ఏర్పాటు చేశామన్నారు. నిమజ్జనం సజావుగా సాగేందుకు 160 స్పెషల్ యాక్షన్ టీమ్‌లను రంగంలోకి దించుతున్నట్లు తెలిపారు. నిమజ్జనం సందర్భంగా అర్ధరాత్రి వరకు అదనపు ట్రిప్పులు నడిపిస్తామని మెట్రో అధికారులు తెలిపారు. అన్ని మండపాల వద్ద వైద్య బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ హరిచందన తెలిపారు.

ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా రాత్రి వేళల్లో కూడా సిబ్బందిని నియమిస్తున్నామని జాయింట్ సీపీ జోయల్ డేవిస్ తెలిపారు. టీజీఐసీసీసీ డైరెక్టర్ వి.బి. కమలాసన్ రెడ్డి మాట్లాడుతూ, మూడు కమిషనరేట్ల పరిధిలోని సీసీటీవీ కెమెరాలను అనుసంధానం చేశామని, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఇక్కడి నుంచే నిఘా కొనసాగుతుందని తెలిపారు. సమన్వయ సమావేశంలో అడిషనల్ సీపీలు విక్రమ్‌సింగ్‌మాన్, పి. విశ్వప్రసాద్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, సైబరాబాద్ జాయింట్ సీపీ గజరావు భూపాల్, హైదరాబాద్ సిటీ పోలీసు అధికారులు, భాగ్యనగర్ ఉత్సవ సమితి ప్రెసిడెంట్ రాఘవరెడ్డి, శశిధర్‌రెడ్డి, ఖైరతాబాద్ ఉత్సవ సమితి ప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎంకు ఇంజనీర్ల సంఘం కృతజ్ఞతలు

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వేతనాల ఫైల్‌ను సర్క్యులేట్ చేసిన రోజునే ఆమోద ముద్ర వేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి హైదరాబాద్ ఇంజనీర్ల సంఘం అధ్యక్షులు రాపోలు రవీందర్, ప్రధానకార్యదర్శి చక్రధర్, కోశాధికారి అంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు. బదిలీ అయి కొన్ని నెలల నుంచి జీతాలు రాని 63 ఇంజనీర్ల జీతాల ఫైల్‌ని సర్క్యులేట్ చేయగా ఫైల్ వచ్చిన రోజునే ఆమోదం తెలిపి, వెంటనే వేతనాలు విడుదల చేయాలని గురువారం, సీఎం ఆర్థిక శాఖకు ఆదేశాలు జారీచేశారని వారు పేర్కొన్నారు.



సాలార్‌జంగ్ మ్యూజియంలో తెలుగు స్వాతంత్ర్య సమరయోధుల ఫొటోలను తిలకిస్తున్న ఎంపీ విజయేంద్ర ప్రసాద్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వీసీ జగదీశ్వరరావు తదితరులు
- ఫొటో : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హైదరాబాద్

భారతీయ ఆధ్యాత్మికత ప్రపంచానికి మార్గదర్శకం

బర్కత్‌పుర, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు, ఆధ్యాత్మికత ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచాయని హరియాణ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఇతిహాసాలు, పురాణాలు, వేదాలు, రామాయణ, మహాభారతం, భగవద్గీత ప్రపంచానికి ఆదర్శమని అన్నారు. గురువారం బర్కత్‌పుర లింగంపల్లి చౌరస్తాలో శ్రీమహాకాళి దేవాలయంలో శ్రీదుర్గా భవాని అమ్మవారి పునఃప్రతిష్ఠ, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలని, అప్పుడే సరైన మార్గంలో నడుస్తారని అన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు గోపాల్, ప్రధాన కార్యదర్శి అరవింద్, ఉపాధ్యక్షుడు యాదప్ప, తదితరులు పాల్గొన్నారు.


బర్కత్‌పురలో శ్రీదుర్గాభవాని పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

సైకిల్ ట్రాక్‌పై మురుగు ప్రవాహం



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి దేశంలో ఎక్కడా లేని విధంగా నిర్మాణం చేసిన సోలార్ రూఫ్ టాప్ సైకిల్ ట్రాక్‌పై మురుగు పరుగులు తీస్తోంది. ఔటర్ రింగ్‌రోడ్డు వెంట గల సైకిల్ ట్రాక్‌పై పుప్పాలగూడలోని మైహోం అవతార్‌కు సమీపంలోనే మురుగు పొంగుతూ దుర్వాసన వెదజల్లుతోంది. ఆ మురుగంతా సైకిల్ ట్రాక్‌పై ప్రవహిస్తుండడంతో సైకిలిస్టులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సైకిలిస్టుల కోసం స్మార్ట్‌బైక్ పాయింట్, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. వాటికి ఏర్పాటు చేసిన డ్రైనేజీ సైకిల్ ట్రాక్ పక్కనే ఏర్పాటు చేశారు. ఈ డ్రైనేజీ ఎక్కడికక్కడే మూసుకుపోవడంతో మురుగు సైకిల్‌ట్రాక్‌లో పరుగులు తీస్తోంది. సైకిల్ ట్రాక్‌పై మురుగు పొంగిపొర్లకుండా హెచ్‌ఎండీఏ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని, సైక్లిస్టులు కోరుతున్నారు.

పంద్రాగస్టుకు ఎంఎంటీఎస్ స్పెషల్స్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ప్రత్యేక ఎంఎంటీఎస్ రైళ్లను నడపాలని దక్షిణ మధ్యరైల్వే నిర్ణయించింది. ఉందానగర్ నుంచి హైదరాబాద్ (నాంపల్లి) వైపు ఉదయం 5.20గంటలకు, హైదరాబాద్ నుంచి లింగంపల్లి వైపు 7.20గంటలకు, లింగంపల్లి నుంచి ఉందానగర్ మార్గంలో ఉదయం 9.10గంటలకు ప్రత్యేక ఎంఎంటీఎస్ సర్వీసులు నడుస్తాయని సీపీఆర్‌ఓ శ్రీధర్ తెలిపారు. జంటనగరాల్లోని ప్రయాణికులు పంద్రాగస్టు స్పెషల్ ఎంఎంటీఎస్ సర్వీసులను వినియోగించుకోవాలని సూచించారు.

18న చలో రాజ్‌భవన్


చలో రాజ్‌భవన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆమ్‌ఆద్మీపార్టీ నేతలు

కవాడిగూడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేతిలో తెలంగాణ గవర్నర్ కీలుబొమ్మగా వ్యవహరించడం దుర్మార్గమని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. దోమలగూడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, విద్యతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును నేరుగా రాష్ట్రపతికి పంపించకపోవడాన్ని నిరసిస్తూ ఈనెల 18న ఆమ్‌ఆద్మీపార్టీ ఆధ్వర్యంలో చలో రాజ్‌భవన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు అందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బుర్రారాముగౌడ్, విజయ్‌మల్లంగి, తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రాంతాలకు 307 మంది తరలింపు


మలక్‌పేటలో సురక్షిత ప్రాంతాలకు తరలుతున్న ప్రజలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): హిమాయత్‌సాగర్ జలాశయం నుంచి నీటిని విడుదల చేయడంతో మూసీ నదిలో ప్రవాహ ఉధృతి పెరిగింది. దీంతో మలక్‌పేట, రాజేంద్రనగర్, గోషామహల్‌లోని లోతట్టు ప్రాంతాల నుంచి 307 మందిని జీహెచ్‌ఎంసీ విపత్తు స్పందనా బృందాలు సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. ఆయా ప్రాంతాల్లోని కమ్యూనిటీ హాళ్లు, ఫంక్షన్‌హాళ్లలో ముంపు ప్రాంతాల వాసులను ఉంచారు. వారికి ఆహారం, అవసరమైన వారికి వైద్య సదుపాయాలు కల్పించినట్టు అధికారులు పేర్కొన్నారు.

ప్రమాదకర ప్రాంతాలపై నిఘా పెట్టండి


రోడ్డుపైకి వస్తున్న జల్‌పల్లి పెద్ద చెరువు వరద నీటిని పరిశీలిస్తున్న కమిషనర్ ఆర్వీ కర్ణన్

రాజేంద్రనగర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో వచ్చే మూడు రోజులు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదానికి ఆస్కారం ఉన్న ప్రదేశాలపై నిరంతరం నిఘా పెట్టాలని, జోనల్, సర్కిల్, వార్డు అధికారులను కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశించారు. రాజేంద్రనగర్ సర్కిల్‌లో గురువారం దక్షిణ మండలం జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేందర్‌రెడ్డి, ఇతర విభాగాల అధికారులతో కలసి కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. జల్‌పల్లి పెద్ద చెరువు పొంగి లక్ష్మీగూడ వాంబే కాలనీ పరిసరాలలో ఉన్న రోడ్లపై వరద పారుతుండటంతో ఆ నీటిని ఫిరంగి నాలాలోకి మళ్లించే పనులను అధికారులతో కలసి పర్యవేక్షించారు. వాటర్ లాగింగ్ పాయింట్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టి ట్రాఫిక్ పోలీసుల సహకారంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని అన్నారు.

నాలాల పూడికతీత పనుల పరిశీలన


యాకుత్‌పురాలో నాలాల పూడికతీత పనులను ఎమ్మెల్యేతో కలసి పరిశీలిస్తున్న రంగనాథ్, తదితరులు

చార్మినార్ ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : యాకుత్ పురా పరిధిలోని నాలాలో పూడికతీత పనులను స్థానిక ఎమ్మెల్యే జాఫర్‌హుస్సేన్ మేరాజ్‌తో కలిసి హైడ్రా కమిషనర్ రంగనాథ్ గురువారం పరిశీలించారు. తలాబ్‌కట్ట, యాకుత్‌పుర తదితర ప్రాంతాలలోని నాలా పూడిక తీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ నాలా పూడికతీతను హైడ్రా సిబ్బంది నూతన టెక్నాలజీ యంత్రాలతో తొలగిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సోహైల్‌ఖాద్రి, డా సమీనా, వసియుద్దీన్, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు,

చర్లపల్లి-కాకినాడ, నాందేడ్-తిరుపతి
వీక్లీ స్పెషల్ రైళ్ల పొడిగింపు

హైదరాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా చర్లపల్లి-కాకినాడ, నాందేడ్-తిరుపతి మధ్య వీక్లీ స్పెషల్ రైళ్లను పొడిగించినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. చర్లపల్లి-కాకినాడ టౌన్ (07031) ప్రత్యేక రైలు ఈనెల 15, 22, సెప్టెంబర్ 2వ తేదీ(శుక్రవారం)వరకు, కాకినాడ టౌన్-చర్లపల్లి (07032) ప్రత్యేక రైలు ఈనెల 17, 24, 31 తేదీ(ఆదివారం)వరకు, హెచ్ఎస్.నాందేడ్-తిరుపతి (07015) ప్రత్యేకరైలు (ప్రతి శనివారం) 2026 మార్చి 28వరకు, తిరుపతి-హెచ్ఎస్.నాందేడ్ (07016) ప్రత్యేక రైలు(ప్రతి ఆదివారం) మార్చి 29, 2026 వరకు పొడిగిస్తున్నట్టు పేర్కొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద క్యాండిల్ ప్రదర్శనలో ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే శ్రీ గణేష్ తదితరులు

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న కేంద్రం

- ఈడీ, ఈసీలను జేబు సంస్థలుగా మార్చుకున్న బీజేపీ
- ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

కవాడిగూడ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ సర్కార్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ఈడీ, సీబీఐ, ఎన్నికల కమిషన్(ఈసీల)ను జేబు సంస్థలుగా మార్చుకున్నదని ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆరోపించారు. దేశంలోని అనేక పార్లమెంట్ నియోజకవర్గాలలో దొంగ ఓట్లతో బీజేపీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఏసీసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు గురువారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద 'ఓట్ చోర్.. గద్దె చోడ్' పేరుతో క్యాండిల్ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గెలుపుపై కూడా పలు అనుమానాలు ఉన్నాయన్నారు. బెంగళూరులోని ఓ ఎంపీ నియోజకవర్గం ఓటర్ జాబితాలో ఉన్న అవకతవకలపై నివేదికను కేంద్ర ఎన్నికల కమిషన్‌కు అందజేసినప్పటికీ, వారు బీజేపీ పార్టీకి కొమ్ముకాస్తూ మాట్లాడటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, సీనియర్ కాంగ్రెస్ నేతలు విడి కృష్ణ, మారిశెట్టి నర్సింగ్‌రావు, యువజన కాంగ్రెస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్, ఇంజనీరింగ్ సీట్ల పేరిట ఘరానా మోసం

- రూ. 41 లక్షలు తీసుకుని చేతులెత్తేసిన వైనం

బంజారాహిల్స్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మెడికల్, ఇంజనీరింగ్ కాలేజీలో సీట్లు ఇప్పిస్తామని రూ.41 లక్షలు తీసుకొని మోసం చేసిన కన్సల్టెన్సీ నిర్వాహకులపై కేసు నమోదు అయింది. కూకట్‌పల్లికి చెందిన జి.రమేష్, వి.వెంకట్ తమ పిల్లలకు మెడికల్, ఇంజనీరింగ్ కాలేజీలలో సీట్ల కోసం అరోరా కాలనీలో నాలెడ్జ్ నెస్ట్ కన్సల్టెన్సీని సంప్రదించారు. నిర్వాహకులు పువ్వుల హేమ రోహిత్, తోట రాజు, రోహిత్ చౌదరి, భవానీ, సాయిరాం చౌదరి మాట్లాడుతూ ఇంజనీరింగ్ సీట్లకు రూ.21 లక్షలు, ఎంబీబీఎస్ సీటుకు రూ.1.01 కోట్లు, బీడీఎస్ సీటుకు రూ.14 లక్షలు నిర్ణయించారు. ఆ మేరకు వేర్వేరుగా రూ.41 లక్షలు ఆన్‌లైన్ ద్వారా చెల్లించారు. రోజులు గడుస్తున్నా సీట్ల సమాచారం ఇవ్వకుండా, ఫోన్ చేసినా స్పందించక పోవడం, కార్యాలయం సైతం మూసిఉండడంతో అనుమానించారు. నిర్వాహకులు అయ్యప్ప సొసైటీలోని ఓ హోటల్‌లో ఉన్నారని తెలుసుకొని అక్కడకు వెళ్లగా అప్పటికే వారు అక్కడినుంచి పారిపోయారు. మోసపోయినట్టు గ్రహించిన బాధితులు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మీ సేవ కమిషనర్‌కు బెదిరింపులు, బ్లాక్‌మెయిల్

బంజారాహిల్స్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మీ సేవ కమిషనర్ పట్ల బెదిరింపు ధోరణితో మాట్లాడటమే కాకుండా బ్లాక్‌మెయిల్ చేసిన వ్యక్తిపై కేసు నమోదయింది. బంజారాహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 7లోని ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (మీసేవ) కేంద్రంలో రవికిరణ్ (ఐఏఎస్ అధికారి) కమిషనర్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 12న సీజే అరుణ్‌కుమార్ హయత్ నగర్‌లో నిర్వహిస్తున్న మీసేవ కేంద్రాన్ని తొలగించాలనే దానిపై చర్చ జరుగుతుండగగా అదే సమయంలో ఫిర్యాదుదారుడు ఎంవీకే ప్రసాద్ అక్కడికి వచ్చాడు. వెంటనే కేంద్రాన్ని ఎత్తేయాలని డిమాండ్ చేశాడు. ఈ విషయం కోర్టులో పరిధిలో ఉందని, కొంత సమయం పడుతుందని కమిషనర్ వివరించారు. అయినప్పటికీ ప్రసాద్ వినిపించుకోకుండా బెదిరింపు ధోరణిలో మాట్లాడడంతో పాటు బ్లాక్ మెయిల్ చేయడం మొదలుపెట్టారు. దాంతో ప్రభుత్వ విధులకు ఆటంకం కల్పించి, తనను బెదిరించాడని రవికిరణ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆధ్యాత్మిక స్ఫూర్తిదాతలు...



నేడు స్వాతంత్ర్య దినోత్సవం

భారత స్వాతంత్ర్య సమరం ఎన్నో వాగులు, వంకలు కలిసి ఎగసిన మహా ప్రవాహం. అహింసావాదం, సాయుధ విప్లవవాదం, సంఘ సంస్కరణవాదం... ఇలా అన్ని రకాల భావజాలాలు 'దేశ విముక్తి' అనే లక్ష్యం కోసం ఏకోన్ముఖంగా సాగిన అపూర్వ సందర్భం అది. ఆ ఉద్యమానికి ఎందరో ఆధ్యాత్మిక గురువులు స్ఫూర్తిని, నైతిక మార్గదర్శకత్వాన్ని అందించడమే కాదు... స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనేలా ఎందరికో ప్రేరణగా నిలిచారు. అలాంటి వారిలో కొందరిని స్మరించుకుందాం.

దయానంద సరస్వతి

ఆధ్యాత్మికవేత్తగా, సంఘ సంస్కర్తగా ఆర్య సమాజ్ వ్యవస్థాపకుడు దయానంద సరస్వతి సుప్రసిద్ధులు. 1824లో గుజరాత్‌లోని తంకారా అనే పట్టణంలో ఆయన జన్మించారు. 1857 నుంచి ప్రారంభమైన భారత స్వాతంత్ర్య పోరాటంలో ఆయన ప్రత్యక్షంగా పాల్గొనకపోయినా... ఆయన బోధనలు, ముఖ్యంగా ఆయన రచించిన 'సత్యార్థ ప్రకాశం' గ్రంథం ఎందరినో ప్రభావితం చేశాయి. విదేశీ ఆధిపత్యాన్ని తిరస్కరించాలని, జాతి గౌరవాన్ని నిలబెట్టుకోవాలని, స్వయం సమృద్ధి సాధించాలని ఆయన ఇచ్చిన సందేశాలు తదుపరి కాలంలో స్వాతంత్ర్య యోధులకు మంత్రాలుగా మారాయి.



సుసంపన్నమైన భారతీయ సంస్కృతి ఏ విదేశీ సంస్కృతికన్నా తక్కువ కాదనీ, మన వారసత్వాన్ని గర్వంగా భావించాలనీ స్వామి దయానంద బోధించారు. కుల వివక్ష, అస్పృశ్యత, మహిళలను తక్కువగా చూడడం లాంటి వైఖరులను ఆయన తీవ్రంగా ఖండించారు. ఒక జాతిగా అందరూ సమైక్యంగా ఉండాల్సిన ఆవశ్యకతను చాటి చెప్పారు. ఆర్యసమాజ్... భారత స్వాతంత్ర్య పోరాటానికి ఎందరో నాయకులను అందించింది. లాలా లజపతిరాయ్ లాంటి అనేకమంది జాతీయవాదులు ఆ సంస్థ నుంచి వచ్చినవారే. ఆర్యసమాజ్ విద్యా సంస్థలు, సామాజిక కార్యక్రమాలు స్వాతంత్ర్య పోరాటం దిశగా ప్రజలను మళ్ళించడంలో కీలకపాత్ర పోషించాయి.

అరబింద్ ఘోష్

మన దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన ఆగస్టు 15వ తేదీ శ్రీ అరవిందుల జన్మదినం కూడా. 1872లో కోల్‌కతాలో పుట్టిన ఆయన విదేశాల్లో విద్యాభ్యాసం చేశారు. వివిధ భాషలు నేర్చుకున్నారు. మన దేశ ఆధ్యాత్మికత, సంస్కృతుల ఔన్నత్యం గురించి అవగాహన ఏర్పరచుకున్నారు. బెంగాల్ విభజన ఆయనకు తీవ్ర వేదన కలిగించింది. బరోడాలో చేస్తున్న ఉద్యోగాన్ని వదిలేశారు. స్వాతంత్ర్యోద్యమంలోకి అడుగుపెట్టారు. తిరిగి కోల్‌కతాకు వచ్చి... నేషనలిస్ట్ పార్టీకి నాయకత్వ బాధ్యతలు చేపట్టారు. 'వందేమాతరం' అనే పత్రికను స్థాపించి, తన రచనల ద్వారా ప్రజల్లో స్ఫూర్తి రగిలించారు. బ్రిటిష్ పాలకుల చెర నుంచి దేశాన్ని విడిపించాలంటే విప్లవ పంథాయే అనుసరణీయం అనేది మొదట్లో ఆయన సిద్ధాంతం. అయితే ఆలీపూర్ బాంబు కేసులో జైలుకు వెళ్ళిన తరువాత... ఆయనలో ఆధ్యాత్మిక భావనలు మరింత బలపడ్డాయి. జైలు నుంచి విడుదలయ్యాక పుదుచ్చేరి చేరుకొని, అక్కడ యోగ సాధనను కొనసాగించారు. కాంగ్రెస్ నాయకత్వం చేపట్టాలనే అభ్యర్థనను తిరస్కరించారు. 'సంపూర్ణ స్వరాజ్యం' అనే నినాదాన్ని సృష్టించినది ఆయనే. ఆధ్యాత్మిక శక్తికి నిలయమైన భారతదేశమే ప్రపంచానికి గురువు అవుతుందని స్పష్టం చేసిన శ్రీ అరవిందుల ప్రభావం ఆనాటి ఎందరో జాతీయోద్యమ నాయకుల మీద ప్రగాఢంగా ఉంది.

శ్రీమద్ రాజ్‌చంద్రజీ

ఆధ్యాత్మికంగా సంక్షోభానికి గురైన సమయంలో... నేను ఆశ్రయించేది శ్రీమద్‌జీనే- ఇది మహాత్మాగాంధీ తన 'సత్యశోధన' గ్రంథంలో చెప్పిన మాట. ప్రజలందరినీ ఒక్కతాటిపై నడిపించి, దేశ స్వాతంత్ర్య సాధనను సుగమం చేసిన గాంధీకి ఆధ్యాత్మిక మార్గదర్శి అయిన ఆ శ్రీమద్‌జీ ఎవరు? శ్రీమద్ రాజ్‌చంద్రజీగా శిష్యులు పిలుచుకొనే ఆ జైన యోగి అసలు పేరు లక్ష్మీనందన్ మెహతా. 1867లో గుజరాత్‌లోని వవానియాలో పుట్టారు. చిన్నప్పుడు ఒక శవ దహనాన్ని చూసిన ఆయనకు గత జన్మలన్నీ గుర్తుకు వచ్చాయి. అప్పుడే ఆయనలో వైరాగ్య భావాలకు పునాది పడింది. ఏడేళ్ళ చదువును రెండేళ్ళకే పూర్తి చేసిన ఆయన బాల్యంలోనే కవిత్వం రాయడం ప్రారంభించారు. అష్టావధానిగా, శతావధానిగా ప్రఖ్యాతి పొందారు. అయితే ఆధ్యాత్మిక పురోగతే ఎప్పుడూ ఆయన లక్ష్యంగా ఉండేది. ముక్తిని వెతుకుతూ ప్రయాణం ప్రారంభించారు. ఇరవై మూడేళ్ళ వయసులో ఆయన జ్ఞానాన్వేషణ ఫలించింది. యోగిగా మారారు. అనేక రచనలు చేశారు.



గాంధీ ఆయనను 1891లో... ముంబయిలో తొలిసారి కలుసుకున్నారు. శ్రీమద్‌జీలోని విశ్లేషణా నైపుణ్యం, విషయ పరిజ్ఞానం, నైతిక నిష్ఠ గాంధీని ఆకర్షించాయి. వారిద్దరి మధ్య గురు శిష్యుల అనుబంధం క్రమంగా బలపడింది. "ఆధ్యాత్మిక విషయాలకు సంబంధించి నా హృదయాన్ని ఇంతగా ఆక్రమించుకున్న వ్యక్తి ఇప్పటివరకూ మరొకరు లేరు" అని గాంధీ ఒక వ్యాసంలో పేర్కొన్నారు. గాంధీ దక్షిణాఫ్రికాలో ఉన్నప్పుడు గాంధీకీ, శ్రీమద్‌జీకి మధ్య ఉత్తరప్రత్యుత్తరాలు సాగుతూ ఉండేవి. ఒకసారి మానవుల ఉనికి, గుర్తింపు, మతం లాంటి అంశాలపై ఎన్నో సంశయాలు గాంధీకి కలిగాయి. ఇరవై ఏడు ప్రశ్నలను శ్రీమద్‌జీకి పంపారు. వాటన్నిటికీ సమాధానాలిస్తూ ఆ సందేహాలన్నిటినీ ఆయన నివృత్తి చేశారు. నిస్వార్థ సేవ, అహింసా మార్గం, నిరాడంబరత లాంటి అంశాల్లో గాంధీజీకి ఆదర్శంగా నిలచిన వ్యక్తి శ్రీమద్‌జీ. గాంధీ ఆలోచనలను తీర్చిదిద్దడంలో, విశ్వాసాలను స్థిరపరచడంలో, మహాత్ముడిగా మారడంలో శ్రీమద్‌జీ ప్రభావం అపారంగా ఉంది.



ప్రపంచవ్యాప్తంగా హిందువులందరూ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకొనే పండుగలలో శ్రీకృష్ణ జన్మాష్టమి ఒకటి. ఈ పవిత్రమైన రోజు మన జీవితాల్లో ఆధ్యాత్మిక ఆనందాన్ని నింపుతుంది. శ్రీకృష్ణుని దివ్య ఆవిర్భావ లీలను తెలియజేస్తుంది. మనకు, భగవంతుడికి ఉన్న సనాతనమైన బంధాన్ని గుర్తు చేస్తుంది.

దివ్య లీల

రేపు శ్రీకృష్ణాష్టమి

శ్రీకృష్ణుడు సకల సృష్టికీ మూల పురుషుడు. ఆయన రూపం, నామం, లీలలు, గుణగణాలు... అన్నీ ఆకర్షణీయమైనవే. శ్రావణ మాసంలోని బహుళ పక్ష అష్టమి రోజున ఆయన అవతరించాడు కాబట్టి... ఆ తిథి 'శ్రీకృష్ణ జన్మాష్టమి'గా ప్రసిద్ధి చెందింది. శ్రీకృష్ణుని జననం సాధారణ శిశువుల మాదిరిగా సంభవించినది కాదు. ఎందుకంటే ఆయన పుట్టుక లేనివాడు. దేవాదిదేవుడు, సర్వశక్తిమంతుడు. కాబట్టి తన స్వీయ సంకల్పంతోనే అవతరిస్తాడు గానీ.. భౌతిక ప్రకృతి నియమాలకు బద్ధుడై కాదు. శ్రీకృష్ణుడు ఈ లోకంలో... మానవుల మధ్య జన్మించడం ఆయన దివ్య లీలల్లో ఒకటి. మథురలోని కంసుడి కారాగారంలో శ్రీకృష్ణుడు జన్మించినప్పుడు... శంఖ, చక్ర, గదా, పద్మాలతో... చతుర్భుజ విష్ణుమూర్తిగా దర్శనమిచ్చాడు. ఆ తరువాత తల్లి దేవకి ప్రార్థించడంతో... సామాన్య బాలుడిగా రూపాంతరం చెందాడు. కేవలం ఏడేళ్ళ వయసులో... తన చిటికెన వేలు మీద గోవర్ధన పర్వతాన్ని నిలబెట్టడం ఆయన అసాధారణ శక్తిని నిరూపిస్తుంది. సజ్జనులను రక్షించి, దుర్జనులను శిక్షించి, ధర్మాన్ని పునఃస్థాపించడానికి తాను యుగయుగానా అవతరిస్తానని ఆయన స్వయంగా ప్రకటించాడు.

శ్రీకృష్ణాష్టమినాడు ఏం చేయాలి?

శ్రీకృష్ణాష్టమినాడు ఆ శ్రీకృష్ణుని కృపను పొందడానికి భక్తులు కొన్ని ఆచారాలను పాటిస్తారు. వాటిలో ముఖ్యమైనవి: స్వామి ఆవిర్భవించిన సమయమైన అర్ధరాత్రి పన్నెండు గంటల వరకూ ఉపవాసం ఉండడం. ఆరోగ్యం సహకరించనివారు పండ్లు, పాలు, ఇతర ప్రసాదాలను తీసుకోవచ్చు. హరేకృష్ణ మంత్రాన్ని జపించడం ముఖ్యమైన విధిగా భావించాలి. కనీసం నూట ఎనిమిది సార్లు జపించాలి. భగవద్గీత, శ్రీమద్భాగవతం లాంటి గ్రంథాల నుంచి శ్రీకృష్ణుని లీలలను, ఉపదేశాలను పఠించడం పుణ్యప్రదం. శ్రీకృష్ణుని ఆలయాలకు వెళ్ళి, ఆయన సుందర రూపాన్ని దర్శించాలి. ఉదయం బ్రహ్మీ ముహూర్తంలో శ్రీకృష్ణుని విగ్రహానికి లేదా చిత్రపటానికి హారతి ఇవ్వాలి, తులసీదేవిని పూజించాలి.

ప్రభుపాదుల కృషితో విశ్వవ్యాప్తం

వివిధ కారణాల రీత్యా శ్రీకృష్ణ జన్మాష్టమి రోజున ఆలయాలకు వెళ్ళలేని భక్తులు కూడా శ్రీకృష్ణుడి అపారమైన కృపను పొందవచ్చు. శ్రీ చైతన్య మహాప్రభువు బోధించినట్టు... కపటంతో, కలహాలతో నిండిన కలియుగంలో హరినామ సంకీర్తనమే ఏకైక ముక్తి మార్గం. 'హరేకృష్ణ' మంత్ర జపం కలి కల్మషాలను నాశనం చేస్తుంది. హరేకృష్ణ ఉద్యమ సంస్థాపకాచార్యులైన శ్రీల ప్రభుపాదులు శ్రీకృష్ణ జన్మాష్టమిని ప్రపంచమంతటా వ్యాప్తి చేయడంలో అపారమైన కృషి చేశారు. 1965లో... 70 ఏళ్ళ వయసులో... కేవలం నలభై రూపాయలు, కొన్ని శ్రీమద్భాగవత గ్రంథాలతో ఆయన అమెరికా బయలుదేరారు. భగవద్గీతా సారాన్ని, 'హరేకృష్ణ' నామాన్ని పశ్చిమ దేశాల్లో ప్రచారం చేశారు. ఆరు ఖండాల్లో 108 కృష్ణ దేవాలయాలను స్థాపించారు. ప్రపంచంలోని ప్రసిద్ధ నగరాల్లో జగన్నాథ రథ యాత్రలను నిర్వహించి, ఆలయాన్నే ప్రజల దగ్గరకు తీసుకువచ్చారు. శ్రీకృష్ణ చైతన్యంపై 70కి పైగా గ్రంథాలను రచించారు. ఆయన స్ఫూర్తితో... హైదరాబాద్‌లోని 'హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్'లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా జరగనున్నాయి. రాధాగోవిందులు, స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్న ఈ ఆలయంలో... సప్త నదుల నుంచి సేకరించిన పవిత్ర జలాలతోను, పంచామృతంతోను అభిషేకం, ఊంజల్ సేవ, సంకీర్తనాలాపన, జపం, అన్నదానం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వీటిలో భక్తులు ఉచితంగా పాల్గొనవచ్చు. అలాగే హైదరాబాద్‌లోని నార్సింగిలో నిర్మితమవుతున్న హరేకృష్ణ హెరిటేజ్ టవర్, సంగారెడ్డి జిల్లా కందిలోని హరేకృష్ణ కల్చరల్ సెంటర్‌లలో కూడా ఈ ఉత్సవాల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

• శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9396956984



సహజయోగ


వేణువులా మారుదాం...



"త్రేతాయుగంలో శ్రీరాముడు ఆదర్శవంతుడైన కుమారుడిగా, సోదరుడిగా, భర్తగా, రాజుగా... మానవులు ఎలా జీవించాలో మనకు చూపించాడు. అయితే దానివల్ల మానవులందరూ ధర్మాన్ని పాటించడమే ధ్యేయంగా... గంభీరంగా మారిపోయి, ఆనందాన్ని విడిచిపెట్టేశారు. జీవితాన్ని ఉత్సాహంగా ఆనందించడం వారికి నేర్పడం కోసం ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడు జన్మించాడు. తన మధురమైన సంభాషణలతో అందరినీ సమ్మోహితులను చేశాడు" అంటూ శ్రీకృష్ణావతార పరమార్థాన్ని తన ప్రవచనాలలో శ్రీమాతాజీ నిర్మలాదేవి వివరించారు.

శరణాగతులం కావాలి...

శ్రీకృష్ణ తత్త్వం... ప్రధానంగా రాధాకృష్ణుల అనుబంధం ఎంతో మార్మికమైనవి. సంస్కృతంలో 'రా' అనే శబ్దానికి 'శక్తి' అని, 'ధ' అనే శబ్దానికి 'ధరించినది' అని అర్థం. రాధాదేవి శక్తి స్వరూపిణి. ఆమె యమునా నదిలో తన పాదాలను ఉంచడం వల్ల ఆ నది నీరు మొత్తం చైతన్యాన్ని పొందేది. ఆ నీటి ద్వారా గోపికలలో కుండలినీ శక్తిని శ్రీకృష్ణుడు జాగృతం చేసేవాడు. విశుద్ధ చక్రాన్ని ఆయన జాగృతం చేసి... కుండలినీ శక్తి ఉత్థానానికి మార్గాన్ని ఏర్పరిచాడు. ఆ చక్రానికి పదహారు దళాలు ఉంటాయి. ఆ దళాలు మన తలలోని సహస్రారంలో ఉండే వెయ్యి నాడులతో ఏకీకృతం అయినప్పుడు.... పదహారువేల శక్తులు ఏర్పడతాయి. శ్రీకృష్ణుడితో భూమిపై అవతరించిన ఆ పదహారువేల శక్తులే గోపికలు. వాటికి రక్షణ కల్పించడానికే ఆయన ఆ పదహారు వేల గోపికలను వివాహం చేసుకున్నాడు. యోగీశ్వరుడైన ఆయన లీలలను సరిగ్గా అర్థం చేసుకోగలిగితే... మన లోపల ఉన్న విశుద్ధి చక్రం జాగృతమై... మనలో శ్రీకృష్ణ తత్త్వం స్థిరపడుతుంది.



ఒక కథ ప్రకారం... శ్రీకృష్ణుడి నిరంతరం దగ్గరగా ఉండే వేణువును చూసి రాధాదేవి అసూయ చెందిందట. "నువ్వు ఇంతటి ఉన్నత స్థానాన్ని ఎలా పొందగలిగావు?" అని అడిగిందట. అప్పుడు వేణువు "కేవలం భగవంతుడికి గానాన్ని వినిపించడం తప్పితే నా లోపల ఏదీ ఉంచుకోను" అని చెప్పిందట. మనం కూడా కామ క్రోధాది శత్రువులను మన లోపల ఉంచుకోకుండా... మన అంతరంగాన్ని భగవంతుడికి పరిపూర్ణంగా సమర్పించి, సంపూర్ణ శరణాగతులం కావాలి. మన ద్వారా జరిగేవన్నీ భగవంతుడి అభీష్టం ప్రకారమే. కాబట్టి ఆ పనులన్నిటినీ సాక్షిలా గమనిస్తూ, కలత చెందకుండా ఉండగలిగితే... కొంతకాలానికి శ్రీకృష్ణుడి చేతిలో ఉండే వేణువులా తయారవుతాం. ఆ పరంధాముడి మధురమైన గానామృతాన్ని ఈ ప్రపంచానికి పంచగలుగుతాం.

ఆయన ఆచరించి చూపించాడు...

మన సూక్ష్మ శరీరంలో... గొంతు దగ్గర ఉండే విశుద్ధి చక్రానికి అధిష్ఠాన దైవం శ్రీకృష్ణుడు. ఈ చక్రం తాలూకు స్వభావం... సామూహికత. 'మానవులు సంఘంలో ఎలా జీవించాలి, అందరితో కలిసి ఎలా ఆనందించాలి' అనేది శ్రీకృష్ణుడు చూపించాడు. ఆయన బృందావనంలో తన తోటి వారిని బృందాలుగా తయారు చేశాడు. చిన్నతనంలోనే తన అల్లరితో వారందరి మనస్సుల్లో ఆయన స్థానం సంపాదించాడు. ధర్మాన్ని అనుసరించడం అంటే నవ్వడం మరచిపోయి, గంభీరంగా బతకడం కాదని, అది కూడా ఆనందంగా, ఒక లీలలా సాగాలని ఆచరించి చూపించాడు. అందుకే ఆయనను 'లీలాధర' అని పిలుస్తారు. సహజయోగ ధ్యాన సాధన ద్వారా కుండలినీ శక్తి జాగృతమై... ఆత్మసాక్షాత్కారం పొందినప్పుడు, మన విశుద్ధ చక్రం పూర్తిగా పరిశుద్ధమై వికాసం చెందుతుంది. ఆ చక్రాన్ని అధిష్ఠించి ఉన్న శ్రీకృష్ణుని తత్త్వం మనలో జాగృతం అవుతుంది. ఆయన లక్షణాలైన స్థితప్రజ్ఞత, విచక్షణ, మాటల్లోని మాధుర్యం లాంటివి మనలో స్థిరపడతాయి.

డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి,
సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



చింతన



ఆలోచన... ఆయుధం, అవరోధం!

'ఆలోచన అంటే మనసుతో చూడడం, గ్రహించడం. అన్నిటికీ ఆలోచనే మూలం' అని మనకు తెలుసు. జంతువు నుంచి మనిషిని వేరు చేసేది ఆలోచనే. ఈ అద్భుతమైన ప్రపంచం మొత్తాన్ని సృష్టించినది కూడా మనిషి ఆలోచనే. కానీ గమనించినట్టయితే... అదే ఆలోచన మనిషి జీవితానికి సమస్యాత్మకం అయింది. మనసు సృష్టించిన 'అహం' ('నేను' అనే ఆలోచన), దాని తాలూకు విపరిణామాలే మనిషి ఆనందానికి అవరోధమయ్యాయి.

నిజానికి మనిషికి అతని జీవనం సాధ్యం కావడానికి అహమే మూలం. 'నేను ఉన్నాను' అనే ఆలోచన ఉంటేనే కదా... నన్ను నేను గుర్తించగలిగేది, నన్ను నేను రక్షించుకోగలిగేది! అలా స్వీయ రక్షణ కోసం, మనుగడ కోసం, కనీస అవసరాలైన ఆహారం, దుస్తులు, నివాసం లాంటివి సంపాదించుకోవడానికి కూడా ఆలోచన అత్యవసరం. అయితే వచ్చిన చిక్కేమిటంటే, ఈ అహం... 'నేను' చుట్టూ గిరిగీస్తుంది, విభజనకు దారి తీస్తుంది. ఆ విభజనే క్రమంగా పేర్లకు, పోలికలకు, విశ్లేషణలకు, తీర్పులకు... అంతిమంగా సంఘర్షణకు, దుఃఖానికి కారణం అవుతుంది. ఈ విభజన ఏ స్థాయికి చేరిందంటే... తాను ప్రకృతిలో అంతర్భాగమనే మౌలిక సత్యాన్ని మనిషి పూర్తిగా విస్మరించాడు.

మేధస్సు, వివేకం

నిరంతరం భద్రత కోసం పాకులాడే మనసు.. ఏదైనా సరే మరింత కావాలని కోరుతుంది. అలా పరిణామ క్రమంలో మనిషి ఆలోచనే... వ్యవసాయాన్ని, మిగులు ధాన్యాన్ని, నాగరికతను, సౌకర్యాలను సృష్టించేలా చేసింది. నిన్న మొన్నటి శాస్త్ర-సాంకేతిక విజ్ఞానం నుంచి... నేటి కృత్రిమ మేధ వరకూ అన్నీ మనిషి ఆలోచన పుణ్యమేనని మనకు తెలుసు. అయితే మనిషి ఆలోచన, మేధస్సు పెరిగాయి కానీ, వాటి ఫలాలను ఎంత మేరకు, ఎలా వినియోగించుకోవాలి అనే వివేకమే క్రమంగా కరువైపోతూ వస్తోంది. ఆధునిక కాలంలో ఈ అవగాహనారాహిత్యం పరాకాష్ఠకు చేరి... మానవాళికి భస్మాసుర హస్తంగా మారింది.

"జీవనాధారమైన వాస్తవ ప్రకృతిని నాశనం చేస్తూ... ఊహాజనితమైన సంఖ్యలు, సంకేతాల మీద దృష్టి పెరిగిపోవడమే మానవాళికి దాపురించిన అతి పెద్ద సమస్య" అంటారు ప్రఖ్యాత పాశ్చాత్య తాత్త్వికుడు అలన్ వాట్స్. ఒకవైపు 'నేను-నాది' అనే స్వార్థం, మరోవైపు మరింత సంపద, సౌకర్యాలు కావాలనే కాంక్ష, పోటీ. ఇలా క్రమంగా ఆలోచన ఉచ్చులో, మనసు చేసే మాయలో మనిషి పడిపోయాడు. ప్రతి రంగంలోనూ వృద్ధికోసం పాకులాటే. వ్యక్తుల నుంచి దేశాల వరకూ- ఆస్తి విలువలు, బ్యాంకు నిల్వలు, సంపదల లెక్కలు, జీడీపీ రేట్లు... అన్నీ అమాంతం పెరిగిపోవాలనే ఆశ! "ఇంత చేసిన మనిషి.. భూగ్రహాన్ని భోగిమంటలో వేస్తున్న మనిషి.. పోనీ ఆనందంగా ఉన్నాడా? అంటే అదీ లేదు" అంటారు సద్గురు జగ్గీ వాసుదేవ్. అనుక్షణం ఏదో తీరని ఆరాటం, ఏదో తెలియని వెలితి, ఆందోళన, అశాంతి. కెరటాలతో అల్లకల్లోలమైన సముద్రంలా, ఎడతెగని ఆలోచనల పుట్టలాగా మారింది మనిషి మనసు. ముఖ్యంగా నేటి మొబైల్-సోషల్ మీడియా కాలంలో ఆలోచన ఒక వ్యసనంగా మారిందంటే, నిద్రలేమి ఒక మహమ్మారిలా వ్యాపిస్తోందంటే అతిశయోక్తి కాదు. ఏకాంతం, నిశ్శబ్దం, ప్రశాంతత అన్నవి మనిషి జీవితంలో అరుదుగా లభించే బ్రహ్మపదార్థాలైపోయాయి.

నిరంతర ఎరుక

ఇదంతా చూసినప్పుడు ఆలోచన అనేది రెండు అంచుల పదునైన కత్తి లాంటిదని తెలుస్తుంది. మనం అద్భుతాలు అనుకుంటున్నవాటిని ఎన్నో సృష్టించిన ఆలోచనే మన ఆందోళనకూ, అశాంతికీ కారణమౌతోంది. అది విలయానికీ, మానవ వినాశనానికీ కూడా కారణం కాగలదు. మితిమీరిన ఆలోచన వల్ల వచ్చిన అనర్థాలను గ్రహించిన జ్ఞానులు "మనో వ్యాపారాన్ని పరిమితం చేయడం, మితంగా కర్మలు ఆచరించడమే ఆధ్యాత్మిక వివేకం" అన్నారు. అదే మనిషి జీవితంలో ప్రశాంతతకూ, ఆనందానికీ మార్గమని సూచించారు. అదే నిజమైన ధ్యానం. అంటే ఆలోచన పట్ల నిరంతర ఎరుక కలిగిఉండడం, మనసు పోకడలను కనిపెట్టడం, 'నేను' ఎలా పనిచేస్తోందో గమనిస్తూ... దాని తీరుతెన్నుల పట్ల అప్రమత్తంగా ఉండడం, కర్మలను పరిమితం చేయడం, కనీసావసరాలతో సరళ జీవనం గడపడం. ఆలోచనను ఎలా, ఎంతమేరకు ఉపయోగించాలో తెలియడం...

ఇదే మనిషి వివేకానికి కొలమానం. అదే నిజమైన ఆధ్యాత్మిక సాధన. ఆ వివేకం నుంచే జీవితంపట్ల స్పష్టత, నిజమైన స్వేచ్ఛ, అసలైన ఆనందం లభిస్తాయి.

• ఈదర రవికిరణ్

తెలుసుకుందాం

ఆలయం... సమున్నత సంస్కృతికి ప్రతీక

భగవంతుడు సర్వాంతర్యామి. ఈ జగత్తు అంతటా నిండి ఉన్నాడు. ఆయన లేని చోటు ఈ విశ్వంలో ఎక్కడ వెతికినా కనిపించదు. అనాదిగా వేదాలు, ఆగమాలు, స్మృతులు, పురాణాలు, ఇతిహాసాలు చెబుతున్న సత్యం ఇదే. వేదకాలం నుంచి ఎందరో మహర్షులు, మునులు, సిద్ధులు, ఆచార్య పురుషులు ఇదే సత్యాన్ని తెలుసుకొని... భగవంతుడి అర్చారూపాన్ని మనకు అందించారు. సాక్షాత్తూ మహా విష్ణువే అయిదు రాత్రుల్లో అయిదుగురు దేవతలకు ఉపదేశించిన పాంచరాత్రం 'భగవంతుడి స్వరూపాలు అయిదు' అని పేర్కొంది. అవి: పర స్వరూపం, వ్యూహ స్వరూపం, విభవ స్వరూపం, అంతర్యామి స్వరూపం, అర్చా స్వరూపం.

పరమపదమైన వైకుంఠంలో కొలువుతీరిన పరావాసుదేవమూర్తిని 'పర స్వరూపం' అని, క్షీరసాగరంలో శేషశయనుడై ఉండే అనంతశయనమూర్తిని 'వ్యూహ స్వరూపం' అని, దుష్ట శిక్షణకోసం, శిష్ట రక్షణ కోసం భూలోకంలో అవతరించిన శ్రీరాముడు, శ్రీకృష్ణుడి లాంటి రూపాలను 'విభవ స్వరూపం' అని, సకల చరాచర జీవరాశులలో... అణువు నుంచి మహత్తు వరకూ అన్నీ తానై ఉన్న స్వామిని 'అంతర్యామి స్వరూపం' అని, నేడు కలియుగంలో మానవులైన మనల్ని అనుగ్రహించడానికి ఆలయంలో కొలువుతీరి, విగ్రహ రూపంలో అర్చనలు అందుకొనే స్వామిని 'అర్చా స్వరూపం' అని అంటారు. పైన పేర్కొన్న అయిదు స్వరూపాల్లో చివరిదైన అర్చా స్వరూపమే... భగవంతుణ్ణి సులభంగా దర్శించుకొనే మార్గం. మనం అందరం ఆ అర్చా స్వరూపాన్నే భగవంతుడిగా దర్శించుకుంటున్నాం.

ఎన్నో పేర్లు

విశ్వమంతటా వ్యాపించిన భగవంతుడి శక్తిని ఒకచోట కేంద్రీకరింపజేసి, అక్కడ ఆలయాన్ని నిర్మించి, అర్చామూర్తిని ప్రతిష్ఠించే విధానాన్ని శిల్ప, ఆగమ గ్రంథాలు అద్భుతంగా వర్ణించాయి. 'దేవాలయం' అంటే 'దేవుని రూపం ఉండే చోటు' అని మనందరికీ తెలుసు. నిజానికి... భక్తుల జీవాత్మను ఆ పరమాత్మలో లయం చేసే ఆత్మానాత్మ సంయోగానికి మన మహర్షులు నిర్దేశించిన పవిత్రమైన స్థలమే దేవాలయం. ఆలయానికి ఉన్న అనేక పేర్లను శిల్ప, ఆగమ గ్రంథాలు వివరించాయి. అవి: ప్రాసాదం, సదనం, సద్మం, గృహం, ధామం, నికేతనం, విమానం, హర్మ్యం, వాసం, మందిరం... ఇలా ఆలయానికి ఎన్నో పర్యాయపదాలు ఉన్నాయి.

ఎప్పుడు మొదలైంది?

ఆలయం అనేది మన హైందవ సంస్కృతి సమున్నత రూపానికి ప్రతీక. దేవతలందరూ కొలువుతీరే పరమ పవిత్రమైన ప్రదేశం. పురాణాల లోతుల్లోకి వెళితే మనకు ఎన్నో అద్భుతమైన విషయాలు తెలుస్తాయి. ఆలయాలు ఏ యుగంలో ఆకృతి దాల్చాయనే సంగతులతో పాటు వాటి వికాసం, జనాదరణ లాంటి అంశాలను కూడా అవి ఎంతో విస్పష్టంగా చెప్పాయి. విష్ణు ధర్మోత్తర పురాణాన్ని ఆధారంగా తీసుకుంటే... కృతయుగంలో ఈ భూమి మీద దేవాలయ నిర్మాణమే లేదు. అప్పుడు దేవతలను ప్రత్యక్షంగా దర్శించడానికి, పూజించడానికి అవకాశం ఉండేది. త్రేతా, ద్వాపర యుగాల్లో కూడా దేవతలను ప్రత్యక్షంగా దర్శించేవారు. అయితే దేవతా విగ్రహాలను గృహాల్లో పెట్టుకొని పూజించే... గృహార్చా విధానం త్రేతాయుగంలోనే ప్రారంభమయిందని చెప్పవచ్చు. విగ్రహారాధన కూడా ఆ యుగంలోనే వ్యాప్తిలోకి వచ్చినట్టు స్పష్టమవుతోంది. అరణ్యవాసంలో ఉన్న రాముడు తన పూర్వీకులను విగ్రహరూపంలో పూజించడం, అలాగే లంకానగర ప్రవేశానికి ముందు శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజించడం, రావణుడు తన నగరంలో శివలింగారాధన చేయడం లాంటివి వాల్మీకి రామాయణంలో మనకు కనిపిస్తాయి. ద్వాపర యుగంలో కూడా అరణ్యాలు, గుహలు, పర్వత ప్రదేశాల్లో, ఆశ్రమాల్లో ఋషులు, సిద్ధులు, మునులు విగ్రహ ప్రతిష్ఠ చేసి పూజించడం కొనసాగింది. నేటి కలియుగంలో... మన దేశంలోని పవిత్ర ప్రదేశాలతోపాటు గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో దేవాలయాలను నిర్మించి, ఆగమోక్త విధితో ప్రతిష్ఠాదులు చేసి, పూజలు చేయడం ప్రాచుర్యంలోకి వచ్చింది.



• దగ్గుపాటి నాగవరప్రసాద్ స్థపతి
9440525788







FARNAZ

సుప్రీం కోర్టులో దర్శన్‌కు చుక్కెదురు

రేణుకాస్వామి హత్య కేసులో ఏడుగురి బెయిల్ రద్దు

» దర్శన్, పవిత్ర గౌడ అరెస్టు

బెంగళూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): చిత్ర దుర్గ రేణుకాస్వామి హత్య కేసులో రెండో నింది తుడు, నటుడు దర్శన్ బెయిల్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు గురువారం తీర్పునిచ్చింది. దర్శన్ తొలుత వైద్యం కోసం హైకోర్టు నుంచి బెయిల్ పొందారు. ఆ తర్వాత గతేడాది డిసెంబరు 13న రెగ్యులర్ బెయిల్ లభించింది. దర్శన్‌తో పాటు కేసులో ఎ1 నింది తురాలు పవిత్ర గౌడతో పాటు మరో ఐదుగురు నిందితులు బెయిల్‌పై విడుదలయ్యారు. వీరికి బెయిల్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ పోలీసులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ విచారణ సమయంలో 'హైకోర్టు చేసిన తప్పిదం మేం చేయబోము' అని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. హత్య కేసు దర్యాప్తు విధానం, వివరాలను సమగ్రంగా పరిశీలించామని పేర్కొంది. దీంతో దర్శన్ సహా అందరి బెయిల్


పోలీసుల అదుపులో దర్శన్

రద్దు అవుతుందన్న ప్రచారం జరిగింది. విచా రణ జూలై 24న పూర్తి కాగా.. ఆ రోజు తీర్పు రిజర్వు చేసిన సుప్రీం కోర్టు ధర్మాసనం, గురు వారం కోర్టు కార్యకలాపాలు ప్రారంభం కాగానే తీర్పు వెలువరించింది. ఎ-1 పవిత్ర గౌడ, ఎ-2 దర్శన్ తూగుదీప్, మరో ఐదుగురి బెయిల్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. పరప్పన అగ్ర హార జైలులో దర్శన్ విచారణ ఖైదీగా ఉన్న ప్పుడు ఆయనకు విలాసవంతమైన సౌకర్యాలు కల్పించిన అధికారులను సస్పెండ్ చేయాల్సిం దని ధర్మాసనం వ్యాఖ్యానించింది. నిందితులం దరినీ కస్టడీలోకి తీసుకుని త్వరగా దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించింది.

తీర్పుతో నాటకీయ పరిణామాలు

సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు వెలువరించిన వెంటనే బెంగళూరు నగర పోలీసులు నిందితు లను అరెస్టు చేసేందుకు రంగంలోకి దిగారు. సాయంత్రం 4.30 గంటలకు లొంగిపోతానని, గడువు ఇవ్వాలని దర్శన్ కోరినా పోలీసులు ససేమిరా అన్నారు. దర్శన్ కోసం రాజరాజేశ్వరీ నగర్‌లోని ఇంటికి వెళ్లగా అక్కడ లేకపోవ డంతో, హొసకెరహళ్లిలోని ఆయన భార్య విజ యలక్ష్మీ నివాసంలో ఉన్నట్టు గుర్తించారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఆయన్ను అరెస్టు చేసి బళ్లారి జైలుకు తరలించారు. పవిత్రగౌ డను ఆమె ఇంట్లోనే అరెస్టు చేసి, పరప్పన అగ్ర హార జైలుకు తరలించారు. మైసూరులో ఉన్న లక్ష్మణ్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయారు. జగదీష్, అనుకుమార్ చిత్రదుర్గలోని పోలీసుస్టే షన్‌లో లొంగిపోయారు. దర్శన్ మేనేజర్ నాగ రాజు కూడా లొంగిపోయారు.

అక్రమ బెట్టింగ్ యాప్ కేసులో 17 చోట్ల ఈడీ సోదాలు

» 110 కోట్లు ఫ్రీజ్, 1200 మ్యూల్ క్రెడిట్ కార్డులు సీజ్

» సెలబ్రిటీలతో 'పరిమ్యాచ్' యాప్ విస్తృత ప్రచారం

» ఏడాదిలో 3 వేల కోట్లు లూటీ..వెల్లడించిన ఈడీ

న్యూఢిల్లీ, ఆగస్టు 14: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ 'పరిమ్యాచ్' అక్ర మాల భారీ దందా బయటపడింది. సైప్రస్‌కు చెందిన ఆ కంపెనీ భారత్‌లో చేసిన చట్టవ్యతిరేక కార్యకలాపాలు తాజాగా వెలుగు చూశాయి. ఆ కంపెనీ వ్యవహారాలకు సంబంధించి హైదరాబా ద్‌లో సహా దేశంలో 17 చోట్ల ఈడీ సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో రూ. 110 కోట్లను ఫ్రీజ్ చేసింది. అలాగే 1,200 మ్యూల్ క్రెడిట్ కార్డులను సీజ్ చేసింది. ఆ వివరాలను ఈడీ గురువారం ఓ ప్రకటనలో వెల్లడించింది. సెలబ్రిటీలతో ఆ యాప్ విస్తృతంగా మార్కెటింగ్ చేసింది. స్పోర్ట్స్ టోర్నమెంట్లకు స్పాన్సర్‌షిప్ చేయ డమే కాకుండా సెలబ్రిటీలతో భాగస్వామిగా వ్యవహరించింది. అధిక లాభాలు వస్తాయని చెప్పి ఒక ఏడాదిలో రూ. 3 వేల కోట్లు కాజేసింది. ప్రకటనల కోసం పరిమ్యాచ్ స్పోర్ట్స్, పరిమ్యాచ్ న్యూస్ పేరుతో భారత్‌లో సంస్థలను నెలకొల్పింది. విదేశాల నుంచి ఆ సంస్థలకు చెల్లింపులు చేసింది. ఈ అక్రమాలకు సంబంధించి ముంబై, నోయిడా, జైపూర్, సూరత్, మదురై, కాన్పూర్, హైదరాబా ద్‌ల్లో ఈనెల 12న ఈడీ సోదాలు నిర్వహించింది. మ్యూల్ ఖాతా లను వాడుకుంటూ పరిమ్యాచ్ ఏ రకంగా దేశంలో అక్రమాలకు పాల్పడిందో ఈడీ వివరించింది. ఆ యాప్ యూజర్లు మ్యూల్ ఖాతాల్లో డబ్బు డిపాజిట్ చేస్తే.. తమిళనాడులోని ఓ ప్రత్యేక ప్రాంతంలో నగదు రూపంలో విత్‌డ్రా చేశారని వెల్లడించింది. ఆ డబ్బును హవాలా ఆపరేటర్లకు ఇస్తే, వారు బ్రిటన్‌లోని ఓ కంపెనీ వర్చువల్ వాలెట్లను రీచార్జ్ చేశారని తెలిపింది.

సీఎం యోగికి ప్రశంసలు.. మహిళా ఎమ్మెల్యేపై సమాజ్ వాదీ వేటు

లఖ్‌నవూ, ఆగస్టు 14: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను అసెం బ్లీలో ప్రశంసించిన గంటల వ్యవధిలోనే తమ ఎమ్మెల్యే పూజాపాల్‌పై సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) వేటు వేసింది. ఆమెను పార్టీ నుంచి బహిష్కరించింది. గురువారం యూపీ అసెంబ్లీలో 'విజన్ 2047'పై చర్చ జరిగింది. ఈ సందర్భంగా పూజ మాట్లా డుతూ.. ఎన్నో ఏళ్లుగా ఎవరూ గమనిం చని తన మౌన రోదనను సీఎం యోగి గుర్తించారన్నారు. తన దుఃఖం, బాధను గమనించి, న్యాయం చేశారని వ్యాఖ్యానిం చారు. పూజాపాల్‌కు 2005లో అప్పటి బీఎస్పీ ఎమ్మెల్యే రాజుపాల్‌తో వివాహం జరిగింది. వివాహం జరిగిన 10 రోజు ల్లోనే రాజుపాల్ హత్యకు గురయ్యారు. ప్రయాగ్‌రాజ్‌లో మాఫియా నేత, మాజీ ఎంపీ అతిక్ అహ్మద్, అతని సోదరుడు అష్రఫ్ అహ్మద్ అనుచరులు ఈ హత్యకు బాధ్యులుగా పోలీసులు గుర్తించారు. అప్పటి నుంచి న్యాయం కోసం పూజాపాల్ పోరాటం చేశారు. అయితే.. వేర్వేరు కేసుల్లో దోషులుగా తేలిన అతిక్, అష్రఫ్‌లను 2023 ఏప్రిల్‌లో జైలుకు తరలించే ముందు వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లగా.. జర్నలిస్టుల్లా వచ్చిన ముగ్గురు వ్యక్తులు తుపాకులతో కాల్చి చంపారు. యోగి ద్వారా తనకు న్యాయం జరిగిందంటూ పూజ అసెంబ్లీలో చెప్పడం.. ఆదిత్య నాథ్‌ను పొగడ్తలతో ముంచెత్తడం సమాజ్ వాదీ పార్టీకి నచ్చలేదు. దీంతో ఆమెపై బహిష్కరణ వేటు వేశారు. ఈ నిర్ణయంపై అధికారపక్షం తీవ్రంగా స్పందించింది. స్వాతంత్ర్యదినోత్సవానికి ఒక్కరోజు ముందు.. అభివృద్ధి దృక్పథాన్ని అసెంబ్లీలో సమర్థించినందుకు పూజను బహిష్కరించడం సమాజ్‌వాదీ పేలవ మనస్తత్వాని కి(ఘటియా సోచ్) నిదర్శనమని ఉప ముఖ్యమంత్రి బ్రజేశ్ పాఠక్ విమర్శిం చారు. సమాజ్‌వాదీ పార్టీది 'మహిళా విరోధ విధానం' అని ఎద్దేవా చేశారు.


పూజాపాల్

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ఇక్కడ ఎవరి కుంపటి వారిదే!

'జాతీయ పురస్కారాల్లో తెలుగు సినిమాలకు ఏడు అవా ర్డులొచ్చాయి. అయినా మన సినీ పరిశ్రమ స్పందించలేదు. ఇక్కడ ఎవరి కుంపటి వారిదే' అని సంచలన వ్యాఖ్యలు చేశారు నిర్మాత అల్లు అరవింద్. ప్రతిష్ఠాత్మక సైమా(సౌత్ ఇండి యన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్) 2025 వేడుకలు సెప్టెంబరు 5, 6 తేదీల్లో దుబా య్‌లో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయ అవార్డు విజేతలను 'సైమా' ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో అల్లు అరవింద్ మాట్లాడుతూ "సైమా' స్పందించి, విజేతలను సత్కరించడం అభినందనీయం. నిజానికి దీన్ని ఒక పండగలా జరుపుకోవాలి. 'సైమా' దీన్ని అద్భుతంగా ముందుకు తీసుకెళ్తున్నందుకు అభినందనలు తెలియజేస్తున్నా' అని అన్నారు. కార్యక్రమంలో దర్శకులు అనిల్ రావిపూడి, ప్రశాంత్ వర్మ, సాయి రాజేశ్, నిర్మాత సాహు గారపాటి, హీరో సందీప్ కిషన్, హీరోయిన్లు మంచు లక్ష్మి, వేదిక, ఫరియా అబ్దుల్లా, 'సైమా' ఛైర్ పర్సన్ బృందా తదితరులు పాల్గొ న్నారు.

అల్లు అరవింద్



సజీవ పాత్రలతో సాగే చిత్రం



పలు బాలల చిత్రాలు తీసి ప్రతిష్ఠాత్మక అవార్డులు దక్కించుకున్న దర్శకనిర్మాత భీమ గాని సుధాకర్ గౌడ్ తెరకెక్కించిన తాజా చిత్రం 'ఆపద్బాంధవుడు'. సామాజిక సేవ చేసే పెంచల్ రెడ్డి జీవిత కథతో రూపొందిం చిన ఈ చిత్రాన్ని పెంచల్‌రెడ్డి, లీలావతి నిర్మించారు. పెంచల్‌రెడ్డి, సుధాకర్ గౌడ్, ఝాన్సీ ప్రతిమ, నాగేశ్వరరావు కీలక పాత్రల్లో నటించారు. గురువారం నిర్వహించిన ప్రెస్‌మీ ట్‌లో చిత్రదర్శకుడు సుధాకర్ గౌడ్ మాట్లా డుతూ 'సజీవ పాత్రలతో సాగే చిత్రమిది. బయోపిక్‌లా, లైవ్‌గా, సరికొత్త పద్ధతిలో తెర కెక్కించాం. సెప్టెంబరు 5న విడుదల చేసేం దుకు సన్నాహాలు చేస్తున్నాం' అని చెప్పారు.

హిందీ హక్కులు ఆ సంస్థకే



తేజ సజ్జా కథానాయకుడిగా కార్తిక్ ఘట్టమనేని తెరకెక్కిస్తోన్న చిత్రం 'మిరాయ్'. రితికా నాయక్ కథానాయిక. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో తేజ సజ్జా సూపర్ యోధగా అలరించనున్నారు. కాగా, ఈ చిత్రం హిందీ థియేట్రికల్స్ రైట్స్‌ను ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు కరణ్ జోహార్‌కు చెందిన 'ధర్మ' ప్రొడక్షన్స్ దక్కించుకుంది. నార్త్‌లో 'బాహుబలి', 'దేవర' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను విజయవంతంగా విడుదల చేసిన చరిత్ర ఈ సంస్థకు ఉంది.

తొలి అడుగులు పడింది అక్కడే



చెన్నైలోని అడయార్ హౌస్‌కు, రజనీ కాంత్ నటజీవితానికీ ప్రత్యేకమైన అను బంధం ఉంది. ఆయన నటించిన తొలి చిత్రం 'అపూర్వ రాగంగళ్' షూటింగ్ అక్కడే జరిగింది. ఈ భవంతి గేటును తోసుకుంటూ లోపలికి వచ్చే షాటును రజ నీకాంత్‌పై తొలిసారిగా దర్శకుడు కె.బాల చందర్ చిత్రీకరించారు. ఆ చిత్రం 1975లో ఆగస్టు 15న విడుదలైంది. అలా ఆ సిని మాతో కెరీర్‌ను ప్రారంభించిన రజనీకాం త్.. హీరోగా ఎదిగి దాదాపు 170పైకి పైగా చిత్రాల్లో నటించి 'తలైవర్' అనే బిరుదును దక్కించుకున్నారు. ఆయనతో నటనప రంగా తొలి అడుగులు వేయించిన ఈ అడయార్ హౌస్‌ను అభిమానులు ఓ టూరిస్ట్ స్పాట్‌గా భావిస్తుంటారు.

ఆలయం కట్టించిన అభిమాని

తమిళనాడులో మదురై జిల్లా తిరుమం గళంకు చెందిన రజనీకాంత్ వీరాభిమాని కార్తీక్ ఆయనకు గుడి కట్టించారు. రజ నీపై అభిమానంతో తన ఇంటిలోని కొంత భాగాన్ని 2023లో గుడిగా మార్చినట్లు తెలి పారు. 'అరుల్మిగు రజనీ కోవిల్'గా నామక రణం చేసిన ఈ ఆలయంలో రజనీ చిత్రా ల్లోని రెండు విగ్రహాలను ప్రతిష్ఠించి, నిత్యం పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

-చెన్నై (ఆంధ్రజ్యోతి)

అరె ఓ సాంబా.. షోలేకు యాభై ఏళ్లట!



భారతీయ సినిమాను కొత్త దారుల్లో కదం తొక్కించిన సినిమా 'షోలే'. సరిగ్గా యాభై ఏళ్ల క్రితం అంటే 1975 ఆగస్టు 15న విడుదలైంది. వరుస అపజయాలతో ఉన్న అమితాబ్‌కు పెద్ద హిట్ ఇవ్వడమే కాకుండా విలన్ 'గబ్బర్ సింగ్' పాత్ర పోషించిన కొత్త నటుడు అంజాద్ ఖాన్ ను ఓవర్‌నైట్ స్టార్‌ను చేసిన సినిమా 'షోలే'. 'అరె ఓ సాంబా' అంటూ ఆయన పలికిన ఊత పదం జనానికి తారక మంత్రమైంది. దర్శకుడు రమేశ్ సిప్పీ చేసిన ఈ అద్భుతమైన మ్యాజిక్ గురించి కొన్ని ఆసక్తికరమైన సంగతులు..

- 'షోలే' సినిమా విడుదలైన రోజు అంతటా ఫ్లాప్ టాక్. ఆడడం కష్టం అన్నారు. టికెట్లు అమ్ముడు కాని పరిస్థితి. అయితే అనూహ్యంగా పుంజుకుని ఫుల్ రన్‌లో దాదాపు 25 కోట్ల టికెట్లు అమ్ముడైన భారతీయ చిత్రంగా నిలిచింది.
- థ్రిల్ కలిగించే పోరాటాలు, హృదయాన్ని హత్తుకొనే భావోద్వేగాలు, నాటకీయత, ధర్మేంద్ర, అమితాబ్ మధ్య స్నేహబంధం, అంజాద్ ఖాన్ విలనీ, ఉద్రూత లూగించిన ఆర్.డి. బర్మన్ సంగీతం.. మిగిలిన చిత్రాల్లో 'షోలే'ను ప్రత్యేకంగా నిలిపాయి.
- మూడు గంటల ముప్పై నాలుగు నిము షాల నిడివి ఉన్న 'షోలే' బడ్జెట్ రూ. 3 కోట్లు. రూ. 35 కోట్లకు పైగా వసూలు చేసి సంచ లనం సృష్టించింది.
- 50 ఏళ్ల పూర్తి చేసుకుంటున్న సంద ర్భంగా ఇటలీలోని బొలోనా చిత్రోత్సవంలో జూన్ 27న రీస్టోర్డ్ వెర్షన్‌ను ప్రదర్శించారు మేకర్స్. ఇందులో ముగింపు సన్నివేశాన్ని మార్చడంతో పాటు కొన్ని తొలగించిన సీన్లను కూడా జతచేయడం విశేషం.

ప్రవేశపెట్టబడుచున్నది

FASTag వార్షిక పాస్

అన్ని వాణిజ్యేతర వాహనాలకు (కారు/జీప్/వ్యాన్)



నరేంద్ర మోదీ
ప్రధానమంత్రి

ఫాస్టాగ్ వార్షిక పాస్ గురించి మరింత తెలుసుకోండి

- VAHAN డేటాబేస్ ద్వారా ధృవీకరించబడిన ప్రైవేట్ వాణిజ్యేతర కారు/జీప్/వ్యాన్ కోసం మాత్రమే చెల్లుబాటు అవుతుంది మరియు బదిలీ చేయబడదు.
- **15 ఆగస్టు 2025** నుండి వర్తింపుతో జాతీయ రహదారులు మరియు జాతీయ ఎక్స్‌ప్రెస్‌వే టోల్ ప్లాజాల వద్ద మాత్రమే చెల్లుబాటు అవుతుంది. ఇతర రాష్ట్ర రహదారులు లేదా స్థానిక సంస్థలు లేదా పార్కింగ్ స్థలాలలో సాధారణ ఫాస్టాగ్ ఛార్జీలు వర్తిస్తాయి.
- **ఫాస్టాగ్ వార్షిక పాస్ కొనుగోలు తేదీ నుండి ఒక సంవత్సరం లేదా 200 టోల్-ప్లాజా క్రాసింగ్‌లకు (ఏది ముందు అయితే అది) ఉచిత ప్రయాణం అనుమతించబడుతుంది.**
- రాజమార్గయాత్ర యాప్ లేదా NHAI వెబ్‌సైట్ ద్వారా మాత్రమే యాక్టివేట్ చేయబడుతుంది; నమోదిత మొబైల్ నం.కు SMS సందేశాలు పంపబడతాయి.
- **యాప్/వెబ్‌సైట్ ద్వారా చెల్లించాల్సిన వార్షిక పాస్ రుసుము రూ.3000/-. చెల్లింపు నిర్ధారణ తర్వాత రెండు గంటల్లోపు యాక్టివేషన్ పొందండి.**
- ప్రస్తుతం చెల్లుబాటు అయ్యేది ఉన్నచో మరియు వాహనం యొక్క విండ్‌స్క్రీన్ పై సరిగ్గా అతికించబడి ఉన్నచో కొత్త ఫాస్టాగ్ కొనవలసిన అవసరం లేదు.
- యూజర్లు వార్షిక పాస్‌ను ఎంచుకోకూడదనుకుంటే, టోల్ ఫీజు చెల్లింపుల కోసం ప్రస్తుతం ఉన్న ఫాస్టాగ్ ఉపయోగిస్తూ కొనసాగించవచ్చు
- **మరిన్ని వివరాల కోసం, రాజమార్గయాత్ర వెబ్‌సైట్ http://rajmargyatra.nhai.gov.in ను దర్శించవచ్చును.**

31.07.2025 నాటికి తెలంగాణలో అర్హత కలిగిన టోల్ ప్లాజా

క్ర. సం	రహదారి విభాగం	జాతీయ రహదారి	టోల్ ప్లాజా పేరు
1	MH-KN సరిహద్దు - హైదరాబాద్	65	కమ్కోలే
2	హైదరాబాద్-విజయవాడ	65	పంతంగి
3		65	కోరలపహాడ్
4		65	చిల్లకల్లు
5	నాగ్‌పూర్ - హైదరాబాద్	44	పిప్పల్వాడ
6		44	రోల్మమ్డా
7		44	గన్జల్
8		44	ఇందల్వాయి
9		44	భిక్నూర్
10		44	మనోహరాబాద్
11	హైదరాబాద్ - బెంగళూరు	44	రాయికల్
12		44	షాకపూర్
13		44	పుల్లూరు
14	మన్నెగూడ-రావులపల్లె	163	చిట్లపల్లి
15	హైదరాబాద్-భూపాలపట్నం	163	గూడూరు
16		163	కోమల్ల
17		163	కోమటిపల్లి
18		163	జవహర్ నగర్
19	నక్రేకల్-తానంచెర్ల	365	కొత్తగూడెం
20	తానంచెర్ల-జామాండ్లపల్లి	365	చింతపల్లి
21	మంగళవారపేట నుండి మల్లంపల్లి వరకు	365	ముత్తోజిపేట
22	AP/TS సరిహద్దు-రుద్రంపూర్	30	గౌరారం
23	హైదరాబాద్-డిండి	765	కద్తాల్
24		765	కోనేటిపురం
25	కళ్యాణ్ - నిర్మల్	61	దిలావర్‌పూర్
26	జనగాం-తిరుమలగిరి-సూర్యాపేట	365B	సింగరాజుపల్లి
27		365B	యెర్కారం
28	సూర్యాపేట-ఖమ్మం	365BB	సింగరేణిపల్లి
29	మంచిర్యాల-రేపెల్లెవాడ-MH/TS సరిహద్దు	363	మందమర్రి
30		363	సరండి
31	కంది-నిజాంపేట్-TS/MH సరిహద్దు	161	తద్దనపల్లి
32		161	ధర్మారం
33	జడ్చర్ల-కల్వకుర్తి	167	మున్ననూర్
34	మిర్యాలగూడ - కోదాడ	167	అలగడప
35	హైదరాబాద్ ORR జంక్షన్-మెదక్	765D	గుమ్మడిదల
36	కోదాడ - ఖమ్మం	365A	పైనంపల్లి
37	మహదేవపూర్- భూపాలపల్లి	353C	మేడిపల్లి

రాజమార్గయాత్ర యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి

భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ
(భారత ప్రభుత్వ రోడ్డు రవాణా & రహదారుల మంత్రిత్వ శాఖ)

కేవలం రోడ్లను కాదు, దేశాన్ని నిర్మిస్తోంది.



హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో జరిగిన తిరంగా ర్యాలీలో రాంచందర్‌రావు

జాతీయవాదం స్ఫూర్తితోనే 'హర్ ఘర్ తిరంగ'

తెలంగాణలో 40 లక్షల ఇళ్లపై త్రివర్ణ పతాకం ఎగురవేస్తాం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

హైదరాబాద్ సిటీ/కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయవాదమే స్ఫూర్తిగా బీజేపీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా 'హర్ ఘర్ తిరంగ కార్యక్రమం చేపడుతున్నామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు పేర్కొన్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో గురువారం నిర్వహించిన తిరంగా ర్యాలీని రాంచందర్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. అలాగే, స్వచ్ఛభారత్ అభియాన్ ఆధ్వర్యంలో మార్చ్ ఫర్ ది నేషన్ పేరిట కూకట్‌పల్లి నియోజకవర్గంలో 1000 మీటర్ల జాతీయ జెండాతో నిర్వహించిన తిరంగా ర్యాలీని కూడా ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో రాంచందర్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 40 లక్షల ఇళ్లపై త్రివర్ణ పతాకం ఎగురవేసి దేశభక్తిని చాటడం, జాతీయ భావం పెంపొందించడమే తమ లక్ష్యమని తెలిపారు. మతం ఆధారంగా నాడు దేశాన్ని విభజించిన బ్రిటిషర్లకు కాంగ్రెస్ పార్టీ మద్దతు పలికిందని అన్నారు. మరోసారి దేశ విభజన ప్రసక్తి ఉండకూడదనే లక్ష్యంతో భారతదేశ ఐక్యత, సమగ్రతను, సంస్కృతిని కాపాడేలా తిరంగా యాత్ర ద్వారా సంకల్పం తీసుకున్నామన్నారు. తిరంగా యాత్ర ప్రతీ పౌరుడి గుండెలో దేశభక్తిని నింపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నెక్లెస్ రోడ్డులో చేపట్టిన తిరంగా ర్యాలీలో పెద్ద సంఖ్యలో యువత, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

నేడో రేపో బీజేపీ రాష్ట్ర కమిటీ!

- ఆగమేఘాలపై ఢిల్లీకి రాంచందర్‌రావు

హైదరాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కమిటీపై కసరత్తు క్లైమాక్స్‌కు చేరింది. నేడో రేపో కమిటీ ఏర్పాటు కానుంది. జాతీయ నాయకత్వం పిలుపుమేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు గురువారం మధ్యాహ్నం ఆగమేఘాలపై ఢిల్లీ వెళ్లారు. కమిటీ సభ్యులపై ఆయన ఇప్పటికే రాష్ట్ర పార్టీ ముఖ్యులు, సీనియర్ నాయకులతో పలు దఫాలుగా చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఢిల్లీ పర్యటన సందర్భంగా జాబితాకు ఆయన పార్టీ అధినాయకత్వంతో ఆమోద ముద్ర వేయించుకోనున్నారని పేర్కొన్నాయి. 8 మంది ఉపాధ్యక్షులు, ఏడుగురు కార్యదర్శులు, ముగ్గురు ప్రధాన కార్యదర్శులు, కోశాధికారితో కలిపి మొత్తం 19 పదవుల్లో మహిళలకు మూడోవంతు కేటాయించనున్నారు. ఈసారి బీసీలకు ఎక్కువ పదవులు దక్కే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి కోసం ఏకంగా 26 మంది సీనియర్ నాయకులు పోటీపడుతున్నట్లు సమాచారం.

పార్కింగ్ చేసిన కారు అద్దాలు పగలగొట్టి బంగారు కమ్మల అపహరణ

తిరుమల, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): తిరుమలలో పార్కింగ్ చేసిన కారు నుంచి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. తమిళనాడులోని వేలూరుకు చెందిన నిత్యవేల్ తన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం రాత్రి కారులో తిరుమల వచ్చారు. నారాయణగిరి విశ్రాంతి భవనం ముందున్న ప్రదేశంలో కారు పార్కింగ్ చేశారు. దర్శనం అనంతరం గురువారం ఉదయం కారు వద్దకు రాగా, అద్దాలు పగిలిపోవడాన్ని గుర్తించారు. సీట్లోని బ్యాగులు కూడా చెల్లాచెదురుగా పడిఉండటంతో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు జతల బంగారు కమ్మలు ఎత్తుకుపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

వాన అలజడి

ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు

- ఉప్పొంగిన వాగులు.. పలు గ్రామాలు జల దిగ్బంధం
- దివిటిపల్లి దగ్గర హైవేపై వరద
- గల్లంతైన ఆశా వర్కర్ మృతి
- హిమాయత్‌సాగర్ 11 గేట్లు ఎత్తి నీటి విడుదల

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



భద్రాద్రి జిల్లా అంగారుగూడెంలో బురదమయంగా మారిన దారిలో నడుచుకుంటూ వెళ్తున్న వైద్య బృందం

బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా వానలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాల పరిధిలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు భారీ వర్షాలు నమోదయ్యాయి. పలుచోట్ల వాగులు ఉప్పొంగాయి. చెరువులు నిండి అలుగుపారుతున్నాయి. మహబూబ్‌నగర్ పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లు నీట మునిగాయి. ఐటీ పార్కుకు వెళ్లే రోడ్డు కోతకు గురైంది. ఓ కంపెనీ బస్సు ఒరిగిపోయి 18 మందికి స్వల్పగాయాలు అయ్యాయి. వాగులు ఉప్పొంగి వనపర్తి జిల్లాలోని ఖిల్లాఘణపూర్, పెద్దమందడి, వనపర్తి, గోపాల్‌పేట మండలాల్లో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో చెర్లతిర్మలాపురం, నాగనూల్ గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఖమ్మం జిల్లావ్యాప్తంగా 6.2 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. జిల్లాలోని పాలేరు, వైరా ప్రాజెక్టులు నిండాయి. మున్నేరులోనూ వరద పెరుగుతోంది. జిల్లాలో వర్షాలు, వరదలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులతో సమీక్షించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో మూసీ నది ఉప్పొంగుతోంది.

ఉప్పొంగుతున్న ఈసీ, మూసీ..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని కొందుర్గు, చౌదరిగూడ మండలాల్లో పలు పెంకుటిళ్లు కూలిపోయాయి. వికారాబాద్ జిల్లావ్యాప్తంగా సగటున 6.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వికారాబాద్, కొడంగల్, పరిగి పట్టణాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బషీరాబాద్ మండలంలో కాగ్నా నది ఉప్పొంగడంతో జీవన్గిలోని మహాదేవలింగేశ్వర దేవాలయం నీట మునిగింది. వందల ఎకరాల్లో పొలాల్లో నీరు నిలిచింది. ఈసీ, మూసీ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గండిపేట, హిమాయత్‌సాగర్ ప్రాజెక్టులు నిండు కుండల్లా మారాయి. హిమాయత్‌సాగర్ తొమ్మిది గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. రాజేంద్రనగర్ వద్ద ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుపై నుంచి వరద ప్రవహిస్తోంది. ఆ రహదారిని మూసివేశారు. మూసీ వరదతో పరీవాహక ప్రాంతాల్లో అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. హైదరాబాద్ నగరం పొడవునా మూసీ నదిని ఆనుకుని ఉన్న లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. జియాగూడ, పురానాపూల్ రోడ్డు పూర్తిగా నీట మునిగింది. అధికారులు పలు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస శిబిరాలకు తరలించారు.



మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లి దగ్గర జాతీయ రహదారిపై వరద నీరు

కృష్ణాలో తగ్గుతున్న ప్రవాహం..

ఎగువ పరీవాహక ప్రాంతంలో వానలు నిలిచిపోవడంతో కృష్ణా నదిలో వరద తగ్గుతోంది. జూరాలలో గేట్లన్నీ మూసివేశారు. తుంగభద్ర నుంచి 23వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో గురువారం సాయంత్రానికి మూడు గేట్లు ఎత్తి నీటిని వదులుతున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 1.99 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 26 గేట్లు ఎత్తి 2.37 లక్షల క్యూసెక్కులను.. పులిచింతలకు 3.21 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవగా, 2.51 లక్షల క్యూసెక్కులు వదులుతున్నారు. మరోవైపు గోదావరి నది దిగువ పరీవాహకంలో వరద పోటెత్తుతోంది. గురువారం మేడిగడ్డ బ్యారేజీ వద్ద 3.41 లక్షల క్యూసెక్కుల వరద నమోదైంది. సమ్మక్కసాగర్ (తుపాకులగూడెం), సీతమ్మసాగర్ (దుమ్ముగూడెం) బ్యారేజీలకు వచ్చిన వరదను వచ్చినట్టు వదిలేస్తున్నారు. ఎగువ గోదావరిలో నిజాంసాగర్ ప్రాజెక్టుకు 2,941 క్యూసెక్కులు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 13,910 క్యూసెక్కుల, ఎల్లంపల్లికి 12,998 క్యూసెక్కుల స్వల్ప వరద వస్తోంది.

బురదలో 3 కిలోమీటర్లు నడిచి..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం అంగారుగూడెం గ్రామానికి రోడ్డు లేదు.. పైగా వర్షంతో మట్టి దారి అంతా బురదమయంగా మారింది. గురువారం మండల వైద్యాధికారి రవితేజ, సిబ్బంది కష్టమ్మీద ఆ బురదలోనూ 3 కిలోమీటర్లు నడిచి వెళ్లి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు.

గల్లంతైన ఆశా వర్కర్ మృతి

ములుగు జిల్లా వెంకటాపురం మండలం మొట్లగూడెంలో బండలవాగులో గల్లంతైన ఆశా వర్కర్ ఇర్ప లక్ష్మి(60) మృతి చెందారు. గురువారం ఉదయం వాగులో ఆమె మృతదేహం లభ్యమైంది. ఇక మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం బోయిలకుంట్లకు చెందిన యువకుడు భాను (24) గురువారం.. ముగ్గురు స్నేహితులతో కలసి వరద నీటిలో చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతయ్యారు.

వచ్చే 24 గంటలు అప్రమత్తంగా ఉండాలి!

- సహాయ చర్యల కోసం జిల్లాకు కోటి
- 10 ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేకాధికారులు
- సిబ్బంది సెలవుల రద్దు: పొంగులేటి



హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వచ్చే 24 గంటల పాటు మరింత అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయం నుంచి ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వరద సహాయ చర్యలు, ముందస్తు జాగ్రత్తలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మరో రెండు, మూడు రోజుల పాటు భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. రాబోయే 24 గంటల్లో రెడ్ అలెర్ట్ ఉన్న మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో తీసుకోవాల్సిన చర్యలపై ఆయా జిల్లాల కలెక్టర్లను అప్రమత్తం చేశారు. వరద సహాయ చర్యల కోసం ప్రతి జిల్లాకు రూ.కోటి మంజూరు చేశామని, అవసరమైతే మరిన్ని నిధులు విడుదల చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. సహాయ చర్యలను పర్యవేక్షించేందుకు ఉమ్మడి పది జిల్లాలకు సీనియర్ ఐఏఎస్ అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించినట్లు వివరించారు. అధికారులు, సిబ్బంది సెలవులను రద్దు చేసి వెనక్కి పిలిపించాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్, మెట్రో వాటర్‌బోర్డు, ట్రాఫిక్ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

జాగృతి జిల్లా అధ్యక్షుల నియామకం: కవిత

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి సంస్థాగత నిర్మాణంలో భాగంగా పలు అనుబంధ విభాగాలతో పాటు 11 జిల్లాలకు అధ్యక్షులను నియమించామని జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన నియామకాలు వెంటనే అమల్లోకి వస్తాయని వెల్లడించారు. 11 జిల్లాలకు అధ్యక్షులను నియమించామని.. వారిలో ఐదుగురు బీసీలు, ఇద్దరు ఎస్సీలు, ఒకరు ఎస్టీ ఉన్నారని.. అనుబంధ విభాగాల అధ్యక్షులు, ఉపాధ్యక్షుల నియామకాల్లోనూ సామాజిక న్యాయం పాటించామని పేర్కొన్నారు. జాగృతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా దూగుంట్ల నరేశ్ ప్రజాపతి, అధికార ప్రతినిధిగా నలమాస శ్రీకాంత్‌గౌడ్, మహిళా సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా మేక లలితా యాదవ్‌తో పాటు ఇతర విభాగాలకూ పలువురిని నియమించినట్లు కవిత వెల్లడించారు.

వర్షాలతో 562 కి.మీ. మేర దెబ్బతిన్న రోడ్లు

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలతో రోడ్లు, భవనాల శాఖ పరిధిలో దాదాపు రూ.592 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. రాష్ట్రవ్యాప్తంగా 377 ప్రాంతాల్లో 562 కి.మీ. మేర రోడ్లు దెబ్బతిన్నాయి. వీటి శాశ్వత, తాత్కాలిక మరమ్మతుల కోసం అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. భారీ వర్షాలు, వరదలతో రాష్ట్రవ్యాప్తంగా 121 చోట్ల రోడ్ల పైనుంచి నీరు ప్రవహిస్తోంది. 80 ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడగా.. 45చోట్ల సమస్యను పరిష్కరించారు. జిల్లాలవారీగా చూస్తే.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 78 కి.మీ, జోగులాంబ గద్వాలలో 68, సంగారెడ్డిలో 51, నిజామాబాద్‌లో 45, కామారెడ్డిలో 25 కి.మీ. మేర రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అలాగే కొమురంభీం ఆసిఫాబాద్, రాజన్న సిరిసిల్ల, సూర్యాపేట, మహబూబ్‌నగర్, సత్తుపల్లి ప్రాంతాల్లో రోడ్లు తెగిపోయాయి. మహబూబ్‌నగర్‌లో తెగిన రోడ్డును పునరుద్ధరించారు.



సత్తుపల్లిలోని బయ్యారం దగ్గర రాయపట్నం-మోటమర్రి రోడ్డుపై వరద ప్రవాహం

ఉపాధి ఎర చూపి..

బంధించి వ్యభిచార రొంపిలోకి !

- పేద కుటుంబాల యువతులే ముఠా లక్ష్యం
- ఉద్యోగాలు, డబ్బు ఎరతో నమ్మించి మోసం
- పలు రాష్ట్రాలు, విదేశాల నుంచి తరలింపు
- హైదరాబాద్‌లో బంధించి వ్యభిచార దందా
- 9 మందిని రక్షించిన సైబరాబాద్ పోలీసులు
- నిర్వాహకులైన 9 మంది ముఠా సభ్యుల అరెస్టు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు, ఉపాధి పేరుతో పేద అమ్మాయిలను ప్రలోభపెట్టి.. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచే కాకుండా విదేశాల నుంచి సైతం నగరానికి తీసుకువచ్చి వారిని బలవంతంగా వ్యభిచార రొంపిలోకి దింపుతున్న ముఠాను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠా చెర నుంచి 9 మంది యువతులను రక్షించారు. సైబరాబాద్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన కరణం గురువారం మీడియాకు ఈ కేసు వివరాలను వెల్లడించారు. కొంత మంది ముఠాగా ఏర్పడి ఉద్యోగాలు ఇప్పిస్తామని, ఉపాధి కల్పిస్తామని, డబ్బులు ఇస్తామంటూ పేద అమ్మాయిలను ప్రలోభపెట్టి హైదరాబాద్‌కు తీసుకువస్తున్నారు. ఇలా పశ్చిమ బెంగాల్, ఢిల్లీ నుంచి ఇద్దరు చొప్పున, జార్ఖండ్, హరియాణ, పంజాబ్‌ల నుంచి ఒక్కొక్కరు చొప్పున, అలాగే ఉజ్బెకిస్థాన్, తుర్కెమిస్థాన్ దేశాల నుంచి ఒక్కొక్కరు చొప్పున మొత్తం 9 మంది యువతులను ఈ ముఠా అక్రమంగా నగరానికి తీసుకొచ్చింది. వీరిందరినీ మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోనిపర్వత్‌నగర్-గాయత్రీనగర్ ప్రాంతంలో ఉన్న బీఎస్ఆర్ సూపర్ లగ్జరీ అండ్ లివింగ్ హోటల్‌లో బంధించింది. అనంతరం వారిని బెదిరించి వ్యభిచార కార్యకలాపాల్లోకి దింపింది. లోకాంటో, స్కోకా పేర్లతో ఉన్న వెబ్ సైట్‌ల ద్వారా ఈ ముఠా సభ్యులు ప్రచారం చేస్తూ విటులను ఆకర్షిస్తున్నారు. వెబ్‌సైట్‌లను చూసిన వారు ఫోన్ కాల్స్, వాట్సాప్ ద్వారా వీరిని సంప్రదిస్తే వారు ఆ హోటల్‌కు పిలిపిస్తున్నారు. అదేవిధంగా నగరంలోని ఇతర హోటల్స్, ఓయో రూమ్‌లను అద్దెకు తీసుకొని ఈ యువతులతో వ్యభిచారం చేయిస్తున్నారు. ఈ మేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న సైబరాబాద్ మానవ రవాణా నిరోధక బృందం దాడులు చేసి 9 మంది యువతులను రక్షించింది. వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్న 9 మందిని అరెస్టు చేసింది. అరెస్టు అయిన వారిలో ప్రధాన నిర్వాహకుడైన హ్యామర్‌సింగ్ అలియాస్ అమిద్‌సింగ్‌తో పాటు సూపర్‌వైజర్ తమ్మి శ్రీనివాస్, పోకల వెంకటేశ్వర్లు, బెక్‌మెటోవా గుల్‌షాత్, రకమనోవ మాలిక అలియాస్ లోనివ బోర రక్మనోవ మాలిక, లక్ష్మణ్ తూము, ఆకాశ్ బజాజ్, గోర మహ్మద్ వాసిమ్, పార్తీబన్ కె.పార్తిబన్‌లు ఉన్నారు. నిర్వాహకులపై వివిధ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీసీపీ తెలిపారు. అమాయక యువతులను, బాలికలను లక్ష్యంగా చేసుకొని మాయమాటలు చెప్పి తీసుకువస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలినట్లు తెలిపారు.

రాహుల్ ప్రాతినిధ్యం వహిస్తున్న రాయ్ బరేలీలో 71,977 దొంగ ఓట్లు

రాహుల్ ఎన్నికను రద్దు చేయాలని ఈసీని కోరతాం: రఘునందన్

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్న రాయబరేలీ నియోజకవర్గంలో 71,977 దొంగ ఓట్లు ఉన్నట్లు తేలిందని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. "రాయ్ బరేలీలో 2లక్షల ఓట్లపై మాకు అనుమానం ఉంది. మా కార్యకర్తలతో వెరిఫికేషన్ చేయిస్తే 71,977 ఇళ్ల చిరునామాలు నకిలీవని తేలింది. అందుకే రాహుల్ ఎన్నికను రద్దు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరబోతున్నాం" అని చెప్పారు. ఈవీఎంలపై విశ్వాసం లేకుంటే వెంటనే రాజీనామా చేసి బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికకు వెళ్లాలని రాహుల్‌ను సవాల్ చేశారు. "నేను ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్ పార్లమెంటులో కూడా దొంగ ఓట్లు ఉన్నాయి. సదాశివపేట, ఇస్నాపూర్, ఐలాపూర్ ప్రాంతాల్లో సుమారు వెయ్యి దొంగ ఓట్లను గుర్తించాం. వయనాడ్‌లో ఒకే వర్గానికి చెందిన 93,499 మంది ఓట్లతో ప్రియాంక గాంధీ గెలిచారు. మమతా బెనర్జీ, డింపుల్, అఖిలేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలపైన కూడా అనుమానంగా ఉంది. రాహుల్ గాంధీకి ఇవి ఎందుకు కనిపించడం లేదు" అని ప్రశ్నించారు. గురువారం రఘునందన్‌రావు మీడియాతో మాట్లాడారు. "ఈ దేశంలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నటువంటి వ్యక్తికి దేశంలోని ఏ వ్యవస్థపైనా నమ్మకం లేకపోవడం బాధాకరం. రాజీవ్ గాంధీ 1989లో కాంగ్రెస్ ఓటమి తర్వాత బ్యాలెట్ పేపర్లు మంచివి కావని, ఈవీఎంలను తీసుకురావాలని నిర్ణయించారు. ఆయన కుమారుడు రాహులేమో ఈవీఎంలను వద్దంటున్నారు. 20వ శతాబ్దంలో దేశానికి కంప్యూటర్ పరిచయం చేసిన నాన్న ఆలోచన ప్రోగ్రెసివ్.. కొడుకు ఆలోచనేమో డిస్ట్రక్టివ్" అని ఎద్దేవా చేశారు.

రాహుల్‌పై మాట్లాడే స్థాయి రఘునందన్‌కు లేదు: అద్దంకి

హరీశ్‌తో ఒప్పందం చేసుకుని బీఆర్ఎస్ సహకారం తీసుకుని ఎంపీగా గెలిచిన రఘునందన్‌కు రాహుల్‌పై మాట్లాడే స్థాయి లేదని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. పెద్దవాళ్లపై మాట్లాడితే పెద్దోడినైపోతానని రఘునందన్ అనుకుంటున్నారని, కానీ బీజేపీలోనే ఆయనకు ఆధారం లేదని అన్నారు.

ఎమ్మెల్యే కాలనీలో పెద్దమ్మ ఆలయం కూల్చివేతపై వివరణివ్వండి: హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రోడ్ నంబర్-12.. ఎమ్మెల్యే కాలనీలో గల పెద్దమ్మ అమ్మవారి ఆలయం కూల్చివేతపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం, ఇతర అధికారులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది. ఆలయ మేనేజ్‌మెంట్ కమిటీకి, స్థానిక భక్తులకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా గత నెల 24 తెల్లవారుజామున 3 గంటలకు జిల్లా కలెక్టర్, షేక్‌పేట తహసీల్దార్, ఇతర అధికారుల ఆధ్వర్యంలో కూల్చేశారని పి.వినోద్ కుమార్ రెడ్డి అనే న్యాయవాది గురువారం హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి బెంచ్ విచారణ చేపట్టింది. రాత్రికి రాత్రి రహస్యంగా ఆలయ తొలగింపు అక్రమమని పిటిషనర్ ఆరోపించారు. ఆలయ కూల్చివేతపై దర్యాప్తునకు ఆదేశించి, విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలని విజ్ఞప్తి చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. న్యాయ విచారణకు ఆదేశించి తప్పు చేసిన అధికారులను శిక్షించాలని విజ్ఞప్తి చేశారు.

స్వాతంత్ర్య దినోత్సవం ముంగిట విషాదం

సిద్దిపేట జిల్లాలో విద్యుదాఘాతంతోపంచాయతీ కార్మికుడి దుర్మరణం

చేర్యాల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రెండు వేర్వేరు చోట్ల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సిద్ధం అవుతుండగా ఒక పంచాయతీ కార్మికుడు దుర్మరణం పాలవ్వగా, మరొక గ్రామంలో పంచాయతీ స్కావెంజర్, ముగ్గురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం వేచరేణిలో గ్రామ పంచాయతీ కార్మికుడు ఎండీ మోహిన్ పాషా (30).. త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసే ఇనుప పైపును గురువారం నీటితో శుభ్రం చేస్తున్నాడు. పైపు పై భాగం కరంట్ వైర్లకు తగలడంతో విద్యుదాఘాతంతో మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూలులో పాఠశాల భవనంపై నుంచి జెండా కర్రగా ఉపయోగించే ఇనుప పైపు కిందకు దించుతుండగా, పై నుంచి వెళుతున్న విద్యుత్ తీగలకు తగిలి స్కావెంజర్ నవీన్, ఎనిమిదో తరగతి విద్యార్థులు నవనీత్, శ్రీరామ్, రాంచందర్ (6వ తరగతి) షాక్‌కు గురై పడిపోయారు. వీరికి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.

కక్షగట్టి కమిషన్ల పేరిట వేధింపులు దుర్మార్గం

- కాళేశ్వరంపై బురదజల్లడం కాంగ్రెస్, బీజేపీ నేతల దిగజారుడుతనం: కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జూరాల, మంజీరా, సింగూరు బ్యారేజీలకు ప్రమాద ఘంటికలు మోగుతున్నా పట్టించుకోని కాంగ్రెస్, బీజేపీ నేతలు.. కాళేశ్వరంపై మాత్రం బురదజల్లుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఇది వారి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ప్రాజెక్టులు కట్టాక మరమ్మతులు రావడం సహజమని, మేడిగడ్డ బ్యారేజీలోని రెండు పిల్లర్లను బూచిగా చూపుతున్నారని ధ్వజమెత్తారు. కక్షగట్టి కమిషన్ల పేరిట వేధించడం దుర్మార్గమని గురువారం కేటీఆర్ ఎక్స్‌లో పేర్కొన్నారు. హైదరాబాద్ జంట నగరాలకు మంచి నీరందించే మంజీరా బ్యారేజీకి ప్రమాదం పొంచి ఉందని స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ నిపుణుల బృందం చేసిన హెచ్చరికపై సోయి లేకపోతే మంజీరాకు మనుగడ ఉంటుందా? అని అడిగారు. సింగూరు డ్యామ్‌కు కూడా డేంజర్‌బెల్స్ మోగుతున్నాయని, అదే ఎన్‌డీఎస్‌ఏ హెచ్చరికను పెడచెవిన పెట్టి ప్రాజెక్టు భవితవ్యాన్ని ప్రశ్నార్థకం చేస్తారా? అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. అన్ని ప్రాజెక్టులకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

అప్పు పుట్టట్లేదని వాహనాలపై ట్యాక్స్ పెంచుతారా?:హరీశ్

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అప్పులు పుట్టడం లేదని వాహనాల లైఫ్ ట్యాక్సులు, రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచుతావా? అంటూ సీఎంరేవంత్‌రెడ్డిని మాజీమంత్రి హరీశ్ ప్రశ్నించారు. ఆదాయం కోసం కొత్త వాహనాలపై లైఫ్ ట్యాక్స్ పెంచి పేద, మధ్యతరగతి ప్రజల రక్తం పీలుస్తావా? అంటూ గురువారం ఓ ప్రకటనలో నిలదీశారు. ప్రస్తుత ధరల ప్రకారం ద్విచక్ర వాహనం ఏది కొన్నా.. రూ.లక్షకు పైగా ఉంటుందని, రైతులు, చిరు వ్యాపారులు కొనే ద్విచక్ర వాహనాలపై లైఫ్ ట్యాక్సును 12 నుంచి 15 శాతానికి పెంచడం దుర్మార్గమని ఆరోపించారు. కార్లు, వాణిజ్య వాహనాలపైనా అడ్డగోలుగా పన్నులు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. ప్రజలపై భారం మోపేలా రేవంత్ చేపట్టిన ఈ దుర్మార్గ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని హరీశ్ పేర్కొన్నారు.


ఎన్ఎంసీ అప్పీల్ కమిటీ సభ్యుడిగా డా.గంగాధర్



హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) అప్పీల్ కమిటీ సభ్యుడిగా నిమ్స్ ఆస్పత్రి నెఫ్రాలజీ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న డాక్టర్ గంగాధర్ తాడూరి నామినేట్ అయ్యారు. ఈ కమిటీ అటానమస్ బోర్డులు తీసుకున్న నిర్ణయాలపై వచ్చే అప్పీళ్లను సమీక్షించి లీగల్‌గా పరిష్కరించేందుకు కృషి చేస్తుంది.

నేడు, రేపు కబేళాలు మూసివేయాలన్న ఆదేశాలపై జోక్యం చేసుకోలేం

- మాంసం, మద్యం వినియోగంపై నిషేధం లేదు
- కావాలంటే ముందే తెచ్చుకొని ఫ్రిజ్‌లో పెట్టుకోండి:హైకోర్టు



హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం, శ్రీకృష్ణాష్టమి సందర్భంగా జీహెచ్ఎంసీ పరిధిలోని బీఫ్ షాపులు, కబేళాలు మూసివేయాలన్న ఉత్తర్వులపై జోక్యం చేసుకోలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. పిటిషనర్ మాంసం అమ్మే వ్యక్తి కానందున స్టే ఇవ్వడానికి నిరాకరించింది. ఆగస్టు 15, 16న బీఫ్ దుకాణాలు, కబేళాలు మూసివేయాలంటూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఈ నెల 4న ఉత్తర్వులు జారీ చేశారని, ఇది ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే అంటూ తార్నాకకు చెందిన వడ్ల శ్రీకాంత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఇలాంటి ఉత్తర్వులు ఇచ్చే అధికారం జీహెచ్ఎంసీకి లేదన్నారు.. వ్యాపారం దెబ్బతింటుందని తెలిపారు. ధర్మాసనం జోక్యం చేసుకొని పిటిషనర్ వ్యాపారి కాదని, వినియోగదారుడు మాత్రమేనని తెలిపింది. అమ్మకాలతో ప్రత్యక్ష సంబంధం అతనికి లేదని పేర్కొంది. 'మాంసం తినడం, మద్యం సేవించడంపై ఎటువంటి నిషేధం లేదు. మీరు తినాలనుకుంటే, ఇప్పుడే వెళ్లి మీకు కావలసినది కొనుక్కోండి. దానిని డీప్ ఫ్రీజర్‌లో భద్రపరచండి. రేపు, ఎల్లుండి దాన్ని ఉపయోగించండి' అని వ్యాఖ్యానించింది. ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని చెబుతూ.. తదుపరి విచారణ ఈ నెల 28కి వాయిదా వేసింది.

స్వాతంత్ర్య పోరాటంలో ముస్లింల పాత్రను విస్మరించారు

- నేతాజీ అనుచరుడైన హసన్ సత్రానీని పాలకులు పట్టించుకోలేదు
- జైహింద్ నినాదం ఇచ్చిన సత్రానీ హైదరాబాదీ:అసదుద్దీన్

బర్కత్‌పుర, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్య పోరాటంలో ముస్లింలు కూడా ప్రధాన పాత్ర పోషించారని, అయితే పాలకులు చరిత్రను విస్మరించారని ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ చెప్పారు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడుతూ ప్రాణత్యాగం చేసిన ముస్లింల చరిత్ర లేకపోవడం బాధాకరమన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన అజాద్ హింద్ ఫౌజ్‌లో కీలక పాత్ర పోషించి, జైహింద్ నినాదం ఇచ్చిన అబిద్ హసన్ సత్రాని హైదరాబాదీయేనని ఓవైసీ గుర్తుచేశారు. నేతాజీ ముఖ్య అనుచరుడిని కూడా పాలకులు విస్మరించారని చెప్పారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రిసర్చ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ఓవైసీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

రిజర్వేషన్లపై అఖిలపక్ష భేటీ పెట్టాలి: జాజుల

హైదరాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిలపక్ష పార్టీలు, బీసీ సంఘాలు, మేధావులతో సమావేశం ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ చట్టం చేసే విషయంలో బీజేపీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని జాజుల విమర్శించారు. ఇందులో ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నారనే తప్పుడు ప్రచారంతో బీజేపీ బీసీల్లో గందరగోళ వాతావరణాన్ని సృష్టించే విధానాన్ని ఎండగడుతూ కేంద్రంపై ఒత్తిడి పెంచడానికి తక్షణం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని జాజుల కోరారు.



ఏపీహెచ్ఎంఈఎల్ ఉద్యోగులతో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

ఏపీహెచ్ఎంఈఎల్ ప్రపంచంతో పోటీ పడాలి

- విజయవాడలో సంస్థను సందర్శించిన భట్టి

విజయవాడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంతో పోటీ పడే స్థాయికి ఆంధ్రప్రదేశ్ హెవీ మెషినరీ ఇంజినీరింగ్ లిమిటెడ్(ఏపీహెచ్ఎంఈఎల్) ఎదగాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. విజయవాడకు సమీపంలోని ఇబ్రహీంపట్నంలో ఉన్న సింగరేణి అనుబంధ సంస్థ ఏపీహెచ్ఎంఈఎల్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడారు. అనంతరం భట్టి మీడియాతో మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా పరిశ్రమల కొత్త విడిభాగాల తయారీ, పాత విడిభాగాలకు మరమ్మతు చేసి సరఫరా చేస్తున్న ఇంజినీరింగ్ సంస్థలకు ఏపీహెచ్ఎంఈఎల్ కన్నా మంచి యంత్రాలు, మానవ వనరులు లేవని అన్నారు. సంస్థను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు త్వరలోనే ఒక కన్సల్టెన్సీని నియమిస్తామని, వారు స్థానిక పరిస్థితులను అధ్యయనం చేసి నివేదిక ఇస్తారని తెలిపారు. ఆ నివేదిక ఆధారంగా సంస్థ అభివృద్ధికి ఏం చేయాలో ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ పరిశ్రమ సింగరేణికి అవసరమైన యంత్రాలను తయారు చేయడం, మరమ్మతు వరకే పరిమితం కాకుండా భవిష్యత్తులో రాష్ట్రం, దేశానికి అవసరమైన ఆర్డర్లను తీసుకుని బీహెచ్ఈఎల్ తరహాలో పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సీఎస్ పదవీ కాలం మరో 3 నెలల పొడగింపు!

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.రామకృష్ణారావు విషయంలో ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోబోతున్నట్లు సమాచారం. ఆయన పదవీ కాలాన్ని పొడిగించడానికి సుముఖంగా ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు పదవీ కాలాన్ని పొడిగించాలంటూ కేంద్ర శిక్షణ, సిబ్బంది వ్యవహారాలశాఖ (డీఓపీటీ)కి లేఖ రాసినట్లు సమాచారం. నిజానికి రామకృష్ణారావు ఐఏఎస్ అధికారిగా ఈ నెల 31న పదవీ విరమణ చేయబోతున్నారు. అదే రోజు సీఎస్‌గా ఆయన పదవీ కాలం ముగియనుంది. ఈ ఏడాది ఏప్రిల్ 30న ఆయన రాష్ట్రప్రభుత్వ ప్రధానకార్యదర్శిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. నాలుగు నెలల పాటే ఆయన ఈ పదవిలో కొనసాగారు. అందుకే ప్రభుత్వం మరో మూడు నెలల పాటు ఆయనకు పొడిగింపు ఇవ్వాలని యోచిస్తోంది.

సింగూరుకు తక్షణమే మరమ్మతులు చేయండి

- వారం రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక ఇవ్వండి
- తెలంగాణకు జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ లేఖ

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మంజీరా నదిపై ఉన్న సింగూరు డ్యామ్‌కు తక్షణమే మరమ్మతులు చేయాలని జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్ఏ) స్పష్టం చేసింది. ఈ మేరకు బుధవారం రాష్ట్ర డ్యామ్ సేఫ్టీ కమిటీ చైర్మన్, ఈఎన్‌సీ(జనరల్)కు ఎన్‌డీఎస్ఏ సదరన్ రీజియన్ ప్రాంతీయ సంచాలకుడు గిరిధర్ లేఖ రాశారు. వానాకాలానికి ముందు ప్రాజెక్టు పరిస్థితిపై డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్ పరిశీలన చేసిందని తెలిపారు. రిజర్వాయర్ ఎగువన రివిట్‌మెంట్ దెబ్బతిందని, ఆనకట్టపై భాగంలో పిట్టగోడకు పగుళ్లు ఉన్నాయని పేర్కొన్నారు. డ్యామ్ డిజైన్ ప్రకారం 517.8 మీటర్ల దాకే నీటిని నిల్వ చేయాల్సి ఉండగా.. 2017లో ఇచ్చిన జీవో 885(30-10-2017) ప్రకారం కొన్నేళ్లుగా 520.50 మీటర్ల దాకా నీటిని నిల్వ చేయడం వల్ల డ్యామ్ ప్రమాదకర స్థితికి చేరిందని కమిటీ పరిశీలనలో వెల్లడైందని వివరించారు. ఈ నేపథ్యంలో తక్షణ మరమ్మతులకు ఉపక్రమించకపోతే జాతీయ ఆనకట్టల భద్రత చట్టం-2021లోని నిబంధనల ప్రకారం జరిమానా ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. మరమ్మతులు చేపట్టడానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను ఈ నెల 21లోగా అందించాలని స్పష్టం చేశారు.

ఇది ప్రజాస్వామ్య విజయం: మహేష్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బిహార్ ఓటరు జాబితాలో ఓట్ల తొలగింపుపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు తాము స్వాగతిస్తున్నామని, ఇది ప్రజాస్వామ్య విజయమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. రాహుల్ లేవనెత్తిన ఓట్ చోరీ ఆరోపణలు.. సుప్రీంకోర్టు తీర్పుతో రుజువయ్యాయని గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్ లింక్‌తో ఒక ఓటు, ఒక మనిషి విధానం అమలు చేయాలన్న రాహుల్ డిమాండ్‌పై ఎన్నికల కమిషన్ స్పందించాలని డిమాండ్ చేశారు.

'మన ఊరు - మన బడి' నిధులు విడుదల చేయండి

- సీఎంకు మండలి చైర్మన్ గుత్తా లేఖ

'మన ఊరు - మన బడి' కార్యక్రమం కింద పనులకు బిల్లులు రాక కాంట్రాక్టర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు. కనుక వారికి వెంటనే నిధులు విడుదల చేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి గురువారం లేఖ రాశారు. వీరు చిన్న కాంట్రాక్టర్లని, తనను కలిసి తమ గోడును తెలుపుకున్నారన్నారు. మన ఊరు- మన బడి కార్యక్రమంలో పూర్తయిన సివిల్ పనులకు చెల్లించాల్సిన రూ. 361.35 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయంటూ సీఎం దృష్టికి తెచ్చారు. చిన్న కంట్రాక్టర్లు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు.. చేబదుళ్లతో ఈ పనులను పూర్తి చేశారన్నారు. వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పెండింగ్ బిల్లులను అత్యంత ప్రాధాన్యంతో క్లియర్ చేయాలని కోరారు.

రాజీవ్ జ్యోతికి గాంధీభవన్‌లో ఘన స్వాగతం

రాజీవ్ జ్యోతికి గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ నేతలు ఘన స్వాగతం పలికారు. ఏటా శ్రీ పెరంబుదూర్ నుంచి బయలుదేరి హైదరాబాద్ మీదుగా ఆగస్టు 20 నాటికి రాజీవ్ జ్యోతి ఢిల్లీకి వెళుతుంది. ఈ ఏడాదీ శ్రీ పెరంబుదూర్‌లో ప్రారంభమై గురువారం గాంధీభవన్‌కు చేరుకున్న రాజీవ్ జ్యోతికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు కుమార్‌రావు, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి, నాంపల్లి ఇంచార్జి ఫిరోజ్‌ఖాన్ తదితరులు స్వాగతం పలికారు.



పోలీసు డిగ్రీ

డీజీపీ కార్యాలయంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం

(మొదటిపేజీ తరువాయి)

ఐదేళ్లలో కోర్సు పూర్తి చేయించి డిగ్రీలు ఇవ్వడానికి ప్రయత్నిస్తామని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఘంటా చక్రపాణి తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులు చదువు కోసం సెలవులు పెట్టకుండా పోలీసు ట్రైనింగ్ సెంటర్లలో అంబేద్కర్ యూనివర్సిటీ తరపున స్టడీ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. డీజీపీ జితేందర్ మాట్లాడుతూ దాదాపు 30వేల మంది పోలీసులు ఇంటర్‌తోనే చదువు ఆపేసి పోలీసు ఉద్యోగంలో చేరారని, వీరంతా విధులు నిర్వహిస్తూనే డిగ్రీ పూర్తి చేసుకోవచ్చని చెప్పారు. తద్వారా పదోన్నతులకు అవకాశం ఉంటుందన్నారు. ఔటర్ పోలీసింగ్, నూతన చట్టాలు, సైబర్ క్రైమ్స్, ట్రాఫిక్ తదితర అంశాలకు సంబంధించి ప్రత్యేక పాఠ్యాంశాలను రూపొందిస్తామని యూనివర్సిటీ అధికారులు వివరించారు.



స్వాతంత్ర్య వేడుకలకు త్రివర్ణ రంగులతో ముస్తాబైన గోల్కొండ కోట

సీఎంను కలిసిన రాహుల్ సిప్లిగంజ్, అందెశ్రీ


హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సింగర్ రాహుల్ సిప్లిగంజ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వం ఇటీవల ఆయనకు 1 కోటి రూపాయల నగదు ప్రోత్సాహకం అందించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం జూబ్లీహిల్స్‌లోని అధికారిక నివాసంలో ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు ప్రముఖ కవి అందెశ్రీ కూడా ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.



విశ్రాంత జీవితం.. వేదనాభరితం

పిల్లలకు పెళ్లిళ్లు చేయలేక.. పెద్ద చదువులు చదివించలేక.. అనారోగ్యానికి చికిత్స చేయించుకోలేక 8000 మంది విశ్రాంత ఉద్యోగుల విరమణ కష్టాలు

రోడ్లు, భవనాల శాఖలో 33 ఏళ్లపాటు పని చేసిన ఎన్. వెంకటేశ్ ఎస్‌ఈ (ఎఫ్ఏసీ) హోదాలో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉద్యోగ విరమణ చేశారు. ప్రస్తుతం అబ్డామిన్ క్యాన్సర్‌తో ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే సుమారు రూ.30 లక్షలకుపైగా ఖర్చు చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద ఆయనకు ప్రభుత్వం నుంచి దాదాపు రూ.75 లక్షలు రావాల్సి ఉంది. అవి రాకపోవడం, క్యాన్సర్ చికిత్సకు పెద్ద ఎత్తున ఖర్చు చేయాల్సి వస్తుండడంతో ఆర్థికంగా ఆయన తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కనీసం జీతంతో తాను దాచుకున్న పీఎఫ్‌ను కూడా ఇప్పటి వరకూ ఇవ్వలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదవీ విరమణ ప్రయోజనాలను అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



... వీరు ఇద్దరే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ విరమణ చేసిన దాదాపు ఎనిమిది వేల మంది ప్రభుత్వ ఉద్యోగుల మనో వేదన ఇది. మూడు, మూడున్నర దశాబ్దాలపాటు ప్రభుత్వానికి సేవ చేశారు. అందుకు బహుమతిగా పదవీ విరమణ చేసేనాటికే కొందరు అనారోగ్యాల పాలయ్యారు. మరి కొందరికి పిల్లలు పెద్ద చదువులకు, పెళ్లిళ్లకు వచ్చారు. ఇంకొందరికి పదవీ కాలంలో చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయి. ఉద్యోగంలో ఉన్నప్పుడు తాము దాచుకున్న డబ్బు.. ప్రభుత్వం నుంచి తమకు రావాల్సిన సొమ్ములు మలి వయసులో తమకు ఆసరా అవుతాయని అంతా భావించారు. కానీ, అప్పుడు కేసీఆర్ ప్రభుత్వంలో కానీ ఇప్పుడు రేవంత్ రెడ్డి హయాంలో కానీ వారికి అందాల్సిన ఉద్యోగ విరమణ ప్రయోజనాలు మాత్రం వారికి అందలేదు. వెరసి, సర్కారు నుంచి తమకు లక్షలు వచ్చే పరిస్థితి ఉన్నా చేతిలో చిల్లిగవ్వ లేక వేలాదిమంది విశ్రాంత ఉద్యోగులు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. వాటి కోసం ఏళ్ల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆర్థికంగా సమస్యలను ఎదుర్కొంటున్నామని, అప్పులు చేయాల్సి వస్తోందని, ప్రభుత్వం నుంచి తమకు హక్కుగా దక్కాల్సిన ఉద్యోగ విరమణ ప్రయోజనాలను అందించాలని విజ్ఞప్తులు చేస్తున్నారు.

ఒక్కొక్కరికి రూ.35 లక్షలకుపైగా..

ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేసిన తర్వాత పెద్దఎత్తున రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాల్సి వస్తుందన్న ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021లో వారి పదవీ విరమణ వయసును 59 నుంచి 61కి పెంచింది. రెండేళ్లపాటు నిలిచిపోయిన పదవీ విరమణలు 2023 నుంచి డబుల్ స్పీడ్‌లో ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి ఈ ఏడాది జూలై చివరి వరకూ ఎనిమిది వేల మందికి పైగా ఉద్యోగులు పదవీ విరమణ చేసి ఉంటారని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. రిటైరైన వారికి గ్రాట్యుటీ (ఉద్యోగి సర్వీస్‌ను బట్టి, హోదాను బట్టి ప్రభుత్వం అందించే నగదు), జీపీఎఫ్, కమ్యుటేషన్, టీజీఎల్, జీఐఎస్, సరెండర్ లీవ్స్ కలిపి ఇవ్వాల్సి ఉంటుంది. దీని ప్రకారం ఒక్కో ఉద్యోగికి వారి హోదాలను బట్టి దాదాపు రూ.35 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు అందుతుంది. ఈ లెక్కన విశ్రాంత ఉద్యోగులకు దాదాపు రూ.5 వేల కోట్ల వరకూ రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాల్సి ఉంది. నిజానికి, రిటైరయ్యే ఉద్యోగులకు సంబంధించి 3-4 నెలల ముందుగానే వారికి అందాల్సిన బెనిఫిట్స్‌ను లెక్కగట్టి, పదవీ విరమణ పొందే సమయానికి అందించేలా చర్యలు తీసుకోవాలి. కానీ, రిటైరైన తర్వాత ఏళ్లు గడిచినా ప్రభుత్వాలు వాటిని అందించడం లేదు. ఇక, ప్రస్తుతం ఉద్యోగంలో కొనసాగుతున్న వారి పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. వారికి దాదాపు ఏడు వేల కోట్ల రూపాయల వరకూ బకాయిలు ఉన్నట్లు సమాచారం. వారికి దాదాపు 32 రకాల ప్రయోజనాల కింద చెల్లింపులు చేయాల్సి ఉన్నా.. చేయడం లేదు. జీపీఎఫ్ కోసం దరఖాస్తు చేసుకుని ఏళ్లు గడుస్తోందని, అయినా ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. హెల్త్ కార్డు సమస్య కూడా కొలిక్కి రాలేదు. తమకు హక్కుగా అందాల్సిన బెనిఫిట్స్‌ను ప్రభుత్వం సమయానికి అందించడం లేదంటూ కొంతమంది కోర్టులను కూడా ఆశ్రయించారు. కోర్టులు కూడా పలు సూచనలు చేశాయి. అయినా ప్రయోజనం లేదు. ఈ సమస్యల పరిష్కారానికి నెలకు రూ.850 కోట్ల నుంచి వెయ్యి కోట్ల వరకూ బడ్జెట్ కేటాయిస్తామని ప్రభుత్వం పలు మార్లు హామీ ఇచ్చింది. కానీ, అమల్లో మాత్రం అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవడం లేదని ఉద్యోగ సంఘాల నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు.

కమిటీ వేసినా పరిష్కారం కాని సమస్యలు

రాష్ట్రంలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ముగ్గురు అధికారులతో కమిటీని నియమించింది. మంత్రులతో క్యాబినెట్ సబ్ కమిటీని కూడా ఏర్పాటు చేసింది. అయినా ఇంతవరకూ సమస్యలు పరిష్కారం కాలేదు. వారి 63 డిమాండ్లలో ఆర్థికేతర అంశాలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారుల కమిటీ గతంలో చెప్పింది. కానీ, వాటిలో మొదట ఏ అంశాన్ని పరిష్కరించేదీ స్పష్టత ఇవ్వలేదు. కొద్ది కాలం కిందట ఉద్యోగులు ఆందోళనకు పిలుపు ఇచ్చినప్పుడు ఒక డీఏ చెల్లించి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ, ఇప్పటి వరకూ వాటిపై అడుగు ముందుకు పడలేదు. కాగా రాష్ట్రంలోని రిటైర్డ్ ఉద్యోగులు, ప్రస్తుతం ఉద్యోగంలో ఉన్నవారి సమస్యలపై తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు గురువారం ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శేషాద్రితో భేటీ అయ్యారు. సమస్యలను ఆయనకు వివరించారు. త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశామని 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు.

కోర్టులు చెబితేనే..

ఉద్యోగ విరమణ ప్రయోజనాలు అందకపోవడం, అనారోగ్య సమస్యల కారణంగా సుమారు 14-15 మంది వరకు మరణించారని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. ఇక, 2024 మార్చి నుంచి 2025 జూలై వరకు పోలీసు శాఖలో ఇన్‌స్పెక్టర్ల హోదాలో దాదాపు 1000 మంది వరకు రిటైర్ అయ్యారు. తమకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్ ఇవ్వడం లేదంటూ వీరిలో 432 మంది కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు వీరిలో ఇప్పటి వరకు 232 మందికి బెనిఫిట్స్ అందాయి. దాంతో, కోర్టు ఆదేశాలను ప్రభుత్వం అమలు చేయలేదని తెలుపుతూ మరో 14 మంది బుధవారం మళ్లీ కోర్టును ఆశ్రయించారని రిటైరయిన ఓ ఇన్‌స్పెక్టర్ చెప్పారు.

- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవా లక్ష్మికి

సుప్రీంలో ఊరట

- నాలుగేళ్లపాటు ఆదాయ వివరాలు ఇవ్వకపోవడంలోపం కాదన్న ధర్మాసనం
- ఆమె ఎన్నిక చెల్లదంటూ దాఖలైన పిటిషన్ కొట్టివేత



న్యూఢిల్లీ/ఆసిఫాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవా లక్ష్మికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఆమె ఎన్నిక చెల్లదంటూ ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన అజ్మీరా శ్యాం నాయక్.. కోవా లక్ష్మి చేతిలో ఓటమి పాలయ్యారు. అయితే, లక్ష్మి ఎలక్షన్ కమిషన్‌కు అందజేసిన అఫిడవిట్‌లో ఆదాయ పన్ను వివరాలను దాచిపెట్టి తప్పుడు సమాచారాన్ని అందించారని, ఆమె ఎన్నిక చెల్లదని ఆరోపిస్తూ గతేడాది జనవరిలో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌ను విచారించిన హైకోర్టు కోవా లక్ష్మికి అనుకూలంగా తీర్పునిచ్చింది. దీంతో హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ నవంబర్ 21న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం.. ఎమ్మెల్యే వాదనలతో ఏకీభవించింది. ఆదాయపు పన్ను రిటర్న్‌లో నాలుగు ఆర్థిక సంవత్సరాల ఆదాయాన్ని వెల్లడించకపోవడం పెద్ద లోపం కాదని స్పష్టం చేసింది. ఈ కారణంగా ఆమె ఎన్నికను రద్దు చేయలేమంటూ పేర్కొంది. సుప్రీం తీర్పుపై ఎమ్మెల్యే కోవా లక్ష్మి స్పందించారు. తనకు అత్యున్నత న్యాయ స్థానంలో న్యాయం జరిగిందని తెలిపారు.

మేయర్, చైర్మన్ ఎన్నికల్లో రాజ్యసభ సభ్యులూ ఓటేయవచ్చు

- మున్సిపల్ చట్ట సవరణ ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మున్సిపల్ చట్ట సవరణ ఆర్డినెన్స్‌కు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆమోదం తెలిపారు. దీంతో ఇకపై మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, నగర పాలక సంస్థల మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో రాజ్యసభ సభ్యులు కూడా ఓటు వేయవచ్చు. ఈ మేరకు మున్సిపల్ చట్టంలోని సెక్షన్ 20కి ప్రభుత్వం సవరణ చేసింది. అలాగే సంగారెడ్డి జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయాలని మంత్రిమండలి ప్రతిపాదించిన రెండు మున్సిపాలిటీలకు సంబంధించిన ఆర్డినెన్స్‌కు కూడా గవర్నర్ ఆమోదం తెలపడంతో ఈ మేరకు గురువారం గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఆర్డినెన్స్ ద్వారా మున్సిపాలిటీలుగా ఏర్పాటుకానున్న ఇంద్రేశంలో 7, జిన్నారంలో 10 గ్రామపంచాయతీలు ఉన్నాయి.

50 అంతస్తుల్లో 'ఏక్తా మాల్'!

- రాయదుర్గంలో 1500 కోట్లతో నిర్మాణం
- 6 అంతస్తులతో నిర్మాణానికి పనులు
- దాన్ని 50 అంతస్తులకు పెంచాలని సీఎం నిర్ణయం
- ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మాణం!

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దేశీయ ఉత్పత్తులను ప్రపంచానికి ఎగుమతి చేయాలన్న లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్న కేంద్ర ప్రభుత్వం.. అన్ని రాష్ట్రాల్లో 'ఏక్తా మాల్' పేరుతో బహుళ అంతస్తుల భవనాలు నిర్మించాలని నిర్ణయించింది. దేశవ్యాప్తంగా 27 రాష్ట్రాల్లో పీఎం ఏక్తా మాల్ భవనాలను నిర్మించనున్నారు. ఈ భవనాల నిర్మాణాలకు కేంద్రం ఇప్పటికే రూ.5 వేల కోట్లు కేటాయించింది. ఈ పథకంలో భాగంగా హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్‌లో భవనాన్ని నిర్మించనున్నారు. రాయదుర్గం ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న 'ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ)' పక్కన ఈ భవనాన్ని నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర తోలు పరిశ్రమల ప్రోత్సాహక సంస్థ (టీఎస్ఎల్ఐపీసీ)కి చెందిన 5.16 ఎకరాలను ఈ భవనం కోసం కేటాయించారు. ఇక్కడ ఆరు అంతస్తుల్లో భవన నిర్మాణానికి ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. అయితే దీన్ని 50 అంతస్తుల్లో నిర్మించాలని ఇటీవల నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర ఏజెన్సీగా తెలంగాణ రాష్ట్ర వాణిజ్య ప్రోత్సాహక సంస్థ (టీజీటీపీసీ) వ్యవహరించనుంది. సీఎం ఆదేశాల నేపథ్యంలో అధికారులు కొత్త ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. 50 అంతస్తుల్లో భవన నిర్మాణానికి దాదాపు రూ.1500 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా. నిధుల సమస్య లేకుండా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో దీన్ని నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 50 అంతస్తుల్లో నిర్మాణం పూర్తయ్యాక.. ఆరు అంతస్తుల్లో తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి విదేశాలకు ఎగుమతి అవుతున్న ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయ కేంద్రాలు ఉంటాయి. ముఖ్యంగా తెలంగాణలోని 33 జిల్లాల నుంచి ఎగుమతులకు అర్హత ఉన్న 33 రకాల ఉత్పత్తులను ఇప్పటికే గుర్తించారు. వీటికి కొత్త భవనంలో ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తారు. అలాగే తెలంగాణ నుంచి భౌగోళిక గుర్తింపు (జీఐ) పొందిన ఉత్పత్తులనూ ఇక్కడ విక్రయించనున్నారు. మిగతా 44 అంతస్తులను ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర వాణిజ్య అవసరాలకు వినియోగించాలని భావిస్తున్నారు. ఈ 50 అంతస్తుల భవనం పూర్తయితే నగరంలో అతిపెద్ద ప్రభుత్వ వాణిజ్య భవనం అవుతుందని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

'భూమాయ'పై సర్కార్ ఆరా

- 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన యంత్రాంగం
- పుప్పాలగూడ కాందిశీకుల భూరికార్డుల పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

పుప్పాలగూడలోని రూ.వేల కోట్ల విలువైన కాందిశీకుల భూములు అన్యాక్రాంతం అవడంపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంతో అధికారయంత్రాంగం కదిలింది. హైదరాబాద్ నడిబొడ్డున 22-ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న రూ.వేల కోట్ల విలువైన కాందిశీకుల భూముల్లో రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు.. గత ప్రభుత్వ హయంలో పెద్దలు అడిగిందే తడవుగా హెచ్ఎండీఏ అధికారులు అనుమతులు ఇచ్చేశారు. దీనిపై గురువారం 'ఆంధ్రజ్యోతి'లో.. 'భూమాయ చేశారు' అనే శీర్షికన వార్తాకథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీంతో ప్రభుత్వం స్పందించి ఈ వ్యవహారంపై ఆరా తీసింది. కాందిశీకుల భూముల వివరాలతో పాటు.. ఆ భూముల్లో చేపట్టిన రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు అనుమతుల వివరాలను ఇవ్వాలని ఉన్నతాధికారులను ఆదేశించింది. దీనిపై జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల నుంచి సమాచారం కోరింది. అలాగే గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు ఈ భూముల వ్యవహారంలో ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా వ్యవహరించారా? అనే దానిపై కూడా ఆరా తీస్తున్నారు. మరోవైపు ఈ భూముల్లో కొన్ని సర్వే నంబర్లపై ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తుల మధ్య సీలింగ్ వివాదాలు కూడా ఆయా న్యాయస్థానాల్లో నడుస్తున్నాయి. వీటి వివరాలను కూడా ఇవ్వాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఈ వ్యవహారానికి సంబంధించి లోకాయుక్తకు, ఈడీకి అందిన ఫిర్యాదుల వివరాలు కూడా ప్రభుత్వం కోరినట్లు తెలిసింది.

బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించండి

- బీజేపీ శ్రేణులను కోరిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- రాష్ట్రానికి రానున్న 7 ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని బీజేపీ శ్రేణులకు కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. బాధితులకు ఆహారం, తాగునీటితోపాటు అన్ని సౌకర్యాలు కల్పించాలని గురువారం ఓ ప్రకటనలో ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్న ప్రజల కోసం యంత్రాంగం సహాయ చర్యలు చేపట్టిందని గుర్తు చేశారు. బాధితులకు అండగా నిలవాలని కోరిన కిషన్ రెడ్డి.. కేంద్ర హోంమంత్రి ఆదేశాలతో రాష్ట్రంలో పర్యటనకు 7 జాతీయ ప్రకృతి విపత్తుల నిర్వహణ సంస్థ (ఎన్‌డీఆర్ఎఫ్) బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో రెండు బృందాలు, ఖమ్మం, నిర్మల్, ములుగు, హైదరాబాద్, మహబూబాబాద్ జిల్లాల్లో ఒక్కో బృందం సిద్ధంగా ఉన్నాయని వివరించారు.

పక్క రాష్ట్రాల్లోనూ యూరియా కొరత..

- రాంచందర్‌రావుది అవగాహనారాహిత్యం
- బీజేపీది రైతు వ్యతిరేక ప్రభుత్వం: తుమ్మల



హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరత కేవలం తెలంగాణలోనే కాదు.. పక్క రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో కూడా ఉందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో యూరియా కొరత లేదని, రాష్ట్ర ప్రభుత్వమే కృత్రిమ కొరత సృష్టిస్తోందంటూ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాంచందర్‌రావు వ్యాఖ్యలు అవగాహనారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. రాష్ట్రానికి కేంద్రం ఎంత యూరియా కేటాయించింది, ఎంత సరఫరా చేసింది అనే వాస్తవాలను ముందుగా తెలుసుకోవాలని సూచించారు. ఇలాంటి ఆరోపణలు తెలంగాణ బీజేపీకి రైతుల పట్ల ఉన్న చిత్తశుద్ధిని శంకిపజేస్తున్నాయన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీది రైతు మిత్ర ప్రభుత్వం కాదని, రైతు వ్యతిరేక ప్రభుత్వమని ధ్వజమెత్తారు. కేంద్రం కావాలనే కొన్ని రాష్ట్రాలపై సవతి తల్లి ప్రేమ చూపుతోందని తుమ్మల ఆక్షేపించారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి ఇంకా 3.20 లక్షల టన్నుల ఎరువులు రావాల్సి ఉందని వివరించారు. ఇప్పటికైనా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రగల్భాలు మాని.. చేతనైతే ఆ యూరియాను తెప్పించాలంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు.

శతాధిక వృద్ధుడి పుట్టినరోజు వేడుకలు



రాగం గాలయ్య, లింగవ్వ దంపతులు

దండేపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కాలంలో ప్రతి వస్తువు కల్తీమయంగా మారిన తరుణంలో వందేళ్లు బతకాలనుకోవడం అత్యాశే అవుతుంది. కానీ మంచిర్యాల జిల్లాకు చెం దిన ఓ తాత మాత్రం 106వ వసంతంలోకి అడుగుపెట్టాడు. దండేపల్లి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన రాగం గాలయ్య పుట్టిన రోజు వేడుకలను కుటుంబ సభ్యులు గురువారం ఘనంగా నిర్వహించారు. గాలయ్యకు భార్య లింగవ్వ(97)తో పాటు ఒక కుమారుడు, 10 మంది కుమార్తెలు ఉన్నారు. వీరిలో నలుగురు కుమార్తెలు మృతి చెందారు. గాలయ్య కుటుంబ సభ్యులు మొత్తం 49 మంది ఒకే చోట చేరి జన్మదిన వేడుకలను నిర్వహించారు.

'పార్టీకి, పదవికి రాజీనామా చేయండి.. లేకపోతే చంపేస్తాం'!

» రఘునందన్‌కు మావోయిస్టుల పేరిట బెదిరింపు

బంజరాహిల్స్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పార్టీకి, పదవికి రాజీనామా చేయండి లేకపోతే చంపేస్తామంటూ బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు మావోయిస్టుల పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి బెదిరించారు. ఈ నెల 8వ తేదీన బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12లోని తన కుమార్తె డాక్టర్ ఎం. సింధు ఇంటికి రఘునందన్‌రావు వచ్చారు. ఇదే సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి తాను మావోయిస్టునని వెంటనే పార్టీకి రాజీనామా చేయడంతో పాటు, ఎంపీ పదవిని వదులుకోవాలని లేదంటే చంపేస్తామని బెదిరించాడు. దాంతో ఈ నెల 13న పోలీసులకు రఘునందన్‌రావు ఫిర్యాదు చేశారు. మూడు నెలలుగా ఇలాంటి బెదిరింపు కాల్స్ తనకు అనేకమార్లు వచ్చాయని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోడు రైతుల తరలింపులో ఉద్రిక్తత

» వాహనాన్ని అడ్డుకున్న ప్రవీణ్‌కుమార్.. అరెస్టు

కౌటాల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తాము సాగు చేస్తున్న పోడు భూములు తమకు దక్కేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు ఎనిమిది రోజులుగా పాదయాత్ర చేస్తున్న కుమురం భీం జిల్లా చింతలమానేపల్లి మండలం దిందా గ్రామస్థులను గురువారం అల్వాల్ సమీపంలో పోలీసులు అరెస్టు చేశారు. వారిని వారి స్వగ్రామానికి ప్రత్యేక బస్సులో తరలిస్తుండగా బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కాగజ్‌నగర్ సమీపంలో అడ్డుకుని రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని కౌటాల పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్కడికి బీఆర్ఎస్ శ్రేణులు పెద్దసంఖ్యలో చేరుకోవడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. సాయంత్రం ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను పోలీసులు విడుదల చేశారు. కాగా, పోడు భూములకు పట్టాలివ్వాలని రోడ్డెక్కిన రైతులకు మద్దతుగా నిలిచిన బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేస్తారా? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ప్రశ్నించారు. రైతుల చేతులకు బేడీలు వేయడం, అక్రమంగా అరెస్టు చేయడాన్ని గురువారం 'ఎక్స్' వేదికగా ఖండించారు.

రాత్రి కరెంట్ వాడితే రాయితీల్లేవ్!

» హెచ్‌టీలో కొన్ని కేటగిరీలకు ఇస్తున్న రాయితీ ఎత్తివేతకు డిస్కమ్‌ల నిర్ణయం

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాత్రిపూట డిమాండ్ ఉండని సమయంలో కరెంట్‌ను వినియోగించే హైటెన్షన్(హెచ్‌టీ)లోని కొన్ని కేటగిరీలకు ఇస్తున్న రాయితీని ఎత్తివేయాలని విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కమ్‌లు) నిర్ణయించాయి. ఈమేరకు తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి(టీజీఈఆర్‌సీ)లో పిటిషన్ దాఖలు చేశాయి. హెచ్‌టీ-1 (ఏ) ఇండస్ట్రీ జనరల్, హెచ్‌టీ-1(ఏ) పౌల్ట్రీ ఫామ్స్, హెచ్‌టీ-2(ఏ) ఇతరులు, హెచ్‌టీ-2(బీ) పూర్తిగా మతపరమైన సంస్థలు, హెచ్‌టీ-3లోని ఎయిర్‌పోర్టులు, రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు, హెచ్‌టీ-9 ఎలక్ట్రిక్ చార్జింగ్ కేంద్రాలు రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల దాకా కరెంట్ వాడితే ప్రతి యూనిట్‌కు రూ.1.50 రాయితీ ఇస్తూ ఈఆర్‌సీ టారిఫ్ ఆర్డర్ ఇచ్చింది. దీన్ని సవరించి రాయితీని ఎత్తివేయాలని కోరుతూ డిస్కమ్‌లు పిటిషన్ వేశాయి. ఇక ఉదయం 6 నుంచి 10 గంటల దాకా, సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల దాకా పీక్ డిమాండ్ ఉన్న సమయంలో విద్యుత్‌ను ఆయా కేటగిరీ వినియోగదారులు వాడితే ఈఆర్‌సీ ఖరారు చేసిన టారిఫ్‌కన్నా అదనంగా యూనిట్‌కు రూ.1 వసూలు చేస్తుండగా దీన్ని యథాతథంగా కొనసాగించనున్నారు. రాత్రి పూట బహిరంగ విపణిలో (ఎనర్జీ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా-ఐఈఎక్స్) కరెంట్ ధరలు యథాతథంగా ఉన్నందున రాయితీ ఎత్తివేయాలని నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నాయి. .

రూ.23.46 కోట్ల నిధుల దుర్వినియోగం!

» మహిళా సహకార ఆర్థిక సంస్థలో భారీ మోసం

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మహిళా సహకార ఆర్థిక సంస్థలో జరిగిన రూ.23.46 కోట్ల నిధుల దుర్వినియోగానికి సంబంధించిన కేసులో నాటి ఉన్నతాధికారి ఆకుల కిషన్ (ఐఎఫ్ఎస్)తో పాటు ఇతరులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) అధికారులు చార్జీషీట్ దాఖలు చేశారు. ఈ చార్జీషీటును బుధవారం కోర్టు పరిగణనలోకి తీసుకుందని ఈడీ హైదరాబాద్ జోన్ అధికారులు తెలిపారు.

రోడ్డు పక్కన కారులో నిద్రిస్తున్న వారిపై దాడి, చోరీ

» సంగారెడ్డి జిల్లాలోని జాతీయ రహదారిపై ఘటన

జహీరాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని బూచనెల్లి గ్రామశివారులో 65వ నెంబరు జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. రహదారి పక్కన కారు ఆపి నిద్రిస్తున్న ప్రయాణికులపై దుండగులు కత్తితో దాడి చేసి రెండు తులాల బంగారు ఆభరణాన్ని దొంగలించి పరారయ్యారు. చిరాగ్‌పల్లి ఎస్సై రాజేందర్ రెడ్డి కథనం ప్రకారం.. ఏపీలోని ప్రకాశం జిల్లాకు చెందిన కృష్ణారెడ్డి కుటుంబం ముంబైలో స్థిరపడింది. హైదరాబాద్‌లోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి హాజరైన కృష్ణారెడ్డి దంపతులు, వారి స్నేహితుడు వెంకటేశం, అతని భార్యతో కలిసి కారులో ముంబై తిరుగు ప్రయాణమయ్యారు. వీరు మార్గమధ్యలో బూచనెల్లి సమీపంలోని ఓ పెట్రోల్ బంకు వద్ద రోడ్డు పక్కన కారు ఆపి నిద్రించారు. అయితే, అర్ధరాత్రి తర్వాత ముగ్గురు దుండగులు వీరిపై కత్తితో దాడి చేసి కృష్ణారెడ్డి భార్య మెడలోని బంగారు ఆభరణాన్ని ఎత్తుకెళ్లారు. ఈ ఘటనలో కృష్ణారెడ్డికి గాయాలయ్యాయి. కేసు దర్యాప్తులో ఉంది.

రాజునాయక్‌కు శౌర్య పతకం

తెలంగాణ పోలీసు కానిస్టేబుల్‌కు దక్కిన గౌరవం

» ఏఎస్ఐ సిద్ధయ్య, కానిస్టేబుల్ హుస్సేన్‌లకు.. రాష్ట్రపతి పోలీస్ విశిష్ట సేవా పతకం

» 21 మంది తెలంగాణ పోలీసులకు పతకాలు

» స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా.. పోలీస్ పతకాలను ప్రకటించిన కేంద్రం

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు చెందిన కానిస్టేబుల్ క్రాట్రావత్ రాజు నాయక్ శౌర్య పతకానికి ఎంపికయ్యారు. ఆయనతోపాటు ఏఎస్సై మ్యాతరి సిద్ధయ్య, కానిస్టేబుల్ హుస్సేన్ నిడమనూరికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు లభించాయి. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం పోలీసు, అగ్నిమాపక శాఖ, హోంగార్డు, సివిల్ డిఫెన్స్, కరెక్షనల్ సర్వీసెస్(జైళ్లశాఖ)కు చెందిన 1,090 మంది అధికారులకు శౌర్య/సేవా పోలీస్ పతకాలను ప్రకటించింది. గురువారం కేంద్ర హోంశాఖ ఈ మేరకు జాబితాను విడుదల చేసింది. 1,090 మందిలో.. 226 మందికి శౌర్య పతకాలు(జీఎం), 89 మందికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు(పీఎస్ఎం), 635 మందికి ప్రతిభాపూర్వక సేవా పతకాల(ఎంఎస్ఎం)ను ప్రకటించింది. ఇందులో తెలంగాణకు చెందిన ఒకరికి శౌర్య పతకం, ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 21 మంది పోలీసులకు, నలుగురు అగ్నిమాపక శాఖ అధికారులు, ఇద్దరు హోంగార్డులు, జైళ్ల శాఖ నుంచి ఒకరికి ప్రతిభాపూర్వక సేవా పతకాలు లభించాయి. ప్రాణాలు, ఆస్తులను కాపాడటంలో, నేరాలను నిరోధించడంలో లేదా నేరస్థులను అరెస్టు చేయడానికి విధి నిర్వహణలో ప్రదర్శించిన తెగువ ఆధారంగా రాష్ట్రపతి శౌర్య పతకం(పీఎంజీ), శౌర్య పతకం(జీఎం) లభిస్తాయి. విధి నిర్వహణలో అందించిన విశిష్ట సేవకు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం(పీఎస్ఎం), విలువైన సేవకు ప్రతిభాపూర్వక సేవా పతకం(ఎంఎస్ఎం) అందజేస్తారు.

వీరికే పతకాలు

క్రాట్రావత్ రాజు నాయక్‌కు శౌర్య పతకం, మ్యాతరి సిద్ధయ్య, హుస్సేన్ నిడమనూరికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు లభించాయి. నల్లమల రవి(డీసీపీ), తొగరు కరుణాకర్(డీసీపీ/అసెంబ్లీ చీఫ్ మార్షల్), జె.షేక్ షమీర్(డీసీపీ), పుట్ట దేవీదాస్(కమాండెంట్/సచివాలయం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్), ఆంజనేయరాజు(సీఐఎస్ఐఫ్ డిప్యూటీ కమాండెంట్, రామగుండం), మేకల అబ్రహం(ఏఆర్ఎస్సై), శిందే ప్రకాశ్(ఏఆర్ఎస్సై), ముడావత్ దశరథ్(ఏఆర్ఎస్సై), రామ్‌దులార్ సింగ్ (ఏఆర్ఎస్సై), మహమ్మద్ మొయిజుద్దీన్(ఏఎస్సై), రాజేశ్వరి శ్రీనివాస్(ఏఎస్సై), రుద్ర కృష్ణకుమార్ (ఏఎస్సై), ఖాన్ వహీదుల్లా మహమ్మద్(లీడింగ్ ఫైర్‌మన్- జగిత్యాల జిల్లా), తల్లా నాగేశ్(లీడింగ్ ఫైర్‌మన్- ములుగు జిల్లా), సాధిక్ మహమ్మద్(లీడింగ్ ఫైర్‌మన్- భద్రాద్రి జిల్లా), బీరెడ్డి గోపాల్ రెడ్డి(లీడింగ్ ఫైర్‌మన్- కరీంనగర్ జల్లా), రాజు జొన్నాడ(హోంగార్డ్), సంగం పిసరి(హోంగార్డ్)కు ప్రతిభాపూర్వక సేవా పతకాలు లభించాయి.

రైల్వే రక్షణ దళానికి..

దక్షిణ మధ్య రైల్వే రక్షణ దళాని(ఆర్పీఎఫ్)కి చెందిన ఇద్దరు పోలీసు అధికారులు రాష్ట్రపతి పోలీసు పతకాలకు ఎంపికయ్యారు. వీరిలో గుంటూరు డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ గొల్లమూడి మధుసూదనరావు, రేణిగుంట అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ కె.రాజగోపాల రెడ్డి ఉన్నారు. వీరిద్దరినీ దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ అభినందించారు.

'ఆపరేషన్ సిందూర్' వీరులకు శౌర్య పతకాలు

» 16 మంది బీఎస్ఎఫ్ జవాన్లకు ప్రకటించిన కేంద్రం

న్యూఢిల్లీ, ఆగస్టు 14: ఆపరేషన్ సిందూర్ సమయంలో అసాధారణ ధైర్యసాహసాలు, అసమాన శౌర్యపరాక్రమాలు ప్రదర్శించిన 16 మంది సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) జవాన్లకు శౌర్య పతకాలు లభించాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం వివిధ దళాలకు పురస్కారాలు ప్రకటించింది. సరిహద్దుల్లోని వేర్వేరు పోస్టుల్లో విధులు నిర్వర్తించిన సబ్ ఇన్‌స్పెక్టర్ వ్యాస్ దేవ్, కానిస్టేబుల్ సుద్ది రభా, అసిస్టెంట్ కమాండెంట్ అభిషేక్ శ్రీవాస్తవ్, హెడ్ కానిస్టేబుల్ బ్రిజ్ మోహన్ సింగ్, కానిస్టేబుళ్లు భూపేంద్ర బాజ్‌పాయ్, రాజన్ కుమార్, బసవరాజ శివప్ప సుంకడ, దేపేశ్వర్ బర్మన్, డిప్యూటీ కమాండెంట్ రవీంద్ర రాథోడ్, ఇన్‌స్పెక్టర్ దేవీలాల్, హెడ్ కానిస్టేబుల్ సాహిబ్ సింగ్, కానిస్టేబుల్ కన్వరాజ్ సింగ్, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఉదయ్ వీర్ సింగ్, ఏఎస్ఐ రాజప్ప, కానిస్టేబుల్ మనోహర్ క్సాల్క్సో, అసిస్టెంట్ కమాండెంట్ అలోక్ నేగి అవార్డుకు ఎంపికయ్యారు. వీరిలో కొందరు పాక్ డ్రోన్‌లను కూల్చివేయగా, మరికొందరు శత్రు దేశ నిఘా వ్యవస్థలను ధ్వంసం చేశారు. గాయపడిన సహచరులను రక్షించారు. కాగా, వివిధ ఆపరేషన్లలో పాల్గొన్న ఇతర పోలీసులు, కేంద్ర సాయుధ పోలీసు దళాల సిబ్బందికి కూడా శౌర్య పతకాలు ప్రకటించింది. వీరిలో జమ్మూ కశ్మీర్ పోలీసులు 128 మంది, 20 మంది సీఆర్‌పీఎఫ్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు 14 మంది ఉన్నారు.

1,090 మందికి పోలీసు మెడల్స్

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా 1,090 మంది పోలీసు సిబ్బందికి కేంద్రం సేవా పతకాలను ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ గురువారం అవార్డుల జాబితాను విడుదల చేసింది. 233 మందికి గ్యాలంట్రీ పతకాలు(జీఎం), 99 మందికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు(పీఎస్ఎం), 758 మందికి పోలీసు విశిష్ట సేవా (ఎంఎస్ఎం) పతకాలను ప్రకటించింది. శౌర్య పతకాలు పొందిన వారిలో జమ్మూ కశ్మీర్ నుంచి అత్యధికంగా 152 మంది ఉండగా, నక్సల్ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్న 54మందికి, ఇతర ప్రాంతాలకు చెందిన 27 మందికి అవార్డులు ఇవ్వనుంది.

బాలికపై హత్యాచారం కేసులో

దోషికి రెండు ఉరి శిక్షలు

» మరణించే వరకు అమలు చేయాలి

» హత్య, అత్యాచార నేరానికి ఐపీసీ, పోక్సో చట్టాల ప్రకారం ఉరి

» సాక్ష్యాధారాలు నాశనం చేసినందుకు ఐపీసీ ప్రకారం ఏడేళ్ల కారాగారం

» రూ.1.10 లక్షల జరిమానా కూడా

» సంచలన తీర్పు వెల్లడించిన నల్లగొండ జిల్లా న్యాయస్థానం



బాలికపై లైంగికదాడి, హత్య కేసులో ఉరిశిక్ష పడిన నిందితుడిని నల్లగొండ జిల్లా జైలుకు తరలిస్తున్న పోలీసులు

నల్లగొండ క్రైం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికపై లైంగిక దాడి చేసి ఆమెను హత్య చేసిన కేసులో దోషికి మరణ దండన, రూ.1.10 లక్షల జరిమానా విధిస్తూ నల్లగొండ జిల్లా న్యాయస్థానం సంచలన తీర్పు ప్రకటించింది. ఐపీసీ, పోక్సో చట్టాల ప్రకారం రెండు ఉరి శిక్షలు, సాక్ష్యాధారాలను నాశనం చేసినందుకు ఐపీసీ ప్రకారం ఏడేళ్ల జైలు శిక్ష వేస్తూ నల్లగొండ రెండో అదనపు జిల్లా జడ్జి, ఎస్సీ, ఎస్టీ కోర్టు, అత్యాచార, పోక్సో చట్టం ఫాస్ట్ ట్రాక్ కోర్టు న్యాయమూర్తి ఎన్. రోజారమణి గురువారం తీర్పు వెల్లడించారు. ఈ కేసును తీవ్రమైన నేరంగా పరిగణిస్తూ 'రెండు ఉరి శిక్షలు' వేస్తున్నట్లుగా తీర్పులో పేర్కొన్నారు. నల్లగొండ పట్టణానికి చెందిన మహ్మద్ ముకర్రం మాంసం దుకాణంలో పని చేసేవాడు. 2013 ఏప్రిల్ 28న మహ్మద్ ముకర్రం అదే ప్రాంతానికి చెందిన బాలిక పై ఇంట్లో ఎవరూ లేని సమయంలో లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం ఆమెను చున్నీతోనే ఉరివేసి చంపి, మృతదేహాన్ని పక్కనే ఉన్న డ్రైనేజీ కాల్వలో పడవేశాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. బాలిక మృతదేహాన్ని మూడు రోజుల తర్వాత నాలాలో గుర్తించారు. ఈ కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు నిందితుడిని గుర్తించి అన్ని సాక్ష్యాధారాలతో చార్జిషీట్ దాఖలు చేశారు. నిందితుడిపై పోక్సో, ఐపీసీ చట్టాల ప్రకారం కేసులు నమోదు చేశారు. కోర్టులో వాదోపవాదాల అనంతరం నిందితుడు నేరానికి పాల్పడ్డాడని, శిక్షకు అర్హుడిగా నిర్ధారించి నల్లగొండ జిల్లా న్యాయస్థానం గురువారం ఈ మేరకు తీర్పు వెల్లడించింది. హత్య చేసినందుకు దోషి మహ్మద్ ముకర్రంకు ఐపీసీ ప్రకారం ఉరి శిక్ష (మరణించే వరకు మెడకు ఉరి), రూ.50 వేల జరిమానా విధించారు. ఆ జరిమానా చెల్లించకపోతే అదనంగా ఆరు నెలల జైలు శిక్ష విధించారు. అత్యాచారం చేసినందుకు పోక్సో చట్టం ప్రకారం ఉరి శిక్ష (మరణించే వరకు మెడకు ఉరి), రూ.50 వేల జరిమానా, జరిమానా చెల్లించకపోతే ఆరు నెలల జైలుశిక్ష విధించారు. ఆధారాలు నాశనం చేసినందుకు ఐపీసీ చట్టం ప్రకారం ఏడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా, చెల్లించకపోతే ఆరు నెలలు అదనంగా జైలుశిక్ష విధించారు. బాధితురాలి తల్లికి జిల్లా న్యాయసేవా సహకార సంస్థ ద్వారా రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని న్యాయమూర్తి తీర్పులో ఆదేశించారు.

ఎంతటి వారికైనా శిక్ష తప్పదు: శరత్ చంద్ర పవార్, నల్లగొండ జిల్లా ఎస్పీ

తప్పు చేస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. మైనర్ బాలికపై అత్యాచారం, హత్య చేసిన నిందితుడికి ఉరిశిక్ష విధించిన నేపథ్యంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పోక్సో కేసుల్లో ప్రభుత్వమే పరిహారం చెల్లిస్తుందని చెప్పారు. బాలికపై లైంగికదాడి, హత్య కేసులో సరైన సాక్ష్యాధారాలు సేకరించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసి శిక్ష పడేలా చేసిన పోలీస్ అధికారులతో పాటు ప్రభుత్వ న్యాయవాదులను ఎస్పీ అభినందించడంతో పాటు సన్మానించారు. అదేవిధంగా నిందితుడికి ఉరి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులకు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు మృతురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.